SAPTHAGIRI (TELUGU)
ILLUSTRATED MONTHLY
Volume: 53, Issue: 1
JUNE - 2022, Price Rs.5/-

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

సచిత్రమాసపత్రిక

జూన్ 2022 వెల రూ. 5/-
పుటలు-56



వజ్రకవచసమర్పణ (12-06-2022)

ముత్తంగికవచసమర్పణ (13-06-2022)

స్వర్ణకవచసమర్పణ (14-06-2022)

## తిరుమల శ్రీవారి జ్యేష్ఠాభిషేక మహోత్సవం

(12-06-2022 నుండి 14-06-2022 వరకు)

**15-04-2022న ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణోత్సవానికి ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాలతలంబ్రాలు సమర్పించిన ఆంధ్రప్రదేశ్‌రాష్ట్ర గౌరవముఖ్యమంత్రి మాన్యులు శ్రీ వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డిగారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి దంపతులు, ప్రముఖులు మరియు ఉన్నతాధికారులు**




















## గీతాశ్లోకార్థసారం

**శ్లో : నిహత్య ధార్తరాష్ట్రాన్నః కా ప్రీతిస్స్యా జ్జనార్దన ।**
**పాపమేవాశ్రయేదస్మాన్ హత్వైతానాతతాయినః ॥**

(శ్రీమద్భగవద్గీత 01వ అధ్యాయం- 36వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** జనార్దన= ఓ కృష్ణా !; ధార్తరాష్ట్రాన్= దుర్యోధనాదులను; నిహత్య= చంపి; నః= మనకు; కాప్రీతిః= ఏమి సంతోషము; స్యాత్= కలుగును; ఆతతాయినః= దుర్మార్గులగు, ఏతాన్= వీరిని; హత్వా = చంపిన; అస్మాన్= మనలను; పాపమేవ= పాపమే; ఆశ్రయేత్= పొందును.

**భావం:** ఓ కృష్ణా! దుర్యోధనాదులను చంపుటచే మనకేమి సంతోషం కలుగును? దుర్మార్గులైనను వీరిని చంపుటవలన మనకు పాపమే కలుగును.

---

## కుడియెడమ కాంతల గోవిందరాజు

కొలువై వున్నాడు వీడె గోవిందరాజు
కొల కొల నేగి వచ్చే గోవిందరాజు

గొడుగుల నీడల గోవిందరాజు
గుడిగొన్న పడిగెల గోవిందరాజు
కుడియెడమ కాంతల గోవిందరాజు
కొడిసాగె పువుజుల గోవిందరాజు

గొప్పగొప్ప పూదండల గోవిందరాజు
గుప్పేటి వింజామరల గోవిందరాజు
కొప్పపై చుంగుల తోడి గోవిందరాజు
కుప్పి కటారము తోడి గోవిందరాజు

గోరబు సింగారాల గోవిందరాజు
కురులు దువ్వించుకొని గోవిందరాజు
తిరుపతిలో నను తిరమై శ్రీ వేంకటాద్రి
కురిసీ వరము లెల్ల గోవిందరాజు

(సంపుటం-13, సంకీర్తన-168)



*గోవిందరాజస్వామి తనకురులను వింతవింత సింగారాలతో కొప్పగా వేసుకొని; సుందరమైన రకరకాలచెంగులతో కూర్చబడిన కుచ్చులను.. కొప్పచుట్టూ... అలంకరించుకొని ఉన్నాడు. ఎన్నోరకాల... గొప్పగొప్ప పూలదండలను రమణీయంగా ధరించిఉన్నాడు. ఆపై విలాసంగా బంగారుతొడుగు కటారిని ధరించి, ఇరువైపులా తన దేవేరులతో ఠీవిగా కొలువై ఉన్నాడు. తన భృత్యగణంతో వింజామరలతో వీయించుకుంటూ ఉన్నాడు. అనంతశేషునిపడగలనే గొడుగులనీడలో చిద్విలాసంగా వేంకటాద్రియందునూ, తిరుపతిలోనూ కొలువైఉన్నాడు. తనను ఆశ్రయించ వచ్చిన భక్తుల దుర్గుణాలైన వైరం, దోషం, హింస, పాపం, బాధలనే వాటిని పూర్తిగా ప్రక్షాళనమయ్యేలా కటాక్షిస్తున్న గోవిందరాజస్వామి మూర్తిమత్వాన్ని, భక్తులపై వారి కటాక్షసిద్ధిని ఈ సంకీర్తనలో... హృద్యంగా వర్ణించాడు అన్నమయ్య.*



# గోలోకం


- శ్రీ జమలాపురం ప్రసాదరావు,
78425 01843

మునులు మరియు దేవతలు కలిసి బ్రహ్మనివాస మైన సత్యలోకానికి వెళ్లారు. బ్రహ్మదేవునితో మానవులకు సత్య లోకానికి వచ్చే మార్గమేదని వినయంగా చతుర్ముఖుని ప్రార్థిం చారు. అందుకు బ్రహ్మ సత్యలోకానికి ముందుగా వెళ్లే మార్గం 'గో'మార్గమని సూచిస్తూ 'గో' మాహాత్మ్యాన్ని ముందుగా తెలుసు కొనవలసి ఉన్నదని వివరించ మొదలుపెట్టాడు. నాకును, శంకరుడికి, విష్ణుమూర్తికి ప్రీతిపాత్రమైన వస్తువులు రెండే రెండున్నాయి. అవి మిత్రులు గోవులు. కులం 'గో' కులం. గోవులు ఎల్లవేళలా పవిత్రాలు, మంగళప్రదాలు. గోశృంగముల నడిమిభాగాన శంకరుడు విలసిల్లుతూంటాడు.

మానవుడు నిండుమనసుతో గోదానంచేస్తే పితృదేవతా గణాలు కొనియాడతాయి. ఋషులు ప్రశంసిస్తారు. దేవతలకు పట్టరానంత సంతోషం కలుగుతుంది. గోమయం యమునానది. గోమూత్రం నర్మద. గోక్షీరం గంగానది. గోవుకన్నా పవిత్రమైనది ఏదీ లేదు. దాని అవయవాల్లో పదునాల్గుభువనాలు ప్రతిష్ఠితాలు అయి ఉన్నాయి కనుక ఇహపరలోకాల్లో శుభం కలుగుతుంది. భూసురవరులకు ఏ పురుషుడు గోవును దానం చేస్తాడో ఆ పురుషుడు లోకంలో మహాఖ్యాతితో ప్రశంసలు పొందుతాడు.

స్తుతిపూర్వకంగా ఆవులచుట్టూ అతిభక్తియుతుడై ప్రదక్షిణలు చేసేవారికి, సమస్తధరణికి నియమంగా ప్రదక్షిణ చేసిన పుణ్యాలు లభిస్తాయి. సుస్థిరమంగళప్రదాలు అయిన ధేనుబృందాల చుట్టుప్రక్కల సందడి చేయాలని త్రిమూర్తులైన మాకు అనిపిస్తూంటుంది. ఎవరు గోవు శరీరావయవాలకు నీరాజనం పలుకుతారో అట్టివారి పాతకాలు తొలగిపోతాయి. వారి గృహాల్లో సకలశుభాలు కలుగుతాయి. గోవులు సమస్త భూతధాత్రిని నిరుపమానంగా కాపాడువ్యవస్థాస్వరూపులు. ఊర్ధ్వ లోకాల్లో నాకు నివాసమైన ఈ సత్యలోకానికి మీద ఉన్న విష్ణుమూర్తిలోకం అయిన వైకుంఠం. కుమారస్వామి లోకం ఇంకాపైన ఉంది. ఆ కుమారస్వామిలోకానికి ఆవల ఉన్నది శివుడిలోకం కైలాసం. ఆ కైలాస సమీపస్థలంలో గోకులం అనే లోకం విలసిల్లుతున్నది. అటువంటి గోకులంలో సంపూర్ణ సంపదలను కురిపించు అలలతో పాలవాహినులు ఎల్లవేళలా ప్రవహిస్తూంటాయి. ముదిమిని(వృద్ధాప్యం) దరికి రానియ్యక శాశ్వతకౌమార దశాసౌష్ఠవాలు అందిస్తూంటాయి. ఘృత వాహినులు స్రవించుపాయసపర్వతాలు బహుళసంఖ్యలో ఆ గోలోకంలో విలసిల్లుతూంటాయి. ఏమాత్రమూ కొదువ లేకుండా మంగళకర వస్తు సంచయం సమగ్రంగా మెరుగులు కనిపిస్తూంటాయి. శంకరుడి నివాసమైన మహాకైలాసం ఆ గోలోకానికి ఇరుగుపొరుగులోకం కావడంవల్ల సదా శివుడి నెయ్యాన్ని ఎల్లవేళలా అనుభవిస్తూ, కల్యాణనిధులును, అలఘ మూర్తులున్ను అయిన 'సుశీల' ఆదిగా గల గోమాతృకలు కలిగి ఉంటారు. గోలోకం ఇంతటి ప్రశస్తి కెక్కింది కనుకనే గోవులను మించిన ఉపాసింపదగింది లోకంలో కానరాదు. గోదాతలకంటే అతిశయించిన పుణ్యవంతులు కానరారు. సరస్వతీనదీతీర్థంలో మృతిచెందినవారున్నూ, సూర్యుడు మకరరాశిగతుడై ఉండగా ప్రయాగతీర్థంలో లేక త్రివేణీసంగమతీర్థంలో మాఘస్నానమాచ రించిన కృతార్థులున్నూ, వారణాసిలోని పంచనదీతీర్థంలో, కార్తిక మాసంలో తీర్థం ఆడిన పాపదేహాలున్నూ, కురుక్షేత్రంలో కాకణికా మాత్రం (గవ్వ ఎత్తు గలది) బంగారం దానంచేసినా సత్య లోకంలో నిజకర్మోచిత స్థానంలో వారంతా కల్పాంతస్థాయి సుఖాలు అనుభవిస్తారంటూ చతుర్ముఖుడు మహర్షులకు వివరిం చాడు.

*"భూలోకవాసులకు గోశాలలు పరమపవిత్రం. గో దత్తత మహాపుణ్యం"* (కాశీఖండంనుండి గ్రహింపబడినది)






50 వసంతాల
1970-2020
SAPTHAGIRI
తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక


# సప్తగిరి


సంపుటి : 53 జూన్, 2022 సంచిక : 01


వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి ॥


**గౌరవ సంపాదకులు**
శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి(ఎఫ్.ఏ.సి.), తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
డా॥ కె.రాధారమణ
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకురాలు**
శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి,
ఎం.ఏ., ఎం.ఇడి., ఎం.సి.జె., ఎల్.పి.టి.,

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

సప్తగిరి మాస పత్రిక
ఇతర వివరాలకు
ఫోన్ నెంబర్లు
0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-


## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| గోలోకం | శ్రీ జమలాపురం ప్రసాదరావు | 04 |
| తిరుపతి శ్రీగోవిందరాజస్వామి | డా॥ పేట శ్రీనివాసులురెడ్డి | 07 |
| అప్పలాయగుంట శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి | శ్రీ గోపీకృష్ణ | 08 |
| శ్రీమద్భగవద్గీత | విద్వాన్, డా॥ ఈ.జి. హేమంతకుమార్ | 09 |
| గానం | భారత్‌భాషాభూషణ్ సాహితీకోకిల శ్రీమతి సుందరవల్లి శ్రీదేవి | 11 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 13 |
| శ్రీకృష్ణామృతం | "అనంత" (కృష్ణసుందరి సత్తిరాజు) | 14 |
| వృక్షాలు మన నేస్తాలు | శ్రీ వద్దిరాజు జనార్దనరావు | 15 |
| ముక్కోపం | శ్రీమతి డి.జ్యోతిర్మణి | 17 |
| ఓం | డా॥ శివలెంక ప్రకాశరావు | 19 |
| యోగం | శ్రీ జె.నరసింహరావు | 21 |
| అవతారం | శ్రీ రాచూరి వెంకటరమణ | 23 |
| నమామి గోవిందం | డా॥ నొస్సం నరసింహాచార్య | 31 |
| అన్బిల్ (బాణాపురం) | ఆచార్య చక్రవర్తిరంగనాథన్ | 35 |
| శ్రీమద్భగవద్గీత | ఆచార్య కుప్పా విశ్వనాథశర్మ | 37 |
| అన్నం పరబ్రహ్మ స్వరూపం | శ్రీభారత్‌జ్యోతి ఆచార్య డా॥ యోగశ్రీ | 38 |
| నేటి యువతలో.. ఆధ్యాత్మికభావం | శ్రీ ఎల్.ప్రఫుల్లచంద్ర | 40 |
| గౌరవం | ఆంధ్రరత్న ఆచార్య జి.వి.శేషారెడ్డి | 42 |
| తలచిన పలికేవు స్వామి!! | శ్రీమతి భాస్కర భారతీదేవి | 44 |
| వరం | డా॥ నందుల గోపాలకృష్ణమూర్తి | 46 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 48 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కె.కృష్ణాచార్య<br>నిర్వహణ- మహామహోపాధ్యాయ ఎస్.లక్ష్మణయ్య | 49 |
| నమ్మాళ్వార్ (చిత్రకథ) | కథ: శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు<br>చిత్రాలు: శ్రీ కె.తులసీప్రసాద్ | 50 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు | 52 |
| అవును!! | శ్రీమతి ఆసూరి ఉషారాణి | 53 |
| బాలవినోదం | నిర్వహణ: శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి | 54 |


ముఖచిత్రం : శ్రీవారి జ్యేష్ఠాభిషేక మహోత్సవం, తిరుమల
వెనుక చిత్రం : ఉభయదేవేరులతో శ్రీగోవిందరాజస్వామివారు, తిరుపతి


ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.



24 గంటలూ పనిచేసే
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777 / 2233333





వెబ్‌సైట్- www.tirumala.org; 'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri.helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

సంపాదకీయం

# కైంకర్యపు పూలపరిమళం

తిరుమలకొండ నిత్యకల్యాణమూ పచ్చతోరణంగా విలసిల్లుతూంటుంది. ప్రతిరోజూ స్వామికి ఉదయం సుప్రభాతసేవ మొదలు రాత్రి ఏకాంతసేవవరకు నిత్య, వార, పక్ష, మాస, సంవత్సరఉత్సవాల్లో ఎన్నోరకాలైన పుష్పాలను వివిధరకాలైన మాలలుగా కూర్చి అలంకరిస్తారు. ఆ పూలన్నీ కూడా ఎంతో పరిమళంతో స్వామికి ఎంతో ఆనందాన్ని చేకూరుస్తుంటాయి.

శ్రీవేంకటేశ్వరస్వామి పుష్పాలంకారప్రియుడు. తిరుమలక్షేత్రం 'పుష్పమండపం' అన్న ప్రశస్తికి 'పూలఅర' ప్రధానతార్కాణంగా ఉంది. ఆ కోవలో శ్రీవేంకటేశ్వరస్వామివారికి నిత్యమూ జరిగే పుష్పకైంకర్యాన్ని 'యామునోత్తురై' పేరుమీదనే నిర్వహిస్తారు. 'యామునోత్తురై'తో సంబంధమున్న ప్రసిద్ధవ్యక్తియే అనంతాళ్వారులు.

శ్రీవారి పుష్పకైంకర్యానికిగాను తిరుమలక్షేత్రంలో ఎన్నోరకాల పుష్పజాతులతో కూడిన నందన వనాలు, దివ్యవనాలు ఎన్నో ఉన్నాయి. ఈ వనాల్లోని పూలతోనే స్వామికైంకర్యానికి మాలలు కూర్చబడతాయి. తిరుమలలోని స్వామికేకాక ఇతర దేవతామూర్తులకుకూడా పూలమాలలు కూర్చబడతాయి. అలాగే, తి.తి.దే. అనుబంధఆలయాల్లోని దేవతామూర్తుల కైంకర్యాలకుకూడా ఈ పూలన్నీ సరఫరా చేయబడతాయి.

ఇలా కైంకర్యాలకోసం అలంకరించబడిన ఈ పూలమాలల నిర్మాల్యాన్ని తిరుమలలోని 'బంగారు బావి'లో వేయడం జరుగుతుంది. తిరుమలలోని పూలన్నీ స్వామివారిసేవకే తప్ప ఇతరులకు నిషిద్ధం. స్వామికి అలంకరింపబడిన పుష్పాలు భక్తులకు ఇవ్వబడవు. ఇదీ ఇక్కడి సంప్రదాయం.

ఆ కోవలో ఈ పుష్పాలనిర్మాల్యాన్ని వృథాగా పోనివ్వకూడదనే సదుద్దేశ్యంతో తి.తి.దే. ఒక బృహత్తరప్రణాళికను ప్రవేశపెట్టడం జరిగింది. ఆ ప్రణాళికలో భాగంగా డ్రైఫ్లవర్ టెక్నాలజీతో ఫోటో ఫ్రేములు, కీచైన్లు, పేపర్‌వెయిట్స్, డాలర్లు, పెన్నులు మరియు పెన్నుస్టాండులువంటి ఉత్పత్తులను తయారుచేయించి విడుదల చేసింది. అలాగే ఏడురకాలైన పరిమళపు అగరుబత్తీలను కూడా తయారు చేయడం జరిగింది. ఈ ఉత్పత్తులన్నీకూడా తి.తి.దే. ప్రధానకేంద్రాలైన **తిరుమల** *(శ్రీవారి లడ్డూకౌంటర్ కాంప్లెక్స్, శ్రీవారిఆలయంఎదురుగా, లేపాక్షిఎంపోరియంఎదురుగా, అన్నప్రసాదంకాంప్లెక్స్‌లలో);* **తిరుపతి** *(తి.తి.దే. పరిపాలనాభవనంఎదురుగా(కె.టి.రోడ్డు), శ్రీకపిలేశ్వరస్వామిఆలయప్రాంగణం, ధ్యానమందిరం స్టాల్ (శ్రీగోవిందరాజస్వామి రథంప్రక్కన), శ్రీగోవిందరాజస్వామి ఆలయప్రాంగణం, విష్ణునివాసం వసతి సముదాయంస్టాల్, శ్రీకోదండరామస్వామి ఆలయప్రాంగణం, శ్రీనివాసం వసతిసముదాయంస్టాల్, తూర్పు రైల్వేస్టేషన్‌లలో);* **తిరుచానూరు** *(శ్రీపద్మావతీఅమ్మవారిఆలయంప్రాంగణంలో),* **శ్రీనివాసమంగాపురం** *(శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామిఆలయప్రాంగణంలో)* మొదలైన ప్రదేశాల్లో అమ్మకానికి ప్రదర్శనలో ఉంచబడ్డాయి.

ఈవిధంగా భగవంతుని పుష్పాలనిర్మాల్యంతో చేయబడిన ఈ వస్తువులను మన గృహములందు ఉంచుకొన్నట్లైతే స్వామి మనఇంట్లోనే కొలువై, మనతోనే ఉన్నట్లున్న అనుభూతి కల్గుతుంది. ప్రశాంత వాతావరణం, మంచి మనశ్శాంతికి, మానసిక, శారీరక ఆరోగ్యానికి కూడా ఈ ఉత్పత్తులు దోహద పడతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. కాబట్టి భక్తులందరూ కూడా ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కృతకృత్యులౌతారని తి.తి.దే. 'సప్తగిరి' ముఖ్య ఆశయం.

*'ఓం నమో వేంకటేశాయ'*




# తిరుపతి శ్రీగోవిందరాజస్వామి

- డా॥ పేట శ్రీనివాసులురెడ్డి

ప్రపంచంలోనే తిరుపతి పుణ్యక్షేత్రం ఆధ్యాత్మికతకు మహోన్నతమైంది. యాత్రికులు తిరుపతి దరిదాపులకొస్తూనే మొదట గోవిందరాజస్వామిగుడి రాజగోపురం స్వాగతం పలుకుతుంటుంది. ఇది తిరుపతి రైల్వేస్టేషనుకు, బస్టాండుకు అతి దగ్గరగా నెలకొని ఉన్నది. ఈ స్వామిపేరుతోనే ప్రాచీనకాలంనుండి తిరుపతిని గోవిందరాజపట్నం అని కూడా పిలుస్తున్నారు.

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారికి అన్నగా ప్రసిద్ధి చెందిన గోవిందరాజస్వామి శ్రీనివాసుని కల్యాణంకోసం ధనాన్ని కొలమానికతో కొలచి కొలచి అలసిపోయి ఆ కొలమానికనే తలగడ (దిండు)గా చేసికొని సేదతీరినట్లు స్థానికుల కథనం.



గర్భగృహంలో సున్నం గారతోచేసిన శయనమూర్తి అయిన శ్రీగోవిందరాజస్వామి విగ్రహం నెలకొని ఉంది. తలకింద స్వామికి తలగడ(దీనినే 'కుంచెం' అని కూడా అంటారు), నాభినుండి ఉద్భవించిన పద్మంపై చతుర్ముఖబ్రహ్మ, తూర్పువైపున లక్ష్మీదేవి స్వామిపాదాలకు ఉత్తరంగాను, ఉత్తరంవైపున దక్షిణాభిముఖంగా భూదేవి విగ్రహాలున్నాయి. స్వామి పాదాల చెంత మధుకైటభులనే రాక్షసుల విగ్రహాలున్నాయి. గోవిందరాజస్వామికి అభిముఖంగా గరుడమంటపం, ధ్వజస్తంభం, బలిపీఠాలతోపాటు, సమీపంలోనే ఎత్తైన ఒక చిన్నమంటపంలో ఆంజనేయస్వామిని ప్రతిష్ఠించారు. అలాగే గోవిందరాజస్వామిదేవాలయంలో ద్వారపాలకులతోపాటు వసంతమంటపం, నీరాళిమంటపం, చిత్రకూటమంటపం, కుంభహారతిమంటపం, లక్ష్మీదేవిమంటపాలు, కల్యాణమంటపం, యాగశాల, అద్దాలమహల్ నిర్మించబడి ఉన్నాయి.



క్రీ.శ.1129-30 మధ్యకాలంలో రామానుజాచార్యులు శ్రీగోవిందరాజస్వామి ఆలయాన్ని తిరుపతిలో నిర్మించి, స్వామివారిని ప్రతిష్ఠించినట్లు తెలుస్తోంది. ఎంతో వైశాల్యం కలిగిన శ్రీగోవిందరాజస్వామిదేవాలయంలో శ్రీపార్థసారథిస్వామిఆలయం, శ్రీగోదాదేవి ఆలయం, తిరుమంగైఆళ్వారుసన్నిధి, శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామిమందిరం, శ్రీలక్ష్మీదేవి ఆలయం, భాష్యకారులసన్నిధి (శ్రీరామానుజసన్నిధి), తిరుమలనంబిమందిరం, మధురకవి ఆళ్వారుసన్నిధి, వేదాంతదేశికులసన్నిధి ఉన్నాయి.



ఇక్కడి మధ్యగోపురంలో ఉత్తరంవైపు రెండవప్రాంగణపుగోడలో సుదర్శనం- చక్రం- చక్రత్తాళ్వార్ ప్రతిష్ఠ గావించబడింది. తాళ్లపాకవంశంవారు దాని పూజలకు ఏర్పాట్లు చేశారు. బయట తిరుపతిలో అతి ఎత్తైన విడిగా ఉండే గోవిందరాజస్వామి రాజగోపురం ఉంది. దీనిని మట్లకుమార అనంతరాజు 17వ శతాబ్దంలో నిర్మించాడు. ఈ రాజు తల్లిదండ్రులు చెన్నమాంబ తిరువేంగళనాథులను ఈ గోపురంలో చూడవచ్చు.



స్వామివారికి అనేక ఉత్సవాలను ప్రాచీనకాలంనుండి నేటికీ నిర్వహిస్తున్నారు. అందులో నిత్యోత్సవాలు, వారోత్సవాలు, పక్షోత్సవాలు, మాసోత్సవాలు, వార్షికోత్సవాలు జరుగుతాయి. తిరుపతిపట్టణంలో శ్రీగోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలు ప్రతిసంవత్సరం వైశాఖమాసంలో తొమ్మిదిరోజులపాటు అత్యంతవైభవంగా జరుగుతాయి.

తిరుపతికి 20కి.మీ.దూరంలో తిరుచానూరునుంచి మద్రాసుకు (చెన్నై) పోవు దగ్గరిమార్గంలో అప్పలాయగుంట ఉంది. తోరణద్వారం ఉండడంవల్ల సులభంగానే గుర్తించవచ్చు. ఇది ప్రసన్న వేంకటేశ్వరస్వామి పద్మావతీసమేతంగా వెలసిన చోటు. గోదాదేవికూడా ఆలయంలో అమ్మవారికి సమాంతరంగా ఆవెలాగే వెలుపల ఉంది. ఎందుకోమరి? శ్రీవేంకటేశ్వరుడు ఎప్పుడూ దేవేరులను దూరంగానే పెడతాడు.


అన్‌ఋణసరోవరం అప్పలాయగుంటగా మారింది.

ఇది ఆలయానికి దూరంలో ఉంది. పద్మాకరం. ఆ పద్మాలన్నీ పూజకు ముఖ్యంగా పద్మావతమ్మపూజకు వినియోగిస్తారు. ఆ ఊరిలో ఒక అప్పులయ్య ఉండేవాడు. అందరిదగ్గర అప్పు చేసేవాడు. ఒకనిదగ్గర అప్పు చేయలేదు. కానీ అందరూ నమ్ముతారు కాబట్టి వాడు కూడా తనకు అప్పులయ్య బాకీ ఉన్నాడని వ్యాజ్యం చేశాడు. అప్పుడు అప్పులయ్యకు కోపం వచ్చి ఒక రాతిమీద నేను ఋణం చేయలేదు అని వ్రాసి ఆ కోనేరులో వదిలితే అది మునిగిపోకుండా తేలిందట. అందువల్ల అది అన్‌ఋణసరోవరమని పిలువబడి క్రమంగా అప్పులయ్యగుంట ఆ తరువాత అప్పలాయగుంటగా మారిందని పుక్కిటిపురాణం.

తిరుమల శ్రీవారు నారాయణవనంలో పద్మావతమ్మను వివాహమాడి పసుపుబట్టలతోనే తిరుమలకు మరవలిబయలుదేరి వస్తూ ఇక్కడ మంచిగా ఉందని కాసేపు విశ్రాంతికై కూర్చున్నాడు. అక్కడ సిద్ధేశ్వరయోగి అనే ఆయన తపస్సు చేసుకుంటూ కళ్లు తెరిచి చూడగా ఎదుట దివ్యదంపతులు కనబడేసరికి ఉబ్బితబ్బిబ్బై వారి పాదాలమీదబడి అక్కడే వారిని ఉండిపొమ్మని ప్రార్థించాడు. స్వామి చిరునవ్వుతో తమ విగ్రహాలు అనుగ్రహించాడు. అలా వెలసినాడు ప్రసన్న వేంకటేశ్వరుడు.

ఈ ఆలయం ఎప్పుడు నిర్మించారో తెలియదు. కానీ దీని ముఖద్వారపుగోడమీద క్రీ.శ.1585 కాలంనాటి వేంకటపతిరాయల దానశాసనముంది. కాబట్టి ఆలయం అంతకు మునుపే నిర్మింపబడి ఉంటుంది. స్థానికంగా కార్వేటినగరరాజులున్నారు కాబట్టి ఆలయ ఆలనపాలనా వారే చూసుకొంటూ వచ్చారు. తి.తి.దేవస్థానం ఈ ఆలయాన్ని స్వాధీనపరచుకొని జీర్ణోద్ధరణ చేసి, 30 ఏప్రిల్ 2006న మహాసంప్రోక్షణ చేసి అభివృద్ధి చేశారు.

ఈ ఆలయంలో ఏటేటా బ్రహ్మోత్సవాలు, పవిత్రోత్సవం నిర్వహించబడుతోంది. స్వామి ప్రసన్న వదనంతో, అభయహస్తంతో మనకు అభయమిస్తున్నాడు. రోగాలబారిన పడిన భక్తులు ఇక్కడి భారీ వాయునందనునికి మొక్కి రోగవిముక్తులవుతుంటారు.



# అప్పలాయగుంట శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామి

– శ్రీ గోపీకృష్ణ



# శ్రీమద్భగవద్గీత

## 16వ-అధ్యాయం (సారసంగ్రహం)

విద్వాన్, డా॥ ఈ.జి. హేమంతకుమార్



ధారావాహిక

### దైవాసురసంపద్విభాగయోగం అధ్యాయనామౌచిత్యం

ప్రపంచంలో ప్రాణికోట్లన్నీ రెండువర్గాలుగా విభజింపబడ్డాయి. ఒకటి మంచి రెండు చెడు. దీన్నే సంస్కృతంలో దైవం, ఆసురమన్నారు. సంపద అంటే ఐశ్వర్యం. ఈ అధ్యాయంలో దైవసంపద, అసురసంపద విస్తారంగా చెప్పబడి ఉంది. దైవీగుణంతో పుట్టినవారిలక్షణాలు, ఆసురీగుణంతో పుట్టినవారిలక్షణాలు ఇందులో వివరింపబడి ఉన్నాయి. కనుకనే ఆ పేరుతో ప్రసిద్ధికెక్కింది.

అసురగుణాలను తొలగించుకోవాలి. ఆత్మను పరిశుద్ధంగా ఉంచుకోవాలి. దైవికగుణాలు మోక్షానికి, రాక్షసగుణాలు నరకప్రాప్తికి ద్వారాలు. సాధకుడైనవాడు తన హృదయాన్ని తానే శోధించుకుంటూ ఉండాలి. ఒకవేళ దైవగుణాలు లేనట్లయితే దానిసంపాదనకై ప్రయత్నించాలి. ఉన్న గుణాలను మరింతగా మెరుగుపరచుకుంటూ ఉండాలి. అసురగుణాలను దరిచేరనీయకు- అనే సదుపదేశంతోపాటుగా, దైవ, అసుర సంపదల్ని చక్కగా విభజించి తెల్పిన అధ్యాయం కావటంవలన దీనికి దైవాసురసంపద్విభాగయోగమనే పేరు ఔచిత్యవంతంగా ఉంది. ఈ అధ్యాయ పారాయణం వలన బలపరాక్రమాలు వృద్ధి చెంది సుఖం చేకూరుతుంది.

- - - - - - -

### శ్రీకృష్ణుడంటున్నాడు

శ్రీకృష్ణపరమాత్మ ఈ అధ్యాయంలో దైవీసంపద ఆసురీసంపదలని సంపదలలో రెండు తెగలుంటాయని వివరిస్తూ మొట్టమొదటగా దైవీసంపదలో పుట్టినవాళ్ళు ఎలా ఉంటారో? వారిలో ఎలాంటి గుణగణాలుంటాయో? వివరిస్తున్నారు.

ఈ క్రింద వివరింపబడిన 26గుణాలు కలవారు దైవస్వభావులు. 1)భయం లేకపోవడం 2)సత్త్వగుణం కలిగి ఉండటం 3)జ్ఞానయోగమునందుండటం 4)దానగుణం కలిగి ఉండటం 5)ఇంద్రియనిగ్రహం 6)దైవారాధన 7)జ్ఞానసముపార్జన 8)తపస్సు 9)కపటం లేకపోవడం 10)అహింస 11)సత్యభాషణం 12)కోపం లేకపోవడం 13)త్యాగం 14)శాంతి 15)కొండెములు చెప్పకుండుట 16)దయ 17)ఆశ లేకుండుట 18)మృదుస్వభావం 19)వినయం 20)స్థిరబుద్ధి 21)తేజస్సు 22)ఓర్పు 23)ధైర్యం 24)శుచిత్వం 25)ద్రోహము చేయకుండుట 26)దురభిమానం లేకుండుట అనే ఈ గుణాలన్నీ దైవసంపదలో పుట్టినవారికుండే సహజగుణాలు. అందువల్లనే వారి ప్రవృత్తి దివ్యంగా, ఆదర్శంగా ఉంటుంది.

ఆ విధంగా కాకుండా 1)డంబం 2)గర్వం 3)దురభిమానం 4)కోపం 5)కఠినంగా ప్రవర్తించటం 6)అజ్ఞానం అనే ఈ ఆరుదుర్గుణాలు కలవారు అసురస్వభావులు.

దైవీ సంపద్విమోక్షాయ నిబంధా యాసురీమతా।
మాశుచ స్సంపదం దైవీం అభిజాతోஉసి పాండవ॥ 5

అర్జునా! ఎవరు దైవీసంపత్తులో పుట్టి దాన్నే పెంచుకుంటారో వారు మోక్షానికి అర్హులౌతారు. ఎవరు ఆసురీసంపదలో పుట్టి దాన్నే పెంచుకుంటారో వారు సంసారబద్ధులై ఈ వలయంలో పుడుతూ చస్తూ ఉంటారు. కురుప్రవీరా! అర్జునా! నీవు దైవసంపదయందు జన్మించినవాడవు. కనుక నీవు శోకించవలసిన పనిలేదు.

దైవీసంపదనుగూర్చి నీకిదివరకే సవిస్తరంగా వివరించాను. ఇక అసురసంపద గలవారియొక్క స్వభావాన్ని వివరిస్తాను. విను. అసురస్వభావులకు ధర్మప్రవృత్తి, అధర్మప్రవృత్తి అని రెండు మార్గాలున్నట్లే తెలియదు. వారియందు శుచిత్వం అగుపడదు. వారు ఆచారాన్ని విడిచిపెడతారు. శాస్త్రవిధిని పాటించరు. నిజం పల్కడం అంటే గిట్టదు. ఈ జగత్తు అసత్యం. దేవుడు లేడంటారు. స్త్రీపురుషసంయోగంవల్లనే ఈ సృష్టి జరుగుతున్నది కానీ వేరే కారణమేదీ లేదని వాదిస్తారు. ఎప్పటికీ తృప్తి కల్గని కామాన్ని తీర్చుకోవడంకంటే జీవితానికి వేరే పరమావధి లేదని భావించి సంచరిస్తుంటారు.

**ఆశాపాశశతైర్బద్ధాః కామక్రోధపరాయణాః ।**
**ఈహన్తే కామ భోగార్థం అన్యాయే నార్థసంచయాన్ ॥ 12**

ఆశాపాశాలచే బంధింపబడుతూ- కామక్రోధాలకు దాసులై అక్రమమార్గాల్లో ధనసంపాదన చేయాలని ఎన్నో ప్రయత్నాలు చేస్తారు. ఇంత సంపాదించాను. ఇంకా ఎంతో ధనాన్ని సంపాదిస్తాను. నేను ధనికుణ్ణి. నన్ను మించిన ధనికుడెవ్వడూ లేడు అని అనుకుంటుంటారు. ఇవాళ వాణ్ణి చంపాను. మిగతా శత్రువులను కూడా చంపిపారేస్తాను. నేను బలవంతుణ్ణి అని గర్వంతో విర్రవీగుతారు. నేను గొప్పకులంలో పుట్టాను. నాతో సమానమైనవాళ్ళు లేరు. ఇదిగో నేను యజ్ఞాలు చేస్తాను. దానాలిస్తాను అని కీర్తిప్రతిష్ఠలకొరకు ఆడంబరాలు చేస్తుంటారు. ఈ ప్రకారంగా అర్జునా! అసురగుణములు కలవారు బలగర్వంతో కామ, క్రోధ, అహంకారాలకులోనై వారు తమ దేహంలోను, ఇతరుల్లోను అంతర్యామిగా ఉన్న నన్ను గుర్తించలేక అసూయతో ఇతరులను ద్వేషిస్తూ నన్ను నిందిస్తూ ఉంటారు. అట్టివారిని నేను జననమరణరూపమైన సంసారమార్గంలో రాక్షసప్రవృత్తికల అసురసంబంధమైన నీచజన్మలలో పడవేస్తాను.

**త్రివిధం నరక స్యేదం ద్వారం నాశనమాత్మనః ।**
**కామః క్రోధ స్తథా లోభః తస్మా దేత త్త్రయం త్యజేత్॥ 21**

అర్జునా! కామ, క్రోధ, లోభాలున్నాయే ఈ మూడును కూడ ఆత్మవినాశహేతువులు. ఇవే మూడువిధాలైన నరక ద్వారాలు. కాబట్టి వివేకం గలవారు ఈ మూడు నరకద్వారాల జోలికి పోగూడదు. అలా ఈ మూడు నరకద్వారాలను విడిచిపెట్టినవారు పరమగతిని పొందుతున్నారు.

**యశ్శాస్త్ర విధిముత్సృజ్య వర్తతే కామకారతః ।**
**న స సిద్ధి మవాప్నోతి న సుఖం న పరాం గతిమ్ ॥ 23**

ఎవడు శాస్త్రాలు శాసించినట్లుగా నడవకుండా, తన ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తాడో వాడికి కార్యసిద్ధి కల్గదు. ఇహంలోను, పరంలోను సుఖంలేదు. మోక్షం లభించదు.


**తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యాకార్యవ్యవస్థితౌ ।**
**జ్ఞాత్వా శాస్త్రవిధానోక్తం కర్మ కర్తు మిహార్హసి ॥ 24**

కనుక అర్జునా! ఏ కార్యం చేయాలో, ఏది చేయకూడదో సందేహం కలిగినపుడు శాస్త్రాన్ననుసరించే కర్మలాచరించడం యుక్తం.

శ్రీకృష్ణార్పణమస్తు.

## శ్రీ పద్మావతీతాయార్ల తెప్పోత్సవం, తిరుచానూరు

*(2022, జూన్ 10 నుండి 14 వరకు)*



| తేదీలు | వారము | ఉత్సవములు |
|---|---|---|
| 10-06-2022 | శుక్ర | శ్రీకృష్ణస్వామివారికి |
| 11-06-2022 | శని | శ్రీసుందరరాజస్వామివారికి |
| 12-06-2022 | ఆది | శ్రీపద్మావతిఅమ్మవార్లకు |
| 13-06-2022 | సోమ | శ్రీపద్మావతిఅమ్మవార్లకు |
| 14-06-2022 | మంగళ | శ్రీపద్మావతిఅమ్మవార్లకు |

# గానం

- భారత్‌భాషాభూషణ్ సాహితీకోకిల
శ్రీమతి సుందరవల్లి శ్రీదేవి,
94907 49643

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీవేంకటేశ్వర స్వామివారికి భక్తాగ్రేసరులు, భక్తశిఖామణులు ఎందరో... మరెందరో... నవవిధ భక్తిమార్గాలననుసరించి స్వామివారి పద సన్నిధికి చేరుకున్నవారిలో ముఖ్యులు, సంకీర్తనలతో స్వామికి చేరువై కైవల్యాన్ని పొందినవారు, సంకీర్తనాచార్యులు శ్రీఅన్నమాచార్యులవారు ఒకరైతే, అదే కోవకు చెందిన సాహితీ కుసుమాలతో శ్రీశ్రీనివాసుని అర్చించి, తరించి, కైవల్యం పొందిన స్త్రీమూర్తి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ. పుణ్యచరితయైన ఆమె జీవితచరిత్ర గానం విందాం...

ఎవరా తరిగొండ వెంగమాంబ? ఏమామె శుభ చరితము వివరించరే?

తెలియరే వేంగమాంబ శుభచరితము
తెలుపరే తెనుగువాణికీమె మణిమకుటం

తరిగొండ పురమున తరుణి వసియించే
భక్తి నృసింహు గొలిచే అనురక్తిమీరగ
నారీవనమున వికసిత కుసుమమై
తరిగొండేశు పదముల విరసే భక్తి పరవశమై

శ్రీలక్ష్మి కరపద్మాంశమున జనియించె నీ పె
కానాల వంశజయై కడు పుణ్య దంపతులకు
పసితనముననే శ్రీవేంకటపతి మది నమ్మె
బాల్యచేష్టలు విడిచి భగవంతు సేవించే!

ఏవిధంగా తరిగొండ నృసింహుని కొలచినదమ్మా ఈ అతివ విశదంగా వివరించరాదా? బాల్యముననే అంతటి భక్తి ప్రపత్తులను కలిగిన వేంగమాంబ

శ్రీనరసింహుడు శ్రీవిభుడూ...
చిన్మయరూపుడు మహిమాన్వితుడూ...

నరమృగవేషమున నారాయణుడు
చెంచిత కేలిని చేకొన్నవాడు
బలముల కొండల తిరుగాడుచున్నవాడు
తరిగొండపురమున విలసిల్లగ నేడు

మది నమ్మిన వాడు మంగళకరుడు
లోకములు పాలించువాడు
సరగున దురితములు దునిమి దుష్టుల శిక్షించు
తరిగొండ వాసుడు నన్నేలువాడు

మది శ్రీవేంకటేశుడే పతియని తలచే
మనుజుడా వేంకటచలపతినీ పెండ్లాడే
ఇంజేటి వంశమున మెట్టిన ఈ యింతి
ఇహపర సుఖములను వలదనెను పూబంతి

బాల్యమునుండి భగవంతుని సేవిస్తూ స్వామియే తన భర్తయని భావించిన వేంగమాంబకు సామాజికధర్మంప్రకారం తల్లిదండ్రులు వివాహం చేయ సంకల్పించారు. కానీ విధివశాన భర్తను కోల్పోయిన వేంగమాంబ స్వామివారికి మరింత చేరువయింది. తిరుమలేశుడే తన భర్తయని మనసా వాచా



నమ్మిన ఆమె విధవ అనిపించుకోవటానికి నిరాకరించింది. దూషణ తిరస్కారములను భరించి, తిరుమల ఏ విధంగా చేరింది వేంగమాంబ వివరించరమ్మా...

అంతట పతి బాసిన వేంగమాంబ వగవక
పరమ పురుషుడే తన పతి యని నమ్మి
పడతి హక్కులు పూలు నుదుట బొట్టని తెలిపి
చాంధసాచారములు ఖండించె పలికి

తిరుమలకు పయనమైన వేంగమాంబ స్వామిని కనలేక వగచిన విధంబెట్టిదన...

నినుచేరలేనైతి తిరువేంకటేశా
నీ కృప తరిగేన నాపై శ్రీశ్రీనివాసా

పరిపూర్ణ కరుణాంతరంగుడవై యుండి
పరాకు నీకేల పరమాత్మ నే...డూ
పతిత పావన నా నేరము లెంచేవా
మాయలో బడనీక నను కావరావా!

తిరుమలవాసా నీ దరిశెనమీయక నాకు
దోబూచులాడేవ కొండలమాటున దాగి
ఉన్నతి నే గాను. నీ యునికి తెలియగను
సన్నుతించెద నిన్ను అవధరింపగ రావా

ఈ విధంగ స్వామిని వెదకుచూ బయలుదేరిన వేంగమాంబ తిరుమల చేరింది. ఆమె ఏ విధంగా తిరుమలేశుని కరుణకు పాత్రురాలైందో, తెలియజేయు విధానమేమనగా...

వేదవేదాంతముల సారమెరిగిన వెలది
వేద వేద్యుని గొలిచె వేంకటగిరి కరిగి
కావ్యములు నుతియించె కృతులు రచియించె
కల్యాణధాముని కరుణ నొందగ నెంచి

స్వామివారి దివ్యరూపమును కనినంతనే పరవశించిన వేంగమాంబ ఈ విధంగా స్తుతించింది.

శ్రీ వేంకటేశ నీ దివ్యరూపం
భక్త జనుల కది వరదానం

పరంధాముని పద మందారం
పతిత పావనం పరమ పవిత్రం
కమలాకాంతుని కరకమలం
అభయ ముద్రాంకిత కామితార్థప్రదం

ఆనందనిలయ విమాన గోపురం
కనగ కనకమయం కమనీయం
కలియుగ ప్రత్యక్ష దైవ దర్శనం
సంచిత పాపవినాశక శుభకరం

వనమాలా విరాజిత శ్రీవక్షం
ఇరు దేవేరుల విలసిత నిలయం
కౌస్తుభ మణిమయ కాంచన భూషణం
కనగ కనగ కడు రమణీయం

ఆ విధంగా స్వామివారిని దర్శించి తిరుమలలో నివాసం ఏర్పరుచుకున్న వేంగమాంబ, స్వామికి ప్రతినిత్యం తులసిమాలలు సమర్పించుకునేది. సంప్రదాయముననుసరించి విధవ మాలలు స్వామికి సమర్పించడం సరికాదన్నారు అర్చకులు...

దూషణ తిరస్కారములు భరియించె పడతి
శ్రీనివాసు సేవలో తులసిమాలల నుంచి
వగచెను వేంగమాంబ పరిపరివిధముల
తిరుమలేశు సేవలకు తపియించె తరచి తరచి

కడదాక చేర్చేవని నీ పదముల నమ్మితి
ఇపుడేల ఈ శోధనలు వేంకటాధిప నాపై


కర్మ ఫల దుఃఖముల కరిగించితీవు
కనికరమున కాచి కరుణ చూపేవూ...
విసిగి వేసారితి ఇహపరము నెరిగితి
ఇకనైన కైవల్య పథము చూపగోరితి

ప్రతి నిత్యము నిన్ను సేవింతునంటి
జపతప మార్గముల నెరుగ నేనంటి
జగదేక పతియే నా పెన్నిధి యనుకొంటి
నీ సన్నిధి నేనుండ కోరి నిరతము వేడితి

కరుణాంతరంగుడైన శ్రీవేంకటపతి అలసి సొలసిన వేంగమాంబ వినతికి కరిగి భక్తజన పారిజాతమై కైవల్యసిద్ధి నొసంగినాడు. నాటినుండి నేటివరకు వేంగమాంబ ముత్యాల హారతి వెలుగులకు వెలుగై వెలుగొందు నియతి.

ముత్యాల హారతిని ముదముతో నందించె
ముదిత వేంగమాంబ మగువలలో మిన్నయై
కలియుగాంతము తనకు హారతులనీయగ
తిరుమలేశుని వరమందె కడు పుణ్య చరితయై

ధారావాహిక




*(గత సంచిక తరువాయి భాగం....)*

ఆ విధముగ శ్రీరామానుజాచార్యులవారు తిరుమల యందు అంతవరకు అనుష్ఠానమునలేని ధర్మములను అనుష్ఠింపజేసియు, జీర్ణములైన ధర్మములను ఉద్ధరింపజేసియు, దేవతాంతరవాసన రాకుండులాగున శ్రీనివాసుని సౌశీల్యము, ఆశ్రితపారతంత్ర్యము, ఆపన్మిత్రత్వము మున్నగు కల్యాణ గుణములను దేశాంతరస్థులును తెలియు విధముగ స్వామివారి సకలసంపదలు ఉపద్రవరహితములై ఉత్తరోత్తరాభివృద్ధము లగునట్లుగను మంగళాశాసనము చేసి, ఇంకను తిరుమలకే అసాధారణములగు కొన్ని ధర్మములను ప్రవర్తిల్ల జేయవలెనని మనమున సంకల్పించిరి.

**"వైకుంఠలోకా ద్గరుడేన విష్ణోః క్రీడాచలో వేంకటనామధేయః, అనీయ స స్వర్ణముఖీసమీపే సంస్థాపితో విష్ణునివాసహేతోః"**

(గరుత్మంతుడు వేంకటమను పేరుగల విష్ణుదేవుని క్రీడాచలమను వైకుంఠద్వారమునుండి కొనివచ్చి శ్రీవిష్ణునివాసార్థమై స్వర్ణముఖీసమీపమున స్థాపించెను.)

అని మార్కండేయపురాణమున వేంకటాచల మాహాత్మ్య ఘట్టమున శ్రీవైకుంఠమందు క్రీడాచలమని ప్రసిద్ధమై-

**"వైకుంఠా దాగతత్వాచ్చ వైకుంఠాద్రిరితి స్మృతః"**

(వైకుంఠమునుండి వచ్చియుండుటచేత వైకుంఠాద్రి యని తలపబడుచున్నది.) అనియు,

**"గత్వా తు పరమం ధామ క్రీడాచల మిహాఽఽనయ, హిరణ్మయ మహాశృంగం పంచోపనిషదాత్మకమ్."**

(పరమపదమునకు పోయి సువర్ణమయశిఖరములు గలిగి పంచోపనిషదాత్మకమగు క్రీడాచలము నిటకు గొనిరమ్ము.)

అని శుద్ధవరాహపురాణమందును పరమపదమున క్రీడాచలమని ప్రసిద్ధమై

**"అయం కదాచిద్దేవానాం శ్రీనివాస ఇవాఽఽబభౌ."**

(ఈ కొండ ఒకానొకప్పుడు సాక్షాత్ శ్రీనివాసుడుగనే దేవతలకు భాసిల్లినది.)

అని బ్రహ్మాండపురాణమున శ్రియఃపతియొక్క దివ్య మంగళ విగ్రహమనియు.

**"అనంతోఽహం మహాదేవ స్థాస్యామి గిరిరూపధృత్"**

(మహాదేవా! అనంతుడనగు నేను గిరరూపము ధరించియుండగలను.) అనియు,

**"త్వత్ఫణామండలభువి స్థాస్యామి రమయా సహ."**

(నీ ఫణామండల విశాలప్రదేశమున రమాదేవితోడ నుండగలను.)

అని వరాహపురాణమున ఆదిశేషుని దివ్యదేహమే యనియు ప్రఖ్యాతమై ఇట్లు కల్పభేదముచేత భిన్నరూపములు గలదిగా చెప్పదగి అ ప్రాకృతమై పవిత్రమగు తిరుమలకొండను గురించి తదుపరి సంచికలో తెలుసుకుందాం. ***(ఇంకా ఉంది)***

# శ్రీకృష్ణామృతం



అంత సౌందర్యమది ఎట్లయా
అందాలగని నీవు ఓ నల్లనయ్యా

అంత లేసి కళ్ళు
అతిశయములు
అంబుధి విహరించి మసలు
అనిమిష మీనముల బ్రోలు

అధర మధురముల వీడనొల్లని
అపర దాస్యములు కాబోలు
అట్లె వీడక అంటి అలరారుచున్నవి చూడు
అరుణ హసితములయ్యవి మధుర స్మితములు

అవనిమొదలిడి అంబరముల నిడివి వ్యాపములు
అరవింద గంధములు అమ్బుజాక్షుని శ్వాసలు
అనురాగపూరితములా నయన వీక్షణములు
అగణితముగ వర్షించు అమృతధారలు

అంగరాగములయ్యవి సుగంధ వాయులీనములు
అంగరుహములయ్యవి ఘన మేఘ సమూహములు

అంగాంగమున అలరారు అన్యాఘ్రాణిత పూలమాలలు
అంజలి ఘటించుచున్న ఆభరణకాంతులు

అంగుళి మొనల మొదలు అంగరుహాన్నుల కొనల జాలు
అన్యుల ఆపాదించనలవికాని అతుల్య వెన్నెలకాంతులు

ఆ అందియల అకుంఠిత దీక్షలవి ఏమి
అనవరతమా పదముల చేరి కొలచుచున్నవి
ఆ లేగదూడల తపోవిజయములేమి
అచ్యుతుని కరుణనను అనిశము గెలిచియున్నవి
ఆ నీలిపింఛముల పుణ్య భాగ్యములేమి
అనుపమౌ శిఖియందు శోభించున్నవి

అడుగు మోపిన మేల అవని పరవశములు
అందెల సవ్వడిమేల్కొను ప్రకృతి పులకరింతలు
అంచనలనుమించు అనంతలీలలు
అడుగడుగు రేపల్లె మురియు మురిపెములు

అంకము జేరుటకె కాబోలు
అంతలేసి వైరములు
అతివ రాధమ్మకు ధీటగు సఖులు
అనవరతము వెంట వేవేల గోపకులు

అవని నాలుగు చెరగుల భక్తులు కొల్లలు
అవి ఇవి అనగనేల అఖిల జీవపురాశులు
అండ పిండ బ్రహ్మాండంబులు, అందున్న ఆ తారలు కోట్లు
అసాధ్యము కనుగొన నీయనుకర్షణకతీతములౌ బుద్ధిమతుల

అందనంత ఎత్తు అద్భుత
అచల శేషాచలము వాడు
అంటురాయి వోలె అమితలాఘవము తోడ
అనితరము చిత్తమును ఆకట్టువాడు

అంతరంగమున చేరి
అనితరము బాయని
అంచచలమౌ భక్తియే
అమూల్య నీరజనము నీకు

*– "అనంత" (కృష్ణసుందరి సత్తిరాజు),*
*99103 45794*



# వృక్షాలు మన నేస్తాలు

- శ్రీ వద్దిరాజు జనార్ధనరావు, 99893 50596

ఈ భూమినిండా వృక్షసంపద నిండి ఉంది. ఆ వృక్షాల నీడలో లక్షలాది జీవరాశులు తల దాచుకుంటున్నాయి. మరెన్నో జీవాలు వృక్షాలఫలాలు, ఆకులు, అలములు తిని జీవిస్తు న్నాయి. ఈ జగతికి ముఖ్యంగా ప్రాణవాయువుని ఇవ్వడానికి వృక్షాలు తమవంతు విశేషకృషి సల్పుతున్నాయి. అటువంటి ఉపకారం చేస్తున్న వృక్షాలు మన నేస్తాలుగా నిలుస్తున్నాయి. ఇవి ఔషధీవృక్షాలుగాను, దేవతావృక్షాలుగాను ఉన్నాయి.

ఈ సృష్టిలో పరమాత్మనుండి ఆకాశం, ఆకాశంనుండి వాయువు, వాయువునుండి అగ్ని, అగ్నినుండి నీరు, నీటినుండి భూమి, భూమినుండి వృక్షాలు, వృక్షాలనుండి ఓషధులు, ఓషధులనుండి అన్నం, అన్నంనుండి జీవుడు ఉద్భవించాడని తెలుస్తున్నది. అందువల్ల ఇక్కడ వృక్షాలకు అంత ప్రాధాన్యత ఉంది. దాన్ని గుర్తించిన మన పూర్వీకులు **"వృక్షో రక్షతి రక్షితః"** అని అన్నారు.

మానవుడు ప్రకృతిని ఆరాధిస్తూ ఉన్నంతకాలం మనిషి సుఖశాంతులతో హాయిగా జీవించగలడు. దాన్ని వినాశనం చేసుకుంటే వేరే చెప్పనక్కరలేదు. ఇప్పటికే మనం చాలామటుకు కొన్ని పరిణామాలు చవిచూస్తున్నాం. **"ఛేదనం వృక్షజాతీనాం ద్వితీయం నరకం స్మృతమ్"(వామనపురాణం)** చెట్లను నరకడం రెండవనరకం అనే ప్రబోధాన్ని ప్రతిఒక్కరు గుర్తుంచుకోవాలి.

చెట్లవల్ల పొందుతున్న అనేక లాభాలను మరచి పోకూడదు. అందుకు ప్రతిగా ప్రకృతిని ఆరాధించాలి. అంటే ప్రతిఒక్కరు మొక్కలు నాటాలి. చెట్లను పెంపొందించాలి. సామాజికప్రయోజనాన్ని గుర్తించి పర్యావరణరక్షణకు తోడ్పడాలి.

అందుకే సర్వం మనకు ధారపోస్తున్న ప్రకృతిమాతకు కృతజ్ఞతలు తెలుపుకోవాలి. వాతావరణాన్ని కలుషితం చేయ కుండా కాపాడుకోవాలి. ఇది అందరి కర్తవ్యం.

మనకు ప్రకృతితో విడదీయరాని బంధం ఉంది. మనకు ఎన్నో పండుగలు ఉన్నాయి. అధర్వణవేదంలో చెట్లు, ఔషధమొక్కలు వాటి ఉపయోగాలగురించి వివరించబడి ఉన్నాయట.

ఒక పెద్దచెట్టుకు దాదాపు నాలుగులక్షల ఆకులుంటా యట. ఇవి స్వచ్ఛమైనగాలిని అందించే సహజఎయిర్‌కండీష న్లుగా పని చేస్తాయని, తన జీవితకాలంలో ఎంతో విలువగల ప్రయోజనాలను అందిస్తుందని శాస్త్రజ్ఞులు తెలియజేస్తున్నారు.

భీష్ముడు అడిగిన ప్రశ్నకు పులస్త్యుడు వృక్షాలను, ఉద్యానవనాలను నాటేముందు చేసే క్రతువులను గురించి వివరించాడట.

అలాగే పురాణాల్లో అనేకచోట్ల వనాలు, వృక్షాల ప్రస్తావన వస్తుంది. రామాయణగాథలో రావణాసురుడు తన లంకానగరంలో చక్కనివనాలని పెంచాడు. ఆ వనాలలో చక్కనిది అశోకవనమట. అందుకే ఆవనంలోనే సీతమ్మవారిని



ఉంచాడు. అలాగే ఇంద్రుడుకూడా చక్కనివనాన్ని పెంచాడు. దాని పేరు నందనవనం. ధనపతి అయిన కుబేరుని వనంపేరు చైత్రరథం. వీటన్నింటిలో అందమైనది లంకలో ఉన్న అశోకవనమట. ఇలాగ వనాలను పెంచటం అనేది అనాదిగా వస్తున్నది. దేవతా వృక్షాలుగా చెప్పబడుతున్న తులసి, రావి, వేప, మారేడు (బిల్వం), చందనం మొదలైన వృక్షాలు పూజనీయాలై ఉన్నాయి.

## వివిధఫలాలనిచ్చే చెట్లపూలు

పవళమల్లెపుష్పాలతో పూజిస్తే మంచి ఆలోచనలు, కోర్కెలు సిద్ధిస్తాయి. మంగిషపూలతో పూజిస్తే ఓర్పు, సహనం పెరిగి, శాంతి కలుగుతుంది. విరించిపుష్పాలతో పూజిస్తే శరీరంలో ఉండే వేడి తగ్గి, మనసు ప్రశాంతత కలుగుతుంది. ఎరుపుపుష్పాలతో పూజిస్తే అధైర్యాన్ని పోగొట్టి ఆత్మస్థైర్యం కలుగుతుంది. ఆరళిపుష్పాలతో పూజిస్తే సత్యసంధతను పెంపొందిస్తుంది. తెల్లతామరపుష్పాలతో పూజిస్తే భక్తిని ప్రేరేపిస్తుంది. తులసిదళములతో పూజిస్తే భక్తిని పెంచి, ఆధ్యాత్మికమార్గం చూపుతుంది. గన్నేరు, జీవంతిపుష్పాలతో పూజిస్తే భక్తిని పెంచి, ముక్తిని ప్రసాదిస్తుంది. దవళములతో పూజిస్తే వ్యర్థకోర్కెలు రాక, సంతోషకరమైన జీవనం కలుగుతుంది. మల్లెపుష్పాలతో పూజించిన పాపములను నశింపజేసి బుద్ధిని పెంచుతుంది. సంపెంగపుష్పములతో పూజిస్తే ఆర్థిక రంగంలో అభివృద్ధిని చేకూర్చుతుంది. నాగలింగపుష్పములతో పూజిస్తే సకలసంపదలకు ఆదిదేవతయైన మహాలక్ష్మి అనుగ్రహం కలుగుతుంది. తామర, శంఖపుష్పాలతో పూజిస్తే అష్టైశ్వర్యములు కలుగుతాయి. మారేడుదళములతో పూజిస్తే జ్ఞానం, ఐశ్వర్యం కలుగుటయే కాక ముక్తిని ప్రసాదిస్తుంది. దైవాన్ని నమ్మి వివిధపుష్పాలతో పూజించిన ఆయా ఫలితాలు కలుగుతాయని దైవజ్ఞులు తెలుపుతున్నారు. మనశాస్త్రాల్లో నిక్షిప్తమైన అనేక విషయాలు మానవజీవనవికాసానికి ఎంతగానో తోడ్పుతున్నాయి.

ఇలా ప్రకృతికి, మానవునికి విడదీయరాని బంధం ఎంతో ఉంది. అడవులు ప్రసాదించే వనమూలికలు, ఔషధుల గురించి ఎంతో తెలుసుకోవలసింది ఉంది.

ఇంతటి మహోపకారం చేస్తున్న చెట్లను మనం కాపాడుకోవడం మన కర్తవ్యంకాదా? ఒక్క మనిషేకాదు సమస్త జీవరాశికీ చెట్లు ఉపకారం చేస్తున్నాయి. జీవరాశులన్నీ చెట్లను ఆశ్రయించి జీవిస్తున్నాయి. వాటి ఆకులను, ఫలాలను, కాయలను ఆహారంగా స్వీకరించి జీవనం సాగిస్తున్నాం మనమందరం. ఒక దివ్యవృక్షాన్ని నాటినట్లయితే ఎంతో పుణ్యం వస్తుంది. సత్సంతానం, ఆరోగ్యవంతమైన జీవనం కలుగుతుంది. సమాజానికి మేలు జరుగుతుందని శాస్త్రాలు తెలియజేస్తున్నాయి. ఒక ఫలవృక్షాన్ని నాటడంవల్ల అది పక్షులకి అనేక ఇతరజీవాలకి ఆహారాన్ని ఇవ్వటంచేత పుణ్యం లభిస్తుందని తెలుస్తున్నది. దానివల్ల విశేషఫలాలన్ని పొందుతారు. సర్వజీవులు, ప్రకృతి శ్రేయస్సు కోరి అడవులను అభివృద్ధి చేస్తే వందల వేల కోటాను కోట్ల కల్పాలు స్వర్గంలో జీవిస్తారట. ఇలా ఎన్నో విషయాలు మన పురాణాలు, గ్రంథాలు ఏనాడో తెలిపాయి. చెట్లు లేనిదే మానవమనుగడ ఉండదని తెలుస్తున్నది. కనుక ఒక చిన్న చెట్టునయినా నాటే అలవాటు చేసుకుందాం. మన ప్రకృతిని కాపాడుకుందాం.

### వైకుంఠపాళి
### :: 77 – సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 ఉ | ప | 2 రి | చ | 3 ర | వ | 4 సు | వు | |
| దం | | పు | | ఘు | | ధ | | 5 అ |
| 6 కు | జ్జ | | 7 భ | వు | డు | | 8 మా | ద్రి |
| డు | | 9 న | | | | 10 కు | | జ |
| | 11 క | లు | గు | | 12 కు | రు | డు | |
| 13 న | | డు | | 14 ప్ర | | డు | | 15 అ |
| 16 భ | ద్ర | | 17 ప్ర | మ | తి | | 18 వా | జి |
| స్వ | | 19 చే | | తి | | 20 దా | | తు |
| 21 తి | రు | ప | తి | | 22 హే | రం | బు | డు |


దైవాన్ని నమ్మి వివిధపుష్పాలతో పూజించిన ఆయా ఫలితాలు కలుగుతాయని దైవజ్ఞులమాట

మన మహర్షులు

# ముక్కోపం

- శ్రీమతి డి.జ్యోతిర్మణి, 080-23452959

భగవంతునిపట్ల భక్తి, అచంచలవిశ్వాసాలతో పాటు, ఓరిమి, క్షమ, దయ, దాతృత్వంవంటి సద్గుణాలను కూడా కలిగి ఉన్న భక్తులకు భగవదనుగ్రహం ఎల్లప్పుడూ ఉంటుంది.

ఎంత గొప్పవారయినా, శక్తిమంతులయినా క్రోధం, మదం, మాత్సర్యాలపట్ల నిగ్రహం లేనివారయితే అవే వారికి అప్పుడప్పుడు ఆపదలు కలగజేస్తాయి.


పూర్వం 'దుర్వాసుడు' అనే మహాముని ఉండేవాడు. ఆయన తండ్రి అత్రిమహర్షి, తల్లి అనసూయాదేవి. దుర్వాసుడు గొప్ప తపశ్శక్తి కలవాడు కానీ, మహాముక్కోపి. ఆయన కోపానికి అందరు భయపడేవారు. ఒకసారి దుర్వాసుడు దేవలోకానికి వెళుతున్నాడు. మార్గమధ్యంలో ఒక విద్యాధరకన్య పారిజాతపుష్ప హారాన్ని చేత పట్టుకుని వెడుతూ కనిపించింది. ఆ పుష్పహారాన్ని తనకు ఇమ్మని దుర్వాసుడు ఆమెను అడిగాడు. ఆయన కోపంగురించి ఎరిగి ఉండడంవల్ల ఆ కన్య ఆ పుష్పహారాన్ని ఆయన చేతిలో పెట్టి వెళ్లిపోయింది.

దుర్వాసుడు ఆ హారాన్ని తీసుకుని దేవలోకానికి వెళ్లాడు. ఆ సమయంలో దేవేంద్రుడు 'ఐరావతం' అనబడే దేవలోకపు ఏనుగును అధిరోహించి విహారానికి వెళుతూ ఉన్నాడు. తాపసి అయిన దుర్వాసుడు ఇంద్రుణ్ణి చూసి, ఆశీర్వదించి, ఏనుగు కుంభస్థలంపైన ఆ హారాన్ని వేశాడు. పువ్వుల సువాసనకి తుమ్మెదలు వచ్చి ఐరావతాన్ని చుట్టుముట్టి రొద చేయనారంభించాయి. ఏనుగుకి అసహనం కలిగి ఆ పువ్వులహారాన్ని క్రింద పడవేసి, తన కాలితో త్రొక్కివేసింది.

అక్కడే ఉన్న దుర్వాసుడు కోపంతో మండిపడి దేవేంద్రుడిపట్ల ఆగ్రహించి ఇలా అన్నాడు. "నీ పట్ల ఉన్న గౌరవంతో నేను సుగంధభరితమైన పుష్పహారాన్ని సమర్పించాను. నువ్వు దానిని ఐరావతానికి వేసి నన్ను అవమానించావు. కనుక, నీ దేవేంద్రపదవి, సమస్తసంపదలు సముద్రమున కలియుగాక" అని శపించాడు. దుర్వాసుడిశాపంతో దేవేంద్రుడు అశక్తుడు అయిపోయాడు. ముక్కోపి అయిన దుర్వాసుడు అంటే ముల్లోకాలకు భయమే!

అలాంటి దుర్వాసుడిబారిన పడకుండా ఒకానొకప్పుడు శ్రీహరిభక్తుడు, సద్గుణసంపన్నుడు అయిన 'అంబరీషుడు' అనే మహారాజు ఆపత్కాలంలో విష్ణువుని ప్రార్థించి రక్షణ పొందాడు.

అంబరీషుడు విష్ణుభక్తిపరాయణుడు. ప్రజలను ధర్మ మార్గమున పరిపాలించేవాడు. వసిష్టమహర్షివంటి మహా గురువులసమక్షంలో సరస్వతీనదీతీరమందు అనేకయాగములు నిర్వహించాడు. విష్ణుమూర్తి ఆయన భక్తికి మెచ్చి 'సుదర్శన చక్రం' ప్రసాదించాడు. ఆ విధంగా శ్రీహరి అనుగ్రహాన్ని పొందిన అంబరీషుడు ఒక 'ఏకాదశి' రోజున ఉపవాసం ఉండి



'ద్వాదశీవ్రతం' చేయ సంకల్పించాడు. ద్వాదశీవ్రతంరోజున అనేకమంది భూసురులు వచ్చారు.

ఆ సమయంలో మునీంద్రులు అయిన దుర్వాసుడు కూడా 'అతిథి'గా వచ్చాడు. అంబరీషుడు మునీంద్రునికి నమస్కరించి అనేకవిధాలుగా పూజించాడు. తన ఆతిథ్యాన్ని స్వీకరించి 'భోజనం' చేసి వెళ్లవలసిందిగా ప్రార్థించాడు. దుర్వాస మహాముని అందుకు అంగీకరించి 'యమునానది'కి స్నానానికి వెళ్లాడు.

ఎంతసేపయినా తిరిగి రాలేదు. 'ద్వాదశిఘడియలు' దాటిపోతున్నాయి. దాటిపోకుండా కనీసం 'తులసితీర్థం' అయినా పారణచేయాలి. లేకపోతే వ్రతఫలం వ్యర్థం అయిపోతుంది. అంబరీషుడు ధర్మసంకటంలో పడిపోయాడు. పారణ చేయకపోతే వ్రతఫలం దక్కదు. చేస్తే ముక్కోపి అయిన దుర్వాసుడి కోపానికి లోనుకావలసి వస్తుంది. చివరకు అంబరీషుడు శ్రీమహా



విష్ణువుని మనసులో ధ్యానం చేసుకుని "తులసితీర్థం" త్రాగి దుర్వాసుడికొఅకు వేచి ఉన్నాడు.

దుర్వాసుడు శిష్యసమేతంగా తిరిగి వచ్చి జరిగిన విషయాన్ని గ్రహించి ఆగ్రహోదగ్రుడు అయ్యాడు. "అతిథినై వచ్చిన నన్ను భోజనానికి రమ్మని పిలిచి, నేను రాకుండానే నువ్వు పారణ చేసి నన్ను అవమానించావు" అని పలికి తన శిరస్సునుండి ఒక జటను తీసి శక్తిని సృష్టించి, అంబరీషుణ్ణి వధించమని ప్రయోగించాడు. అంబరీషుడు భయంతో దిక్కుతోచనిస్థితిలో 'శ్రీమన్నారాయణుడి'నే ప్రార్థిస్తూ ఉండిపోయాడు.

'ఆర్తత్రాణపరాయణుడు' అయిన శ్రీమహావిష్ణువు పంపిన 'విష్ణుచక్రం' ఆ శక్తిని హతమార్చింది. అంతేకాక దుర్వాసుడినికూడా శిక్షించుటకు అతనిని వెంబడించి వచ్చింది. తనని తాను రక్షించుకోవడానికి ఆ మునీంద్రుడు ముల్లోకాలు తిరిగాడు. కాని ఆయనను రక్షించేవారే లేకపోయారు. చివరకు వైకుంఠానికి వెళ్లి శ్రీమహావిష్ణువునే శరణుకోరాడు. అప్పుడు విష్ణుమూర్తి 'నేను చేయగలిగింది ఏమీ లేదు' నువ్వు అంబరీషుడినే శరణు వేడు అని చెప్పాడు.

భక్తుడైన అంబరీషుని ఎడల విచక్షణారహితంగా తాను చూపిన ఆగ్రహం అనుచితం అని గ్రహించిన దుర్వాసుడు తిరిగి అంబరీషునివద్దకు వచ్చి రక్షించమని ప్రార్థించాడు.

తక్షణమే సుదర్శనచక్రం అంతర్థానమైంది. దుర్వాసుడు అంబరీషుడి హరిభక్తికి సంతోషించి ఆయనను ఆశీర్వదించి వెళ్లిపోయాడు.

భగవంతుడు సద్గుణాలు కలిగిన భక్తులను రక్షిస్తాడు అని చెప్పడానికి ఇంతకన్నా దృష్టాంతం ఇంకేమి ఉంటుంది.

దుర్వాసుని కోపమే ఆయనకు శత్రువు అయింది. అంబరీషుని శాంతమే ఆయనకు రక్ష అయింది.

ఆయన చూపించిన ఓరిమి తిరిగి వారిద్దరిమధ్య సద్భావాన్ని నెలకొల్పింది. ధర్మబద్ధమైన అంబరీషుని పరిపాలన ప్రజలకు సంతోషకరమైంది. ఈ వృత్తాంతం విన్నప్పుడు సుమతీ శతకకారుని "తన కోపమె తన శత్రువు, తన శాంతమె తనకు రక్ష, దయ చుట్టంబౌ" అన్న పద్యభాగం స్ఫురణకు రాకతప్పదు.

# ఓం

- డా॥ శివలెంక ప్రకాశరావు

ఓంకారం పరమాత్మస్వరూపం. సచ్చిదానందానికి ప్రతి రూపం. శివుడు ఓంకారస్వరూపుడు. వేదాలలోని ప్రతి ఋక్కుకు మొదట- చివర ఓంకారం ఉంటుంది. ఉప నిషత్తులు ఓంకారంతోనే ప్రారంభమవుతాయి. నదుల అలల సవ్వడిలో, సముద్రకెరటాల అలజడిలో, చెట్లఆకుల కదలికలో, రైళ్ళు- మోటార్లు-కార్లశబ్దాలలో, పసిపాపల ఏడ్పులో ఓంకారమే వినబడుతుంది. ఓంకారంనుండే ఈ ప్రపంచం పుట్టింది. దానినుండే పోషింపబడుతున్నది. చివరకు దానిలోనే లీనమవుతున్నది. సమస్తభాషల శబ్దాలు, అక్షరాలు అన్నీ ఓంకారంనుండే పుట్టాయి!

ఓం అనే శబ్దం "అవ్ వ్యాప్తౌ అవరక్షణే" అనే ధాతువులనుండి ఏర్పడింది. అవరక్షణే అనే ధాతువునుబట్టి సంసారసాగరంనుండి ఓంకారం రక్షిస్తుంది. సమస్తప్రాణుల మానసికభావాలను ఓంకారం స్పష్టంగా తెలుసుకుంటుంది. ఓంకారతత్వం చాలా సూక్ష్మమయింది. అన్నింటిలోనూ ప్రవేశి స్తుంది. ఓంకారం ఎంతటి రహస్య విషయాన్నయినా విన గలుగుతుంది. అది చరాచరజగత్తును శాసిస్తుంది. ఈ ప్రపం చాన్ని నడిపిస్తుంది. సమస్తజీవులలో శుభసంకల్పాలను జాగృత పరుస్తుంది. అజ్ఞానాంధకారాన్ని తొలగిస్తుంది. పవిత్రమైన అంతఃకరణం గల సాధకుని పవిత్రభావాన్ని ప్రదర్శిస్తుంది. సాధకుణ్ణి తన హృదయానికి హత్తుకుంటుంది. అర్థించినవాని అర్హతననుసరించి సుఖశాంతులూ, సద్బుద్ధి ప్రసాదిస్తుంది. ప్రళయకాలంలో స్థూలజగత్తును తనలో లీనం చేసుకుంటుంది. సృష్టిమొదట్లో మహత్తత్త్వంలో లీనమైన ప్రకృతిని స్థూల పరుస్తుంది.

అకార, ఉకార, మకారాత్మకమైన శబ్దం ఓంకారం. అది అనంతమైన శక్తికి ఒక సంకేతం. విరాట్, అగ్ని, విశ్వం మొదలైన భగవన్నామాలు అకారంలోను, హిరణ్యగర్భ, వాయు, తేజస్సు మొదలైనవి ఉకారంలోను, ఆదిత్య, యజ్ఞాది పరమాత్మ వాచకాలు మకారంలోను ఉన్నాయి.




బ్రహ్మ ఓంకారంయొక్క మొదటిమాత్రలో ఋగ్వేదాన్ని, భూలోకాన్ని; రెండవమాత్రలో యజుర్వేదాన్ని, అంతరిక్షాన్ని; మూడవమాత్రలో సామవేదాన్ని, ద్యులోకాన్ని; నాలుగోమాత్రలో అథర్వవేదాన్ని, మకారంనుండి ఇతిహాసపురాణాలను సృజిం చాడు. సౌరమండలం కూడా ఓంకారంలోనిదే.

ఓంకారం అకార ఉకార మకారాలు కలపడంవల్ల ఏర్పడుతుంది. ఇది ఈశ్వరునికి జీవుడికి ప్రకృతికి ప్రతినిధి. ఈ అక్షరములే బ్రహ్మ విష్ణు మహేశ్వరులు; మహాకాళి మహా లక్ష్మీ మహాసరస్వతులు; ఋగ్వేద యజుర్వేద సామవేదాలు; గార్హపత్యాగ్ని- దక్షిణాగ్ని- ఆహవనాయాగ్ని, త్రిపుండ్ర త్రిశూల త్రివిక్రమములు, ఆధ్యాత్మిక ఆధిదైవిక ఆధిభౌతికాలనే తాప త్రయం, స్థూలసూక్ష్మ కారణశరీరాలు, జ్ఞాన కర్మ భక్తియోగాలు, భూః భువః సువః అనే మూడులోకాలు, భూతవర్తమాన భవిష్యత్‌కాలాలు, జననీజనక గురువులు.

ఓంకారం లేని మంత్రాలు వాటి శక్తినీ, ప్రభావాన్ని కోలుపోతాయని లింగపురాణం అంటున్నది. అంతేకాదు. ఓంకారాక్షరంనుండి ఆదిశేషుడు, వినాయకుడు, శివలింగం, పాణవట్టం ఏర్పడుతున్నాయి.

ఓంకారాన్ని ప్లుతంగా అంటే మూడుమాత్రలకాలంలో (మాత్ర అంటే చిటికె వేసినంతకాలం) ఉచ్చరించాలని శాస్త్రం చెప్పింది.

ప్రాణాయామం చేసేటప్పుడు ఎడమముక్కునుండి ఓంకారంలోని అకారాన్ని 16మాత్రలలో పూరించి, ధ్యానం చేస్తూ 64మాత్రలతో కుంభకం చేస్తూ ఉకారాన్ని, 32మాత్రలతో మకారం రేచకంచేస్తూ మకారాన్ని ధ్యానించాలి. దీనితోబాటుగా అకారాన్ని పూరించేటప్పుడు సరస్వతి బ్రహ్మలను, ఉకార కుంభక సమయంలో లక్ష్మీవిష్ణువులను, మకార రేచకసమయంలో గౌరీ రుద్రులను ధ్యానించాలి. ప్రాణాయామంతో కూడిన ఈ ఓంకార ధ్యానం 1:4:2 నిష్పత్తిలో క్రమంగా ప్రారంభించి 16:64:32 నిష్పత్తి వరకూ చేరవచ్చు. దీనివల్ల కుండలినీశక్తి మేల్కొని నిర్వికల్ప సమాధిని పొందవచ్చు.

**అక్షరాలన్నీ ఓంకారంనుండే పుట్టినాయి. ఓంకారానికి శిరస్సు అకారం, ఆకారం లలాటం, ఇకారం కుడికన్ను, ఈకారం ఎడమకన్ను, ఉకారం కుడిచెవి, ఊకారం ఎడమచెవి, ఋకారం కుడిచెంప, ౠకారం ఎడమచెంప, లుకారాలు రెండూ ముక్కురంధ్రాలు, ఏకారం పైపెదవి, ఐకారం క్రిందిపెదవి, ఓకార ఔకారాలు పై క్రింది పలువరుసలు, అం అః రెండూ రెండు దౌడలు. క నుండి ఙ వరకూ ఉన్న అక్షరాలు కుడిచేతివ్రేళ్ళు, చ నుండి ఞ వరకూ ఉన్న అక్షరాలు ఎడమచేతివ్రేళ్ళు, ట నుండి ణ వరకూ ఉన్నవి కుడికాలివ్రేళ్లు, త నుండి న వరకూ ఉన్నవి ఎడమకాలివ్రేళ్ళు, పకారం పొట్ట, ఫకారం కుడిప్రక్క, బకారం ఎడమప్రక్క, భకారం స్కంధం, మకారం వక్షఃస్థలం, యకారం నుండి సకారం వరకూ ఉన్న అక్షరాలు సప్తధాతువులు, హకారం ఆత్మరూపం, క్షకారం క్రోధం.**

ఓంకారాన్ని బీజమనీ, బీజమంత్రమనీ చెప్పారు. అది అనాది, అప్రమేయం, సనాతనం, నిర్మలమూ, శుభమూ అయింది. అంతే కాదు. ఓంకారం మంత్రసేతువు అంటే వంతెనవంటిది. అది భవసాగరంనుండి తరింపజేస్తుంది.

ఓంకారాన్ని ఒక దీర్ఘమైన ఘంటానాదంలా ఉచ్చరించాలని శ్రీమద్భాగవతం ప్రకటించింది. ఏకాక్షరబ్రహ్మమైన ఓంకారంతో పరమగతిని పొందవచ్చని గీతలో చెప్పబడింది. ఓంకారసాధనవల్ల శక్తికోశాలు చైతన్యవంతమవుతాయి. భౌతిక ఆధ్యాత్మికశక్తులు వికసిస్తాయి. ప్రణవాన్ని ఉపాసించడం వల్ల జాగ్రదావస్థలోనే భూతభవిష్యత్‌వార్తలను వినగలుగుతారు. కోరిన కోరికలను తీర్చుకొనవచ్చు. ఓంకారనాదంతో భగవంతునికి మన విన్నపాన్ని వినిపించి దానికి తగిన సమాధానం పొందవచ్చు. ఓంకార జపసాధనవల్ల ఇష్టదైవాన్ని సాక్షాత్కరింపజేసుకోవచ్చు.


ఓంకారసాధనతో రోగాలను కూడా నివారింపవచ్చు. ఓంకారధ్వనితో హృదయదౌర్బల్యం తొలగిపోతుంది. మనస్సు ప్రశాంతమవుతుంది. శ్వాసకోశాల బలహీనత తొలగిపోతుంది. హిస్టీరియావంటి దీర్ఘరోగాలు కూడా ఓంకారధ్వనితో నయమవుతాయి. కఫంవల్ల వచ్చే రోగాలు, కడుపునొప్పి, రక్తపోటు, శుక్రదోషాలు ఓంకారధ్వనివల్ల నయం చేయవచ్చు. అందుకే ఓంకారం అమృతలహరి రసాయనం.

ఓంకార నామోచ్చారణవల్ల, జపంవల్ల పదునాలుగురకాలైన విఘ్నాలు తొలగిపోతాయని యోగదర్శనం ప్రకటించింది.

ఓంకారం మానవులకు సద్బుద్ధిని కలిగిస్తుంది. దుర్గుణాలను దూరంచేస్తుంది. అభివృద్ధికి దారి చూపిస్తుంది. మనస్సును నిర్మలపరుస్తుంది. అంతఃకరణను పరిశుద్ధం చేస్తుంది. యోగక్షేమం వహిస్తుంది. మార్గాలను నిష్కంటకం చేస్తుంది. అన్నింటినీ సాధించేలా చేస్తుంది.

ఓంకారాన్ని ప్రతినిత్యం నియమబద్ధంగా భక్తిశ్రద్ధలతో స్మరించేవాడు ఓంకారరూపాన్ని దాల్చి మానవులందరినీ తరింపజేస్తాడు.

ఓంకారాన్ని ఎవరైనా సరే జపించి పరమగతిని పొందవచ్చు. ఓంకారాన్ని జపించడానికి ఎలాంటి నిబంధనలూ లేవు. ప్రజాసమూహంలో లేదా ఒంటరిగా, ఇంటిలో లేదా వెలుపల నదీతీరంలో, పర్వతశ్రేణులలో, పగలు లేదా రాత్రి, ఉదయాన లేదా సాయంత్రం ఎప్పుడైనా సరే ఓంకారాన్ని సాధన చేయవచ్చు.



# యోగం

– శ్రీ జె.నరసింహరావు, 98857 04685

చిత్తవృత్తి నిరోధమునే “యోగం” అని పతంజలి మహర్షి చెప్పాడు. దీనిని “నిదిధ్యాసనం” అని చెప్పవచ్చు. ధ్యానించవలెనని కోరటం ‘దిధ్యాసనం’ నిరంతరంగా ధ్యానించ వలెనని కోరటం ‘నిదిధ్యాసనం’. చిత్తవృత్తులను అన్నింటిని నిరోధించి అనగా ఏ విషయంగురించి ఆలోచించకుండా స్వరూపమును మాత్రమే గ్రహించటానికి మనస్సును నిలిపి వేయటం “నిదిధ్యాసనం”.

‘ఆత్మ’ మన స్వరూపం కాబట్టి మనకు అది ఎప్పుడు ప్రాప్తించే ఉంటుంది. దానిని పొందటానికి చిత్తనిరోధం కారణం కాదు. ఎంతవరకు దానినిగురించి అన్వేషణ, మననం (ధ్యానం) జరుగుతుందో అంతవరకు దానియొక్క అనుభవం కలుగదు. మనస్సును నిద్రలోకిపోకుండా నిలిపి, విషయాలపై పోకుండా ఆపి నా స్వరూపమును చూస్తున్నాను అనే తలంపు కూడ లేకుండా చూస్తూండాలి. అదే స్వరూపస్థితి.

ఈ స్వరూపస్థితినే మనం ‘సమాధిస్థితి’ అని చెప్తున్నాం. నిద్రించటానికి వీలులేక పనిచేస్తూ అలసి పోయినవారికి విశ్రాంతి లభించగానే నిద్ర ఎలా ముంచు కొని వస్తుందో, అలాగే చిరకాలం ఇంద్రియాలవెంట పరుగెత్తి, పరుగెత్తి అలసిపోయిన మనస్సుకు స్వరూపస్థితిలో కొంచెం విశ్రాంతి లభించగానే, సుఖానుభూతి సాధకుని ముంచివేస్తుంది. గాఢనిద్రలో ఉన్నవాడు నిద్రనుండి లేవటానికి ఎలా ఇష్టపడడో, అలాగే సమాధిలో విశ్రమించిన సాధకుడు కూడా ఆ సమాధిని వదలి రావటానికి ఇష్టపడడు.

కాని, సమాధిస్థితి సిద్ధించి సుఖం కలిగిన మాత్రంచేత “ఆత్మజ్ఞానం” కలుగదు. ఎందువల్లనంటే ఎంత గాఢంగా నిద్రించినా, మనస్సుయొక్క సంస్కారములలో కొంచెం కూడా మార్పు కలుగదు. నిద్రనుండి లేచినవాడు, సమాధిస్థితినుండి లేచినవాడు కూడా అంతకుపూర్వం ఎలా ఉంటాడో అలాగే ఉంటాడు. దేహాత్మబుద్ధి, జగత్తు వేరు, నేను వేరు. జీవుడు వేరు, ఈశ్వరుడు వేరు. ఒకనికన్నా మరొకడు భిన్నుడు మొదలైనవి అజ్ఞానంవలన ఏర్పడిన హృదయగ్రంథులు, రాగద్వేషాది వాసనలు మొదలైనవి ఏవీ ఈ సుఖానుభవంచేత నశించవు. “అజ్ఞానం” జ్ఞానంచేత తప్ప మరొకవిధంగా నశించదు. కొందరు జీవితాంతంవరకు సమాధిస్థితిలోనే నిలిచి ఉంటారు. ఆ సమాధి స్థితికి పూర్వం వారికి “ఆత్మజ్ఞానం” ఉంటే మరల జన్మించరు. కాని ఆత్మజ్ఞానం కలుగకముందే సమాధిస్థితిని పొందినవారు, ఆ దేహం పడిపోయిన తరువాత మరొకజన్మను తప్పక పొందుతారు. అపుడు మరల ఆత్మవిచారం చేసి జ్ఞానమును పొంది వారు ముక్తులు కావలసి ఉంటుంది.

ఆత్మవిచారంవల్లనేగాక ప్రాణాయామాది సాధనముల వలన కూడ సమాధి సిద్ధిస్తుంది. తపస్సు చేసి సిద్ధిని పొందిన వారందరు ఈ సమాధిని పొందుతారు. ప్రాణశక్తిని నియంత్రిస్తే మనస్సు కుండలో ఉంచిన దీపంవలె నిశ్చలంగా ప్రకాశిస్తుంది. అదే సమాధిస్థితి.

అలా తపస్సులో నిశ్చలంగా వందలకొలది సంవత్స రాలు ఉంటారు. వారి తపస్సుకు ప్రసన్నుడై భగవంతుడు సాక్షాత్కరించి వరములను ఇస్తాడు. వారికి అలా దేవుడు ప్రత్యక్షమైనా వారి చిత్తవృత్తులలో ఏమాత్రం మార్పు కలగదు. అంతకుపూర్వం ఉన్న రాగద్వేషాదిభావములన్నీ అలాగే ఉంటాయి. అర్జునునకు ఈశ్వరుడు ప్రత్యక్షమైనపుడు పాశుపతము లభించిందే గాని ఆత్మజ్ఞానం కలుగలేదు. కనీసం ఆత్మనుగురించి తెలుసుకోవాలనే కోరిక కూడ కలుగలేదు. సాక్షాత్తుగా శ్రీకృష్ణుడు యుద్ధసమయంలో తత్వమును బోధించినపుడు కూడ అర్జునునకు అది మనస్సుకు పట్టలేదు. వెంటనే అతడు యుద్ధకార్యంలో నిమగ్నుడు అవటంవల్ల విన్న తత్త్వమును మనన నిది ధ్యాసనములతో చక్కగా గ్రహించటానికి అతనికి అవకాశం కలుగలేదు. అందువలన కృష్ణునితో మరల నీవు యుద్ధమునకు ముందు బోధించిన విజ్ఞాన విషయములను తెలియజేయుమని ప్రార్థించాడు. అపుడు ఆయన మరల అర్జునునకు తత్వమును బోధించాడు. ఆ సందర్భంగా "అనుగీత" అనే పేరుతో మహాభారతంలో ప్రసిద్ధమైనది. కావున ఆత్మ

## 2022, జూలై నెల ఉత్సవాలు, పర్వదినాలు

| | |
|---|---|
| 03 - 05 | శ్రీనివాసమంగాపురం, శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి సాక్షాత్కారవైభవం |
| 09 - 11 | తిరుపతి, శ్రీగోవిందరాజస్వామి జ్యేష్ఠాభిషేకం |
| 09 - 12 | తిరుపతి, శ్రీకపిలేశ్వరస్వామివారి పవిత్రోత్సవం |
| 10 | తొలిఏకాదశి |
| 13 | గురుపూర్ణిమ |
| 17 | తిరుమల శ్రీవారి ఆణివర ఆస్థానం |
| 23 | ఆడికృత్తిక |

విచారమువలన కాకుండ సమాధిస్థితివలన జ్ఞానం కలుగదు అనేది నిశ్చయం.

రాక్షసులు తపస్సువలన వరములను పొందిన వెంటనే రాగద్వేషములతో విజృంభించి అక్రమంగా పదవులను, భోగములను పొందుటకే ప్రయత్నిస్తారు. కావున సమాధిస్థితి వలన కలిగే శక్తులు ఆత్మజ్ఞానమును కలిగించకపోగా అహంకారమును, రాగద్వేషాదులను పెంచి వినాశనమును కలిగించటానికి కూడ అవకాశం ఉంది. మనం ధ్యానంలో, సమాధి స్థితిలో కన్నులు మూసుకొని దేనిని పొందుతున్నామో, అదే మన స్వరూపం. అదే జ్ఞానం, శుద్ధచైతన్యం. ఆ చైతన్యమే సకల జగత్తుకుకూడా ఆత్మ. అది లేకపోతే జగత్తులేదు. అదే జగత్తుకు ఆధారం. నేను చిత్తమును నిరోధించి ఆత్మను చూస్తున్నాను అనే ఈ అభిమానగ్రంథిని భేదించాలి. ఈ జగత్తు నేను కాదు అనే భేదగ్రంథిని కూడ ఖండించాలి. అఖండం, ఆనందరూపంగా ఉన్న ఆత్మను సర్వత్ర చూడాలి.

లోపలి దీపం వెలగకుంటే బయట ఎన్ని దీపాలు ఉన్నా ప్రయోజనం శూన్యం. మానవుడు పూర్తి ఎరుకతో ఉంటే అదే ఆత్మానందాన్ని ఇస్తుంది. ఎప్పుడూ ఎరుక కలిగిన మనిషి లేక సాధకుడు లోపల, బయట పారమార్థికంగా, ఆధ్యాత్మికంగా, ప్రాపంచికంగా ఎదుగుతాడు. సాధకుడు మనిషి విపత్కర పరిస్థితులను సైతం తట్టుకొని జీవితంలో పయనం సాగిస్తాడు. ప్రస్తుత ప్రాపంచికజీవనంలో మానవజీవితం అశాంతిమయమై ఉంది. శాంతిమయమైన జీవనం గడపటానికి కుల, మత, వర్గ, వర్ణ భేదాలు లేకుండా ధ్యానాన్ని చేయాలి.

మానవుడు కామ క్రోధ మరియు లోభాలపైన సాధ్యమైనంతవరకు నియంత్రణ సాధించాలి. విపరీతమైన తీర్చేవి, తీర్చలేని కోరికలవలన మానవుడు అధోగతి పొందుతున్నాడు. మాంసాహారానికి అలవాటుపడి తామసప్రవృత్తిని పెంపొందించుకొని కామవాంఛాప్రేరితుడై దురాగతాలకు పాల్పడుతున్నాడు.

ఇటువంటి మానవుడు జనన మరణాలనే చక్రంలో తిరుగుతూనే ఉంటాడు. ఈ ఎరుక కలిగిన మానవుడు సత్యాన్ని గ్రహించి ధ్యానప్రపంచంలో అడుగిడి శాంతిని పొంది అదే ధ్యేయంగా భావించి జీవించాలి.



# అవతారం

- శ్రీ రాచూరి వెంకటరమణ, 98853 21967

భీమసేనుడు వాయు అవతారుడు. కుంతీదేవి ప్రార్థనపై వాయుదేవుని అనుగ్రహంతో అసమాన బాహు జ్ఞాన బల సంపన్నుడు, భగవద్భక్తశ్రేష్ఠునిగా అవతరించాడు. భీమశబ్దము సర్వవిద్యాప్రపూర్ణుడని, సేననామము భగవంతుని సదా భగవదాజ్ఞానుసారియై నిష్ఠతో సేవించువాడు అని అర్థం. ముఖ్యప్రాణుని ప్రథమఅవతారియైన హనుమంతునకు బ్రహ్మాండవ్యాప్తి విశేషముగా గల్గిన శక్తి సామర్థ్యములను వ్యక్తీకరించుచున్నది. దేవతలలో పరమాత్మనుచ్ఛస్థితిగా స్వయోగ్యతతో ఎక్కువకాలము ఉపాసించిన నలభైతొమ్మిదవ బ్రహ్మాండమున ముఖ్యప్రాణుడు(వాయువు) అవుతాడు. యాభైయ్యవ బ్రహ్మాండమునందు బ్రహ్మపదవినధిష్ఠించి ఆ బ్రహ్మాండమునకు అధినేత అవుతాడు. భీమసేనుడు రామాయణంలో శ్రీరామభక్తుడైన హనుమంతునకు అన్నివిధాల సరితూగే మహాపరాక్రమశాలి, తత్వజ్ఞాని, దాసవరేణ్యుడు. ఈ కారణజన్ములైన వాయు అవతారులు దుష్టశిక్షణ శిష్టరక్షణకార్యక్రమంలో శ్రీమన్నారాయణుని తోడునీడగా, సహాయకులుగా నియమింపబడిన విశిష్ట హరిభక్తశ్రేష్ఠులు.

మహాభారతంలో భీమసేనుడు కేవలం బాహుబల, మల్లయుద్ధ, గదాయుద్ధ సంపన్నుడని, పాకశాస్త్రనిపుణుడనీ ఇవి మినహా సోమరియని, నిద్రాలోలుడని, తిండిపోతుయని, ముక్కోపి, మొరటువాడని పేర్కొని పరిహసించుట విచారకరం. భావితరాలకు ఈ విషయం బోధపరచుటకు శ్రీమధ్వాచార్యులవారు తమ "మహాభారతతాత్పర్య నిర్ణయము" గ్రంథంలో భీమసేనునిపాత్రను సమగ్రంగా విశ్లేషణం చేసి భీముని సుందరాకారునిగా, విశిష్టతత్వజ్ఞానిగా, శస్త్రార్థవిద్యల్లో ఆరితేరినవానిగా, పాండవరక్షకునిగా, శత్రుభయంకరునిగా తన విశేషప్రతిభాపరాక్రమస్వామిభక్తితో శ్రీకృష్ణ భగవానుని ధర్మరక్షణాకార్యక్రమమున, దుష్టశిక్షణ శిష్టరక్షణా స్వామికార్యమున అనన్యసాధ్యంగా తనవంతు సేవనొనర్చిన పరమవిష్ణుభక్తునిగ, భాగవతోత్తమునిగా నిర్ణయించారు. మూలమహాభారతంలో పలు ఉదాహరణలీవిషయములు ఎలుగెత్తి చాటుతున్నాయి. యాగాలన్నింటిలో అశ్వమేథయాగమును, వెలుగునిచ్చు జ్యోతులన్నింటను సూర్యుడును, ద్విపదులలో బ్రాహ్మణులును, అట్లే సర్వదేవతలయందు వాయుదేవుడు శ్రేష్ఠుడు. కావున శాస్త్రకోవిదుడైన పాండురాజు "జ్ఞానబలములచే" ధర్మము రక్షించబడును కావున వాయుదేవుని అనుగ్రహంతో ధర్మరక్షకుడగు బలజ్ఞానఐశ్వర్య సంపన్నుడైన పుత్రుని బడయుమని కుంతిని కోరాడు. బాల్యంలో భీమసేనుని భారమును భరించలేక భూమియే చీలిందట. ఇది భీమసేనుని బలాధిక్యతకు దృష్టాంతం. సుమధ్వవిజయమున భీమసేనుడు తన బాల్యదశలోనే సింహసమూహముల నెదుర్కొనెడివాడని పేర్కొనబడింది.



తత్వజ్ఞానమునందుగాని, విష్ణుభక్తిలోగాని, స్థిరత్వంలో గాని, పరాక్రమవేగములనందుగాని, వ్యర్థప్రసంగము చేయనట్టి వాడు, పాండిత్యమునందుగాని, కౌశలమునగాని, శౌర్యములలో గాని, బలములోగాని, కౌరవసేనలనన్నింటిలో భీమసేనునికి సరితూగగల వ్యక్తి ఇంకొక్కడు లేడు.

అర్జునుడు ఇంద్రావతారుడు. నరాంశతో జన్మించి సాధారణ నరులవలె మోహ, భయములు, బంధుప్రీతి, స్వధర్మ నిర్లక్ష్యములను అవలక్ష్యములు కలవాడని భగవద్గీత వివరించింది. శ్రీకృష్ణుడు అర్జునునకు భగవద్గీత బోధ చేసి ధర్మరక్షణ పథమువైపు వెన్నంటి సదా రక్షించి నడిపించి విజయునొనర్చాడు. శ్రీకృష్ణునిసహాయంతో అర్జునుడు భీష్మ, కర్ణాదులతో సహా ఐదు అక్షౌహిణీలసైన్యాన్ని పరిసమాప్తమొనర్చాడు.

భీమసేనుడు ధర్మరక్షాపరాయణుడై, పాండవసేనానాయకుడై, శత్రుభయంకరుడై స్వశక్తితో ఆరు అక్షౌహిణీలసైన్యాన్ని




నిర్మూలించి కురురాజుగుండెల్లో నిద్రపోయాడు. ఇది స్వామి కార్యసాధనకు నిదర్శనం. "పర్యాప్తం త్విదమేతేషామ్ బలం భీమాభిరక్షతం" అన్న భయాన్ని దుర్యోధనుడు నిస్సంకోచంగా వ్యక్తం చేశాడు. కలిపురుషుడైన కురురాజు దుర్యోధనుని, దుశ్శాసనుని, జరాసంధుని, కీచకుని, జీమూతుని, బకాసురుని, హిడింబాసురుని సంహరించింది భీమసేనుడే.

భీమసేనుడు కాలకూటవిషాన్ని తిని జీర్ణించుకున్న విషయాన్ని మహాభారతంలో స్పష్టంగా చెప్పబడింది. సముద్ర మథనసమయంలో వచ్చిన లోకభయానకమైన కాలకూట విషాన్ని త్రాగి సునాయాసంగా ఎట్టి వికారానికి లోనుకాక జీర్ణించుకొన్నవాడు వాయుదేవుడే అని ఋగ్వేదంనందలి "కేశి" సూక్తం సమర్థిస్తోంది.

కాలకూటవిషాన్ని అవలీలగా మ్రింగి సునాయాసంగా జీర్ణం చేసుకున్న ఘనత కేవలం భగవంతుడైన శ్రీకృష్ణునికి, అమృతమథనసమయంలో ముఖ్యప్రాణునికి మరియు ముఖ్యప్రాణుని ద్వితీయ అవతారమైన భీమసేనులకు మాత్రమే ఉంది. బలిత్థసూక్తంలో "పితుమాన్" అన్న విశేషణంతో బహ్వన్న భోక్తారునిగా భీమసేనుడు వర్ణింపబడ్డాడు.

మధ్వాచార్యులు గురువైన అచ్యుతప్రేక్షులు శ్రీమధ్వుల భోజనసామర్థ్యానికి ఆశ్చర్యచకితులైన తన గురువులకు మధ్వాచార్యులు తన సామర్థ్యరహస్యాన్ని ఈవిధంగా వివరించారు.

వాయు అవతారమైన హనుమంతుని సోదరుడైన భీమసేనుని వారసుడనని, బొటనవ్రేలిప్రమాణంగా జఠరాగ్ని తమ ఉదరమందు సదా ప్రజ్వలిస్తూ ఏ పదార్థమెంత పరిమాణంలో ఉన్నను సునాయాసంగా ఎట్టి వికారాలు లేక జీర్ణించుకొను జీర్ణశక్తి తనకుందని గురువులకు మధ్వాచార్యులు వివరించారు. అంగుష్ఠమాత్రమైన జఠరాగ్ని సదా ఉదరమున ధరించినవాడు కావున భీమసేనుడు వృకోదరునిగా ప్రసిద్ధిచెందాడు.

నరసింహస్వామి హిరణ్యకశ్యపుని సంహరించిన విధంగా భీమసేనుడు దుశ్శాసనునిసంహారము మన్యుసూక్త పఠనంతో నృసింహదేవుని స్మరణచేస్తూ భక్త్యుద్రేకభగవద్యజ్ఞంగా ఒక శ్రేష్ఠమునివలె గావించాడే గానీ భావోద్రేకంతో కానే కాదు.

భీమసేనుని భీకరాకారమును, ప్రళయ ఘీంకారమును చూచిన పలు కురుయోధులు భీతితో మూర్ఛిల్లారు. పలువురు పలాయనం చిత్తగించారు. పలువురు నిశ్చేష్టులై హతాశు లయ్యారు. రణరంగమంతా శూన్యవాతావరణంతో నిండి పోయింది. ఇది భీమసేనుని అసమానపరాక్రమానికి నిదర్శనం.

శ్రీకృష్ణుని సంకల్పానుసారం 14వరోజు యుద్ధంలో తన కుమారుడు ఘటోత్కచుడు హతుడౌతాడని తెలిసి, అంతకుముందే కర్ణుని ఓడించినా తన శక్త్యాయుధాన్ని సంగ్రహించలేదు. అదే కారణంతో అభిమన్యుని రక్షించటానికి చక్రవ్యూహాన్ని భీమ సేనుడు శక్తియున్ననూ ఛేదించనెంచలేదు. అర్జునుడు పుత్ర వ్యామోహంతో కలత చెందటం, శ్రీకృష్ణుడు అతణ్ణి సమాధానపరచటం జరిగింది.

అశ్వత్థామ భీమునిపై నారాయణాస్త్రం ప్రయోగించినపుడు భీమసేనుడు కేవలం యోగ మానసపూజ ఒనర్చాడేగాని తప్పించుకొనే ప్రయత్నం చేయలేదు. నారాయణాస్త్రానికి విరోధంగా అస్త్రప్రయోగమునూ చేయ సంకల్పిం చనూ లేదు. స్వయంగా భగవాన్ శ్రీకృష్ణుడే భీమ సేనుని రథమునుండి దింపి నేలమీద నిలబెట్టి నాడంటే భీమసేనుని దాస్యగుణం, ఔన్నత్యం స్పష్టంగా ప్రకటమౌతున్నాయి.

జయద్రథుని రక్షించటానికి 14వ దినమున ద్రోణుడు నిర్మించిన శకటాబ్జచక్ర వ్యూహాన్ని (చక్రవ్యూహముకన్న గొప్పది) భీమ సేనుడు అవలీలగా ఛేదించినట్లు మూలమహా భారతంలో ఉంది. భీమసేనునికి అసాధ్యమైనదే దియూ లేదు అని పాఠకులు తెలుసుకోవాలి.

మహాభారత వివిధఘట్టాల్లో ఏ సమయ సందర్భంలోను భీమసేనునికి శ్రీకృష్ణునితో అభిప్రాయభేదం కలుగలేదు. శ్రీకృష్ణుని అభిమతమే భీమసేనుని అభిమతం. భీమసేనుని లక్ష్యసిద్ధియే శ్రీకృష్ణుని లక్ష్యం. భగవంతుని కార్యసాధనే భీమ సేనుని కర్తవ్యం.

రాజసూయయాగం శ్రీకృష్ణభీమసేనుల సంకల్పంవల్లనే జరాసంధవధ పిమ్మట జరిగింది. యుధిష్ఠిరాదులు బ్రహ్మ రుద్ర వరములచే బలవంతుడైన జరాసంధుని జయింప అసంభవ మని రాజసూయయాగమును విరమించబోగా భీమసేనుడు జరాసంధవధ పిమ్మట రాజసూయయాగము గావింతుమని శ్రీకృష్ణుని మనోభావములను ప్రకటించి ఈ ఉభయకార్యములను ముందుండి నడిపించాడు.

జరాసంధ, దుర్యోధన, దుశ్శాసన, కీచక, జీమూత, హిడింబాసుర, బకాసురవధలను భావోద్వేగమునకు లోనుగాక శ్రీకృష్ణుని పూజగా(యజ్ఞము) నెరవేర్చిన మహాజ్ఞాని, మహాయోగి



జీవోత్తముడు భీమసేనుడు. రాజసూయయాగమున విరాట, శిశుపాలాదులు భీమసేనునికి లొంగిపోగా, సహజకవచకుండల ధారియైన కర్ణుణ్ణి యుద్ధమున ఓడించి కప్పమును కట్టించుకొన్నాడు. కవచకుండల హీనుడైన కర్ణుణ్ణి జయించటానికి అర్జునుడు కడు ప్రయాసపడి తుదకు శ్రీకృష్ణునిసహాయంతో జయించాడు. విద్య ఉపజీవమునకు కాదు అను వాక్యాను సారం భీమసేనుడు తన భాగవతధర్మానికి భంగం వాటిల్లకుండా కడు జాగరూకతతో మసలుకొనేవాడు. విరాట్కొలువులో వైదికవృత్తిలో ఉన్నా తన జ్ఞానాధిక్యత ప్రకటితమై తాను భీమసేనుడను విషయం తెలిసి పోతుందేమోనని అజ్ఞాతవాసం భంగపడని సూద వేశము ధరించాడు.

భగవానుడు శ్రీకృష్ణుడే స్వయంగా భీమసేనుని పరాక్రమప్రతాపాలను కీర్తించటం గమనార్హం. "దుర్యోధనా! నీ రాజ్యానుచరులవల్ల నీకు రక్షణ కలుగుతుందని భ్రమపడుతున్నావు. నీవు, వీరందరూ కలసియైనా కోపోద్రిక్తుడైన భీమసేనునిముఖమును కూడా చూడ్డానికి శక్తిహీనులు" అని కౌరవులను హెచ్చరించటం గమనార్హం.

"నీ (శ్రీకృష్ణుని) దయ ఉంటే ఈ బ్రహ్మాండము నంతయునూ జయించి జయభేరి మ్రోగించగలను" అని తాను శ్రీమన్నారాయణుడు పాలసంద్రమున పవళించు వేయిపడగల ఆదిశేషునకు కూర్మరూపమున ఆధారుడైన వాయుఅవతారియైన "భీమసేనునిగా" తనకేదియూ అసాధ్యము కాదని తెలుపగా ఆ పౌరుష విన్యాసములను ఆలకించిన శ్రీకృష్ణుడు"నీవు ప్రకటించిన నీ బలపౌరుషములకన్నా వేయిరేట్లు ఎక్కువ బలపౌరుషములు నీకు కలవని నాకు తెలుసు" అని స్వయాన శ్రీకృష్ణుడే భీమసేనుని ప్రశంసించినాడు. అర్జునుడు తన పరాక్రమశౌర్యములను గూర్చి అతిగా ప్రస్తావించినప్పుడు శ్రీకృష్ణుడాతని మాటలను ఆమోదించలేదు. పంచమవేదం మరియు ఉత్తమ సాహిత్య గ్రంథమైన "మూలమహాభారతంలో" భగవాన్ వేద వ్యాసుడు వివరించిన భీమసేనుని మహోత్తమ పాత్ర చిత్రణం మనోల్లాసపూరితం.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

## పంచగవ్య ఉత్పత్తుల విక్రయ కేంద్రము

## "నమామి గోవింద"

### ధరల పట్టిక

| క్రమ సంఖ్య | ఉత్పత్తి పేరు | పరిమాణం / ఒక్కొక్కటి | వెల (ఒక్కొక్కటి) |
|---|---|---|---|
| 01 | అవని-ధూపచూర్ణము | 50 గ్రా॥<br>100 గ్రా॥ | రూ.70/-<br>రూ.115/- |
| 02 | ధరణి-ధూప అగరబత్తి | 12 స్టిక్స్<br>24 స్టిక్స్ | రూ.60/-<br>రూ.110/- |
| 03 | ధాత్రి-ధూపపు కప్పులు | 6 కప్పులు<br>12 కప్పులు | రూ.70/-<br>రూ.110/- |
| 04 | వైష్ణవి-ధూపపు | 20 స్టిక్స్ | రూ.30/- |
| 05 | వరాహి-ధూపపు కోన్స్ | 12 కోన్స్<br>24 కోన్స్ | రూ.30/-<br>రూ.50/- |
| 06 | పృథ్వి-విభూది | 10 గ్రా॥<br>30 గ్రా॥<br>50 గ్రా॥ | రూ.30/-<br>రూ.40/-<br>రూ.60/- |
| 07 | ధన్విక-టూత్‌పౌడర్ | 50 గ్రా॥<br>100 గ్రా॥ | రూ.40/-<br>రూ.60/- |
| 08 | హిరణ్మయి-ఫేస్ ప్యాక్ | 50 గ్రా॥<br>100 గ్రా॥ | రూ.110/-<br>రూ.200/- |
| 09 | మహి-సబ్బు | 25 గ్రా॥<br>75 గ్రా॥<br>100 గ్రా॥ | రూ.40/-<br>రూ.80/-<br>రూ.110/- |
| 10 | కశ్యపి-షాంపూ | 5 మి.లీ.<br>100 మి.లీ. | రూ.10/-<br>రూ.210/- |
| 11 | ఉర్వి-నాజల్ డ్రాప్స్ | 10 మి.లీ. | రూ.100/- |
| 12 | నందిని-గో అర్కము | 200 మి.లీ.<br>500 మి.లీ.<br>1 లీటరు | రూ.50/-<br>రూ.110/-<br>రూ.200/- |
| 13 | భూమి- ఫ్లోర్ క్లీనర్ | 1 లీటరు<br>5 లీటర్లు | రూ.250/-<br>రూ.1050/- |
| 14 | క్షమ-గోవు పేడ పిడకలు | 10 పిడకలు<br>12 పిడకలు | రూ.140/-<br>రూ.170/- |
| 15 | భూపతి-గోవు పేడ దుంగలు | 6 దుంగలు<br>12 దుంగలు | రూ.90/-<br>రూ.180/- |

- కార్యనిర్వహణాధికారి, తి.తి.దే. తిరుపతి.

# తిరుమల తిరుపతి దేవస్థానములు



# నమామి గోవింద

**పంచగవ్య :** ఆవునుండి ప్రసాదింపబడ్డ పంచగవ్యాలు తిరుమల తిరుపతి దేవస్థానంవారి ఆధ్వర్యంలో ఆయుర్వేదిక్ ఉత్పత్తులుగా తయారుచేయబడ్డాయి. ఇందు ఒక్కొక్క ఉత్పత్తి ఒక్కొక్క ఆకృతిలో ఎంతో జాగ్రత్తగా తయారుచేయబడ్డాయి.

**అగరుబత్తీలు :** తిరుమల శ్రీవారు మరియు తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి అనుబంధ ఆలయాల్లోని దేవతామూర్తులకు అలంకరించిన పుష్పాలనిర్మాల్యంతో ఏడురకాలైన పరిమళపు అగరుబత్తీలు తయారు చేయబడ్డాయి.

**పుష్పప్రసాదం :** తిరుపతి శ్రీవారు మరియు తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి అనుబంధ ఆలయాల్లోని దేవతామూర్తులకు అలంకరించిన పుష్పాలనిర్మాల్యంతో ఫోటోఫ్రేములు, కీ చైన్లు, పేపర్ వెయిట్స్, డాలర్స్, పెన్నులు మరియు పెన్నుస్టాండులువంటి ఉత్పత్తులన్నీ డ్రైఫ్లవర్ టెక్నాలజీతో తయారు చేయబడ్డాయి.







Designed by SVBC,TTD

# పంచగవ్య ఉత్పత్తులు

### ఉర్వి నాసల్ డ్రాప్స్
జలుబు, తలనొప్పులను నివారిస్తుంది. (కన్ను, ముక్కు, చెవి).

### భూమి హెర్బల్ ఫ్లోర్ క్లీనర్
నేలపై ఉన్న బ్యాక్టీరియాను నిర్మూలిస్తుంది.

### నందిని గౌ-అర్క్
క్రమం తప్పక వాడిన దీర్ఘాయుర్దాయం, జీవనప్రమాణకాలం మెరుగుపడతాయి.

### క్షమా కౌ డంగ్ కేక్స్
యజ్ఞాలు, యాగాల్లో... మంచి వాతావరణం కల్పిస్తుంది.

### భువతి డంగ్ లాగ్స్
యజ్ఞాలు, హోమాల్లో... మంచి వాతావరణం కల్పిస్తుంది.

### అవని ధూప్ చూర్ణం
సువాసనను కల్పిస్తుంది.

### ధరణి అగరుబత్తి
ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తుంది.

### ధాత్రి సాంబ్రాణి కప్స్
మంచి ఆరోగ్యానికి ఆలంబననిస్తుంది.

### వైష్ణవి ధూప్ స్టిక్స్
వాతావరణాన్ని శుభ్రపరుస్తుంది.

### వారాహి ధూప్ కోన్స్
చుట్టుప్రక్కల వాతావరణాన్ని పవిత్రపరుస్తుంది.

### పృథ్వి విభూతి
ఈశ్వరానుగ్రహప్రాప్తి కల్గిస్తుంది.

### ధన్శిక హెర్బల్ టూత్ పౌడర్
దంతములు, దంతచిగుర్లకు రక్షణనిస్తుంది.

### హిరణ్మయి హెర్బల్ ఫేస్‌ప్యాక్
రంగు, ముఖవర్చస్సులను మెరుగుపరుస్తుంది.


### మహి హెర్బల్ సోప్
చర్మాన్ని సంరక్షిస్తుంది.

### కశ్యపి హెర్బల్ షాంపు
శిరోజాలను సంరక్షిస్తుంది.



# నిర్మాల్యపు పుష్పాల ఉత్పత్తులు

## ఫోటోఫ్రేములు మరియు కీ చైన్లు (డ్రైఫ్లవర్ టెక్నాలజీ)












## అగరుబత్తీలు (నిర్మాల్యపు పుష్పాల ఉత్పత్తులు)

















సకలదేవతాస్వరూపమైన గోమాతలో జగన్మాతయైన శ్రీమహాలక్ష్మి కొలువై ఉంటుందని పెద్దలు అంటారు. గోమాత మానవాళికి ఎన్నోరకాలుగా సేవలందిస్తున్నది. ముఖ్యంగా గో సంబంధిత పంచగవ్యాలైన పాలు, పెరుగు, నెయ్యి, ఆహార ద్రవ్యాలుగా, గోమూత్రం, గోమయం ఓషధాలుగా మనకు ఉపయోగపడుతున్నాయి. శ్రీమహావిష్ణువు భూలోకానికి అందించిన దివ్యవరం గోమాత. అందుకనే సప్తగిరుల సార్వభౌముడైన గోవిందుని సంస్థానమైన తి.తి.దేవస్థానం పంచగవ్యఉత్పత్తులను "**నమామి గోవింద**" పేరుతో భక్తులకు అందిస్తున్నది.

మాతా రుద్రాణాం, దుహితా వసూనాం
స్వసాఽఽదిత్యానా మమృతస్య నాభిః।
ప్ర ను వోచమ్ చికితుషే జనాయ
మా గా మనాగా మదితం వధిష్ట ॥ (ఋగ్వేదము)

గోవు రుద్రులకు తల్లి, వసువులకు కూతురు, ఆదిత్యులకు సోదరి, సర్వమానవులకు అమృతప్రాయమైన పాలను ఇచ్చి పోషిస్తున్న తల్లి. అటువంటి గోవును మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలలో తల్లిగా సర్వదేవతా స్వరూపిణిగా ఆరాధించారు.

కస్టమర్ కేర్: 1800 425 4141
ఇ-మెయిల్: helpdesk.ttd@tirumala.org





# భజామి గోవిందం




– డా॥ నొస్సం నరసింహాచార్య
90528 44442

హైందవ సంస్కృతి సంప్రదాయాల్లో గోవుకు ప్రత్యేక స్థానం ఉంది. పవిత్రతకు, స్వచ్ఛతకు, శ్రమకు గోవు ప్రతీక. ఈనాటికి హిందూసంస్కృతిలో ప్రధాన శ్రద్ధాకేంద్రంగా గోవు మన్ననలు అందుకుంటున్నది. భారతదేశంలో వేదకాలంకంటే ముందే గోవులు అత్యంత ప్రాముఖ్యాన్ని పొందాయి. వేదాలు, స్మృతులు, పురాణాలు ఇతిహాసాలు తరువాత వచ్చిన వివిధ సాహిత్యగ్రంథాలు గోవును తల్లిగా గోమాతగా ప్రశంసించాయి. ఆచార్య వినోభాభావే మాటల్లో చెప్పాలంటే లోకకల్యాణం కొరకు భగవంతుడు గోవును సృష్టించాడు. మనం చేసే సేవ, చూపే ప్రేమను గ్రహించి గోమాత అంతకు రెట్టింపుగా మనకు తిరిగి ఇస్తుంది.

గోవు యొక్క పుట్టుక చరిత్రయే వేరు. దేవదానవులు అమృతాన్ని కోరి క్షీరసాగరమథనం చేసినపుడు అందులోనుండి మొదట హాలాహలం అనే భయంకర విషం పుట్టింది. లోకక్షేమం కోరి పరమేశ్వరుడు దానిని పానం చేశాడు. ఆ తర్వాత లక్ష్మీదేవి, ఐరావతం, ఉచ్చైశ్రవం చంద్రుడు ఉద్భవించారు. ఆ తర్వాత కల్పవృక్షం, కామధేనువు ఉద్భవించాయి. ఆ తర్వాత ఉద్భవించిన అమృతాన్ని చేతధరించి ధన్వంతరి ఆవిర్భవించాడు. శ్రీహరి మోహినీరూపాన్ని ధరించి యుక్తిగా దేవతలకు అమృతాన్ని అందించాడు. అలాగే పరమాత్ముడు మానవక్షేమం కోరి అమృతనాభి అయిన కామధేనువును ఈ భూలోకానికి ప్రసాదించాడు. మానవులు కోరిన కోర్కెలుతీర్చే ఆ కామధేను సంతతే గోమాత.

'*మాతా రుద్రాణాం దుహితా వసూనాం స్వసాదిత్యానాం అమృతస్య నాభిః ప్రను బోచం చికితుషే మా జనాయ గామనాగా ఖాదితి వధిష్ట॥*' అంటే గోవు రుద్రులకు మాత, వసువుల పుత్రిక, ఆదిత్యుడి సహోదరి. పాలు నెయ్యి వంటి అమృత తుల్యములైన పదార్థాలను అందిస్తుంది. అటువంటి గోవులను హతమార్చక సంరక్షించాలని వివేకశీలురు తెలుసుకోవాలని ఋగ్వేదం గోమాతను గురించి వివరిస్తుంది.

మన హైందవ సంప్రదాయంలో గోవుకు మించిన ఉన్నతస్థానం మరెవరికి లేదు. కన్న తల్లి తన బిడ్డలను ఎలా కంటికి రెప్పలా కాపాడుకుంటుందో, అలాగే గోవు మనల్ని సంరక్షిస్తుంది. అందుకే వేదాలు గోవును "గావో విశ్వస్య మాతరః" అంటే "గోవు సకల జగత్తుకు మాత"గా పేర్కొన్నాయి.

గోవు భారతీయ ధార్మిక చింతనలోనే కాదు ఆర్థిక వ్యవస్థలోను ఒకనాడు అత్యంత ప్రధానమైన ద్రవ్యంగా కూడా చలామణి అయ్యింది. భారతీయులు వ్యవసాయం మీద ఆధారపడితే ఆ వ్యవసాయాన్ని తమ భుజస్కంధాలమీద మోస్తుంది గోసంతతి. అందుకే గోవును గోమాత అంటున్నాం, ఎద్దును 'బసవన్న' అంటున్నాం. మన దేవతలలోకూడా శ్రీకృష్ణుడు గోపాలకుడుగా, గోవిందుడు (గోవులకు ఆనందాన్ని కలిగించేవాడు)గా కీర్తింపబడుతున్నాడు. పరమేశ్వరుడు నందిని వాహనంగా కలిగి ఉన్నాడు. గోవును గోమహాలక్ష్మి అనికూడా పిలుచుకుంటారు భారతీయులు. అందుకు కారణం గోవు ముక్కోటిదేవతలకు నిలయమైన పరమ పవిత్రమైన జీవి. గోవు ఎల్లప్పుడు శుచిగా ఉంటుంది. తన పరిసరాలను శుచిగా ఉంచుకుంటుంది. ఈ విశాలవిశ్వంలో తన ఉచ్ఛ్వాసనిశ్వాసా

లలో నత్రజనిని తీసుకుని ప్రాణవాయువును ప్రసాదించే ఏకైక జీవి గోమాత. తన పరిసరాలను కాలుష్యరహితంగా చేస్తుంది. కనుకనే "సదాగావః శుచయః" అని సామవేదం కొనియాడింది.

గోమాత పరమపవిత్రమైన జీవి అందుకే ఆ గోవునుండి ఉత్పన్నమయ్యే పదార్థాలుకూడా పరమపవిత్రములైనవే కాకుండా ఆరోగ్యప్రదాయకాలైన ఔషధీగుణములు కలిగినవి. వీటినే పంచగవ్యాలు అంటారు. గవ్యం అనగా గోవు ద్వారా లభించే వని అర్థం. అవి ప్రధానంగా ఐదు అని వీటినే పంచ గవ్యాలని వేదాలు పేర్కొన్నాయి.

గోవుద్వారా లభించే పాలు, పెరుగు, నేయి, గోమయం (ఆవుపేడ), గోమూత్రం వీటిని పంచగవ్యాలు అంటారు. ఇవి అత్యంత అమూల్యమైన అనేకానేక అనారోగ్యసమస్యలను దూరంచేసే అమృతతుల్యాలైన, అద్భుతమైన ఔషధాలు. పంచ గవ్యాలను మంత్రబద్ధంగా నియమానుసారంగా దర్భతో కలిపి తీసుకుంటే సకలపాపాలు, సకలదోషాలు తొలగిపోతాయని కూడా వేదాలు పేర్కొంటున్నాయి.

గోమయ గోమూత్రాలు (వ్యవసాయ) పంటలకు అమృతం వంటి పోషణను శక్తిని ఇస్తాయి. వివిధ రకాలైన పురుగులను నివారించి పంటకు చక్కటి బలాన్ని విస్తృతమైన దిగుబడిని ఇస్తాయి. గో ఆధారిత వ్యవసాయం మనకు ప్రాచీన కాలంనుండి ఉన్నటువంటిదే. నేటి ఆధునిక యాంత్రిక యుగంలో పశుసంపద గణనీయంగా తగ్గి యంత్రాలపై ఆధారపడి రసాయనాలు వాడుతూ, పంట దిగుబడులను పెంచుకుంటు వివిధరోగాలను సమస్యలను కొనితెచ్చుకుంటున్నాము.

ఈ విషయాలను దృష్టిలో పెట్టుకొని తిరుమల తిరుపతి దేవస్థానములు 'నమామి గోవిందం' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా గోఆధారిత వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ, గో ఆధారిత ఉత్పత్తులను స్వతహాగా తయారుచేస్తూ జగన్మాత అయిన గోవును, గో సంతతిని సంరక్షించే బాధ్యతను చేపట్టింది. ఇటీవల గో ఆధారిత వ్యవసాయం ఉత్పత్తులపై ఒక అంతర్జాతీయ సదస్సును తిరుపతి మహతి కళాక్షేత్రంలో ఏర్పాటుచేసి గోఆధారిత వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ తద్వారా పండిన పంటను తి.తి.దే శ్రీవారి ప్రసాదాల నిమిత్తం కొనుగోలు చేసేందుకు రైతులనుండి ఒప్పందం చేసుకుంది.

ప్రతి దేవాలయంలోను దేవునితోపాటు ఆతని సేవకు గోమాత కూడా ఉండాలనే సత్సంకల్పంతో "గుడికోగోమాత" కార్యక్రమాన్ని ప్రారంభించింది. వందలాది దేశీగోవులను శ్రీవేంకటేశ్వర గోసంరక్షణశాలలో సంరక్షిస్తోంది. అలిపిరి వద్ద గోశాల, గోమందిరాన్ని నిర్మించి గోపూజను నిర్వహిస్తోంది. "గోవిందునికి గో ఆధారిత నైవేద్యం" పేరుతో గో ఆధారిత వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ ఆ పంటలద్వారా వచ్చిన ధాన్యాన్నే గోవిందునికి నైవేద్యంగా సమర్పిస్తోంది. ఇందులో భాగంగానే గోఆధారిత వ్యవసాయంద్వారా లభించిన 100 టన్నుల శెనగ పప్పు ఇటీవల తిరుమల చేరాయి. వీటిని సంప్రదాయ బద్ధంగా పూజించి శ్రీవారి ప్రసాదాలకు వినియోగిస్తున్నారు. "నవనీత సేవ" పేరుతో ఆవుపాలనుండి వెన్న తీసే కార్యక్రమాన్ని శ్రీవారిసేవలో మాతృమూర్తులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. తద్వారా శ్రీవారిప్రసాదాల తయారీకి వినియోగించే ఆవునెయ్యిని ఉత్పత్తి చేయడం ప్రారంభించారు.

## పంచగవ్య ఉత్పత్తులు

గోసంబంధములైన పాలు, పెరుగు, నెయ్యి, గోమయం, గోమూత్రములనే పంచగవ్యాల ద్వారా తి.తి.దేవస్థానములు వివిధ నిత్యావసరాలు, ఆయుర్వేద ఓషధులు తయారు చేయడం ప్రారంభించిది. 2019వ సంవత్సరంలో కోవిడ్ రాకతో ప్రపంచ ప్రజల దృష్టి రసాయన రహిత ఉత్పత్తులపై పడింది. దీనిని దృష్టిలో పెట్టుకొని తి.తి.దేవస్థానములు పంచగవ్య ఉత్పత్తులను ప్రారంభించింది. వీటి తయారీకి ఒక ప్రత్యేకభవనాన్ని కేటాయించి అక్కడ ఆయుర్వేద సబ్బులు, టూత్‌పౌడర్లు, టూత్ పేస్టులు, హ్యాండ్‌వాష్ లిక్విడ్ సోపులు, వివిధ రకాల అగరు బత్తీలు, ధూపం కప్పులు, సాంబ్రాణిపొడి, విభూతి, ఫేస్ ప్యాక్‌లు, దోమల మందులు (మస్కిటో కాయిల్స్) గో మయం పిడకలు, నాసల్ డ్రాప్స్, గోమూత్ర అర్క వంటి ఉత్పత్తులను తయారు చేస్తూంది. వీటి సామర్థ్యాన్ని పరీక్షించిన తరువాతే అమ్మకానికి అనుమతిస్తున్నది. ఈ ప్రతి ఉత్పత్తిలోను గో సంబంధమైన గోమయ గోమూత్రాదులు ఉంటాయి. ఈ ఉత్పత్తులను "నమామి గోవిందం" అనే పథకం క్రింద భక్తులకు సరస

మైన ధరలకే విక్రయిస్తూ, ఈ ఉత్పత్తులన్నీ గోవిందనామాంకితం చేయబడ్డాయని సూచిస్తున్నది.

ఇంతటి మహత్తరమైన గో ఉత్పత్తులను ప్రారంభదశలోనే విస్తృతంగా చేపట్టేందుకు అవసరమైన వందలాది దేశవాళి గోమాతలు తి.తి.దే. శ్రీ వేంకటేశ్వర గో సంరక్షణశాలలో ఉన్నాయి. తి.తి.దే వీటి ఆలన పాలన విషయంలో ప్రత్యేకశ్రద్ధ కనబరుస్తోంది.




ఇక తి.తి.దే. మరో విభాగమైన శ్రీశ్రీనివాసఆయుర్వేదఫార్మసి ఆధ్వర్యంలో మరిన్ని ఉత్పత్తులు తయారుచేసేందుకు సూత్రీకరణ తుదిదశకు చేరుకున్నది. తి.తి.దే ఈ ఆయుర్వేద ఉత్పత్తులను పెద్దఎత్తున తయారుచేసి ప్రజలకు అందుబాటులో తెచ్చేందుకు ఆయుర్వేద ఉత్పత్తులను తయారీలో ఎంతో అనుభవాన్ని సంపాదించిన తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన ఆశీర్వాద్ ఆయుర్వేదసంస్థ తన సాంకేతిక సహకారాన్ని అందించేందుకు ముందుకు వచ్చింది.

ఈ భూమిపై జీవి జన్మించింది మొదలు మరణించే దాకా కావలసిన ప్రతి వస్తువును అందించేది భూమి. అందుకే భూమిని భూమాతగా, భూదేవిగా మనం గౌరవిస్తాం. మన మందరం ప్రకృతిమాత ఒడిలోనే పుట్టి పెరిగి తిరిగి ప్రకృతి మాత ఒడిలోకే చేరుకుంటాము. అందుకే 'పృథివ్యాపస్తేజో వాయురాకాశాః' అనే పంచభూతాలలో భూదేవికి అగ్రస్థానం దక్కింది. మనం వసించేందుకు ఆవాసం కల్పించిన భూమాతను, పోషక పదార్థాలను ఇస్తున్న గోమాతను నిత్యం స్మరించుకునేలా తితిదే తన ఉత్పత్తులకు నామకరణం చేసింది.

## తి.తి.దే ఉత్పత్తులు - వివరాలు

**ధూప ఉత్పత్తులు-** తి.తి.దే. 'అవని' ధూప చూర్ణం, 'ధరణి' అగరుబత్తి, 'ధాత్రి' సాంబ్రాణి కప్పులు, 'వైష్ణవి' ధూప్‌స్టిక్స్, మరియు 'వారాహి' ధూప్ కోన్స్ అనే ఐదు విధాల ధూప ఉత్పత్తులను తయారుచేస్తున్నది. వీటిని గోమయంతోపాటు అగరు మొదలగు మూలికలతో తయారుచేశారు. ఈ ఉత్పత్తులను ఉపయోగించడం వల్ల సూక్ష్మక్రిములద్వారా కలిగే వాయు కాలుష్యాన్ని తగ్గించి పవిత్రభావాన్ని కల్పించవచ్చు.

**టూత్ పౌడరు (పళ్ళపొడి)-** ప్రాచీన ఆయుర్వేద వైద్యశాస్త్రంలో చెప్పినవిధంగా గోమయ భస్మం, సైంధవ లవణం, లవంగం, ఉసిరిక వంటి అమూల్యమైన మూలికలతో తయారుచేసిన ఈ పళ్ళపొడికి 'ధన్సిక' గా పేరు పెట్టారు. ఈ పళ్ళపొడిని వాడడం ద్వారా నోరు, పళ్ళు, చిగురులకు సంబంధించిన వ్యాధులు నివారణ మవుతాయి.

**ఫేస్‌ప్యాక్-** చర్మ సౌందర్యాన్ని పెంచి బంగారు వన్నెనిచ్చే పసుపు, మంజిష్ఠ, లొద్దుగవంటి మూలికలతో తయారుచేసిన ఈ ఫేస్ ప్యాక్ వాడటం ద్వారా మొటిమలు, నల్లమచ్చలు, కళ్ళక్రింద నల్లటి వలయాలు తగ్గించవచ్చు. ఈ ఫేస్ ప్యాక్‌కు 'హిరణ్మయి' ఫేస్‌ప్యాక్ అని పేరుపెట్టారు.

**హెర్బల్ సోప్-** చర్మకాంతిని పెంచి వివిధ చర్మవ్యాధులను నివారిస్తూ మొటిమలను తగ్గించి వ్యాధికారక క్రిములను నాశనం చేసేది ఈ సబ్బు. ప్రకృతి సిద్ధమైన ఈ సబ్బుకు 'మహి' హెర్బల్ సోప్ అని పేరు పెట్టారు. దీనిలో గోమూత్ర అర్క, నాల్పమారాది తైలం వంటి అమూల్యమైన ఔషధాలను ఉపయోగించారు.




**హెర్బల్ షాంపు-** గోమూత్రం, శీకాకాయ, కుంకుడుకాయ, కొబ్బరి నూనెల మిశ్రమంతో తయారు చేసిన ఈ షాంపూ శిరోజాల రక్షణకు ఎంతగానో ఉపకరిస్తుంది. దీనికి 'కశ్యపి' హెర్బల్ షాంపు అని పేరుపెట్టారు.

**నాజల్ డ్రాప్స్-** శరీరంలో రోగనిరోధక శక్తి తక్కువ అవడంవల్ల తరచుగా వచ్చే తలనొప్పి, జలుబు, డస్ట్ అలర్జిలను తగ్గించే నాజిల్ డ్రాప్స్ ఇది. దీనికి 'ఉర్వి' నాజిల్ డ్రాప్స్ అని పేరు పెట్టారు. గోమయం, గోక్షీరం, నువ్వులనూనె మిశ్రమాలతో తయారు చేసిన ఈ 'ఉర్వి' నాజిల్ డ్రాప్స్‌ను రోజు ఉదయం గోరు వెచ్చగా రెండు ముక్కు పుటలలో చుక్కలు వేసుకోవాలి. దీనిని వాడడం వల్ల కళ్ళుకు చెవులకు పటుత్వం లభిస్తుంది.







**గోఅర్క -** గోమూత్రాన్ని ప్రత్యేక ప్రక్రియతో వేడిచేసి దాని ద్వారా వచ్చిన ఆవిరిని చల్లబరచి ద్రవరూపంలోకి తెచ్చే ఉత్పతి ఈ గోమూత్ర అర్క. దీనికి 'నందిని' గో అర్క అని పేరుపెట్టారు. దీనిని ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్, శ్వాసకోశ వ్యాధులు కామెర్లు లాంటి వ్యాధుల నివారణలో విశిష్ట ఔషధంగా ఉపయోగిస్తారు.

**హెర్బల్ ఫ్లోర్ క్లీనర్-** గోమూత్ర అర్క ప్రధానంగా నిమ్మగడ్డి, ఫైన్ ఆయిల్‌తో ఈ ఫ్లోర్ క్లీనర్ తయారుచేస్తారు. ఇది నేలమీద మలినాలను శుభ్రపరచడమే కాక, క్రిమి సంహారకంగా కూడా పనిచేసే సువాసనా భరితమైనది ఈ హెర్బల్ ఫ్లోర్ క్లీనర్. దీనికి 'భూమి' హెర్బల్ ఫ్లోర్ క్లీనర్ అని పేరుపెట్టారు.




**పిడకలు, పొడువాటి పిడకలు-** దేశీయ గోవులనుండి సేకరించిన గోమయం, వరిపొట్టు, చెక్కపొట్టుల మిశ్రమంతో తయారు చేసిన వీటిని యజ్ఞ యాగాల నిర్వహణకు ఉపయోగిస్తారు. దహన క్రియలకు కూడా వీటిని ఉపయోగించడం శ్రేష్ఠంగా భావిస్తారు. వీటిలో గుండ్రటి పిడకలకు 'క్షమ' అని, పొడువాటి పిడకలకు 'భూపతి' అని పేర్లు పెట్టారు.




**విభూతి-** హైందవ సమాజంలో విభూతికి ఒక ప్రత్యేకస్థానం ఉన్నది. శివభక్తులందరు విభూతిని ధరిస్తారు. అంతేకాదు చిన్న పిల్లలకు ఏదైనా గాలిసోకినా ఊరికినే ఏడుస్తున్నా, హటం చేస్తున్నా దివ్యవిభూతిని ధరింప జేయడం మనకు ఆనవాయితీగా వస్తున్నది. అంతటి పవిత్రమైన విభూతిని దాని స్వచ్ఛమైన రూపంలో పొందడం అనేది ఒక సుదీర్ఘమైన ప్రక్రియ.




ఈ ప్రక్రియను తి.తి.దే అత్యంత పవిత్రంగా చేపడుతున్నది. పంచభూతాలకు ప్రతీకలైన ఐదుహోమగుండాలను ఇటుకలు, సిమెంటు, మట్టితో నిర్మించారు. హోమగుండంలో వరిపొట్టు, కర్పూరం, ఆవునెయ్యి, గరికలతోపాటు 100 కిలోల ఎండిపోయిన ఆవుపేడను కాల్చి 20 కిలోల భస్మానికి తగ్గిస్తారు. ఈ ప్రక్రియ స్వచ్ఛని తెల్లని కాంతిని కలిగేవరకు నిర్వహిస్తారు. ఇంతటి దివ్యమైన విభూతికి 'పృథ్వి' విభూతిగా నామకరణం చేశారు.

తి.తి.దేవస్థానములు గో ఆధారిత పంచగవ్య ఉత్పత్తులను ప్రాకృతికంగా తయారుచేసి తిరుమల, తిరుపతిలోని వివిధ ప్రాంతాలలోని తమ విక్రయశాలలో తక్కువ ధరలకు ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. ఈ విధంగా గోఆధారిత ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులోనికి తీసుకురావడం ద్వారా హైందవ మతవిశ్వాసాలకు ప్రతీకయైన గోసంపదను సంరక్షించేందుకు ప్రోత్సహించడంతోపాటు ప్రాచీన ఆయుర్వేద పద్ధతులను కూడా పునరుద్ధరిస్తున్నది అనడంలో సందేహం లేదు.

# 108 దివ్యదేశాలు

# అన్బిల్ (బాణాపురం)

- ఆచార్య చక్రవర్తి రంగనాథన్

భగవంతుడు పర- వ్యూహ- విభవ- అంతర్యామి- అర్చా అను ఐదురూపాలతో దివ్యక్షేత్రములయందు విరాజిల్లుతూ విశేషంగా అర్చామూర్తిగా సకలజనులను అనుగ్రహిస్తున్నాడు. ఆళ్వారులచేత కొనియాడబడిన దివ్యక్షేత్రాల్లో ఒకటిగా దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న క్షేత్రం శ్రీరంగ పరిసరంలో ఉన్న అన్బిల్ అను దివ్యదేశం.

## అన్బిల్ దివ్యక్షేత్ర పరిచయం

పూర్వం ఒక ముని నిర్విఘ్నంగా తపస్సును కొనసాగించటానికి యోగవిద్యద్వారా జలస్తంభంనందు నిష్ఠాతుడై, నీటియందు బహుకాలపర్యంతం తపస్సును చేయసాగాడు. ఇతని కీర్తిని విన్న దుర్వాసమహర్షి తనను చూడ్డానికి ఆ ముని తపస్సు చేస్తున్న తటాకంవద్దకు వచ్చి తాను బయటకు వచ్చేంతవరకు నిరీక్షితుడై ఉన్నాడు. ఎంతకీ ఆ ముని తపస్సునుండి బయటకు రానందున నిత్యకోపియైన ఆ దుర్వాసుడు ఆగ్రహించి తనపట్ల ఆ ముని ప్రదర్శించిన అగౌరవాన్ని సహింపక మండూకోభవ అంటే నీవు జలంనందే ఉండటానికి ఇష్టపడుతున్నందున ఈ జలంనందే కప్పగా ఉండు అని శపించాడు.

వెంటనే ఆ ముని జలసమాధినుండి బయటకు వచ్చి దుర్వాసమహర్షిని ప్రార్థించి, క్షమించమని కోరాడు. అందుకు దుర్వాసమహర్షి ఈవిధంగా వివరించాడు-శ్రీరంగంసమీపంలో ఉన్న దివ్యక్షేత్రాల్లో ఒకటైన అన్బిల్ అనే దివ్యక్షేత్రముంది, అక్కడ దివ్యమూర్తిగా విరాజిల్లుతున్న తిరువడివళగియనంబి అను పెరుమాళ్‌ను సేవించి అచట పుష్కరణియందు తపస్సును ఆచరిస్తే నీకు శాపవిమోచనం కలుగుతుంది అని శాపాంతమును అనుగ్రహించి అచటనుండి వెనుదిరిగాడు.

తదనంతరం ఆ ముని దుర్వాసుని సూచనానుసారం అన్బిల్‌క్షేత్రానికి వెళ్లి అచట తిరువడివళగియనంబిపెరుమాళ్‌ను సేవించి, అక్కడ ఉన్న పుష్కరణియందు తపస్సును చేయనారంభించాడు. పరమాత్మ ప్రత్యక్షమై ఆ మునికి మోక్షాన్ని అనుగ్రహించాడు. ఆనాటినుండి ఆ ముని మండూకమునిగా, ఆతను తపస్సు ఆచరించిన ఆ తీర్థం మండూకతీర్థంగా ప్రసిద్ధి గాంచింది. తిరువడివళగియనంబి అనగా సుందరమైన ఆకృతి గలవాడు అని అర్థం. మండూకమునియొక్క శరీర వికారమును తొలగించి సుందరస్వరూపమును అనుగ్రహించినందున ఈ తిరువడివళగియనంబి అను నామం సార్థకనామధేయంగా ప్రసిద్ధి గాంచింది.

## తిరుఅన్బిల్

అన్బిల్ నామ్ని పురే ప్లవాఖ్య సరసీ సంశోభితే తారకే
శ్రీమూర్త్యుజ్జ్వల పూర్ణ నామక విభుర్భోగీంద్ర భోగేశయః
ఆలింగన్ రుచిరోపపూర్వలతికా దేవీం సురేశాముఖో
వాల్మీకి ద్రుహిణప్రియో విజయతే శ్రీభక్తి సారస్తుతః

ఈ దివ్యక్షేత్రంనందు లక్ష్మీనారాయణులు తిరువడివళగియనంబిపెరుమాళ్- అళగియవల్లితాయార్ అను పేర్లతో విరాజిల్లుతున్నారు. ఇచట మండూకపుష్కరిణి- తారక







విమానం– తూర్పుముఖం– భుజంగశయనం గోచరిస్తాయి. ఈ క్షేత్రం వాల్మీకిమహర్షికి, బ్రహ్మకు ప్రత్యక్షమైనట్టు ప్రతీతి.

## విశేషం

ఈ క్షేత్రం తిరుచ్చి– కల్లణై– కుంభకోణం బస్ మార్గంలో ఉంది. తిరుచ్చినుండి బస్‌సౌకర్యం మితంగా ఉంది. కావున నటరాజపురం బస్సులో పోయి అక్కడనుండి 1కి. మీ నడచి సన్నిధిని చేరటం సులభం. ఇక్కడ ఏవిధమైన వసతులు ఉండవు. శ్రీరంగంనుండి వెళ్లి సేవించాలి. శ్రీరంగమునకు 20 కి.మీ 3.కి.మీలో తిరుప్పేర్‌నగర్ ఉంది.

తిరుమళిశైఆళ్వార్ ఈ క్షేత్రమును ఈ విధంగా కీర్తించి ఉన్నారు.

నాగత్తణైక్కుడన్దై వెఃకాత్తిరువెవ్వుళ్
నాగత్తణై యరజ్గమ్ పేరన్బిల్– నాగత్
త్తణై ప్పాఱ్కడల్ కిడక్కుమ్ ఆది నెడుమాల్
అణై ప్పార్ కరుత్త నావాన్.

అన్బ్ అంటే ప్రేమ అని ఇల్ అనగా ఆలయం అని అర్థం. కాబట్టి అన్బిల్ అనగా ప్రేమాలయం అని అర్థం.

ఈ క్షేత్రమున స్వామి క్షీరసాగరమున శయనించినట్టు శయన స్వరూపంలో వెలసి ఉన్నాడు. దీనికి కారణమేమంటే పూర్వం భృగుమహర్షి విష్ణువునందు చేసిన అపరాధమునకు ప్రాయశ్చిత్తంగా ఈ క్షేత్రంనందు తపస్సు ఆచరించగా, స్వామివారు అనుగ్రహించి శేషశాయిగా ఇలా ఇక్కడ వెలసి ఉన్నారు. ఈ ఆలయంలో ప్రవేశించినవెంటనే ఆండాళ్‌సన్నిధి దర్శనమిస్తుంది. ఇచట ఆండాళ్ ఆసీనస్వరూపంగా గోచరిస్తుంది, వివాహంకాని కన్యలు ఇచట ఆండాళ్‌ను సేవించిన సకాలంలో వివాహం జరుగుతుంది అని ఇక్కడి భక్తుల విశ్వాసం. గర్భాలయ మండపంలో లక్ష్మీనరసింహుడు, వేణుగోపాలస్వామి, అలాగే హనుమంతునిసన్నిధి ఉన్నాయి. గర్భాలయంలో స్వామివారు శయనరూపుడై ప్రకాశిస్తున్నాడు. ఇచట విశేషమేమంటే స్వామివారు పవళించిన ఆదిశేషుడు భక్తానుగ్రహకారకుడిగా అనగా కొద్దిగా వక్రాకృతిన భక్తులను చూస్తున్నట్టుగా దర్శనమిస్తాడు.

న హి దేవ తోషణం వృథా– అనగా భగవంతుడికి చేసే సేవ ఎన్నడూ వృథా కాదు. కాబట్టి భక్తులు శ్రద్ధాభక్తులతో ఆ దేవదేవుణ్ణి సేవించి తరించగలరు.



ధారావాహిక

# శ్రీమద్భగవద్గీత

– ఆచార్య కుప్పా విశ్వనాథశర్మ

*గతసంచిక తరువాయిభాగం...*

పరమాత్మ మనకు దేహం వేరు ఆత్మవేరు అనే విషయాన్ని అనేక కోణాలనుండి ఆ విషయాన్ని మనకు వివరిస్తున్నాడు. సత్తు, అసత్తు అనే రెండురకాలుగా పదార్థాలను విభజించి సత్తు అంటే మూడుకాలాల్లోనూ ఉండే పదార్థం. అది ఆత్మే తప్ప మరొకటి కాదు. శరీరం మిగతా వస్తువులన్నీ కూడ ఒకకాలంలో వచ్చి మరొక కాలంలో పోతాయి. కాబట్టి ఇవి సత్తులు కావు అసత్తులు అవుతాయి అని సదసద్వివేకాన్ని కూడ మనకు కొద్దిగా పరమాత్మ ఉపదేశం చేశాడు. నిత్యమైనటువంటి స్వరూపమే ఆత్మ అని అలాగే దేహాదుల్ని కూడ అనిత్యములు అనే విషయాన్ని కూడ చెప్పాడు. తరువాత ఈ శ్లోకంలో తాను చెప్తూ వస్తున్నటువంటి విషయానికి చిన్నఉప సంహారం కూడ మరొకసారి చేస్తున్నాడు.

**“వేదావినాశనం నిత్యం య ఏనమనుజ మవ్యయమ్**
**కథం స పురుషః పార్థ కంఘాతయతి హంతి కమ్” ॥2-21॥**

అని పార్థా! విశాలంగా ఆలోచించే అర్జునా! ఎవరైతే ఈ ఆత్మస్వరూపాన్ని అవినాశిగా అంటే వినాశం లేనిదిగా తెలుసుకుంటారో, నిత్యంగా ఎవరైతే తెలుసుకుంటారో ‘వేద అవినాశినం నిత్యం య ఏనం అజమవ్యయం అజమ్’ అంటే పుట్టుక లేనిదానిగా ఎవరైతే తెలుసుకుంటారో ‘అవ్యయం’ ఏరకమైనటువంటి వ్యయం, వినాశం లేనిదిగా ఎవరైతే తెలుసుకుంటారో అటువంటి పురుషుడు కథం సపురుషః పార్థాకం ఘాతయతి హంతికం’ ఆత్మస్వరూపం నిత్యమైనది. ఏకరమైన వికారములు లేనిది. ఏరకమైన క్రియలు లేనిది అని తెలుసుకున్న తరువాత ఆ జ్ఞాని ఎవరిని సంహరిస్తాడు? ఏరకమైన క్రియను ప్రేరేపించగలడు? ‘కథం సపురుషః పార్థకమ్ ఘాతయతి హంతికం’ ఎవరిని చంపటంలో లేదా సంహరించటంలో ప్రేరేపించగలడు? అంటే ఆత్మస్వరూపానికి ఏవిధమైన క్రియాలేదు అని తెలుసుకున్న తరువాత నాలో ఆత్మస్వరూపమంటే నేనే కదా! నాలో ఏ క్రియాలేదని తెలిసిన తరువాత ఈ క్రియను నేను చేస్తున్నాను అనే మాట ఎవరూ మాట్లాడటానికి వీలులేదు. ఎవరూ అట్లా మాట్లాడలేరు ‘కథం’ ఏరకంగా మాట్లాడుతారు? స్వరూపం తెలిసిన తరువాత మాట్లాడలేరు. మాటలన్నీ స్వరూపం తెలిసేంత వరకు లేదా స్వరూపం సరిగ్గా తెలియనంతవరకు నిజమైన మాట స్వరూపం తెలిసిన తరువాత వస్తుంది. అప్పుడు ఈ మాట రాదు అని మరొకసారి చెప్తున్నాడు.

‘వేద అవినాశినం నిత్యం యఏనమజమవ్యయం’ .... అని ఈ శ్లోకం విన్నతరువాత చాలారోజులుగా మిగిలిపోయిన సందేహం మళ్ళీ వస్తుంది. ఇదే విషయాన్ని అవినాశితు తద్విద్ధి.... అని ‘నజాయతే మ్రియతే వా’... అని ఇలా ఆత్మస్వరూపానికి వినాశం లేదు, ఆత్మస్వరూపం నిత్యమైనది అని ఒకసారి చెప్తే సరిపోతుంది కదా! మళ్ళీ మళ్ళీ చెప్పటంలో పరమాత్మయొక్క అభిప్రాయం ఏమిటి? ‘పునరుక్తి’ అనేది తెలివైనవారికి అది దోషం కదా! ఒకేవిషయాన్ని మళ్ళీ మళ్ళీ చెప్పటం అనేది తెలివితక్కువవాళ్ళు చెప్పవచ్చు. ఒకేమాట ఒక్కసారి చెప్పాలి అన్నట్లు ఉండాలికదా! పరమాత్మ ఎందుకు ఇదే విషయాన్ని చెప్తున్నాడు? అని ఈ ప్రశ్నవస్తే తెలివైనవారు ఒకేమాట ఒకేసారి చెప్తారు అని అనుకోవడమే తప్పు. తెలివైనవారే చెప్పవలసిన విషయాన్ని పదిసార్లు చెప్తారు. తెలివి తక్కువవారే ఒక్కసారి చెప్పి ఊరుకోవలసి వస్తుంది. ఎలా అని ఆలోచిద్దాం. ఏ విషయమైనా ఏరకమైన సంగతైనా చెప్పిన వెంటనే అర్థమైపోతుంది అనే నియమం ఈ ప్రపంచంలో ఎవరూ చెప్పలేరు. అసలు శబ్దమే మనకు చెప్పిన వెంటనే మనకు ఆ విషయంలో పరిపూర్ణమైన జ్ఞానం కలిగింది అని ఎవ్వరూ అనుకోవటానికి వీలులేదు. ఆ విషయంలో పరిపూర్ణమైన జ్ఞానం కలిగిందీ లేనిదీ కాస్త తెలివైనవాడు, జ్ఞాని అయితే చెప్పేవాడికే తెలుస్తుంది వినేవాడి కంటే ఎక్కువగా.

సంగీతం పాడే వ్యక్తి పాట ఒక్కటి పాడి వెళ్ళిపోడు. ఆలాపన అయిన తరువాత కీర్తన, తరువాత కొంత సంగతులు ఇన్ని ఎందుకని అంటే ఆ రాగం ఒక్కసారి వినంగానే మనస్సులోకి స్థిరంగా రాదు. అది మనస్సులో స్థిరపడాలి అంటే ఆ రాగం ఆలాపనరూపంలో, కీర్తనరూపంలో, సంగతులరూపంలో మరొక సారి వివిధరూపాలలో విన్నప్పుడు ఆ రాగం స్థిరపడుతుంది. మహా విద్వాంసుల మనస్సులో రాగం స్థిరపడాలంటే కనీసం గంటన్నర పడుతుంది. ‘రాగస్థైర్యం’ అంటారు. ఆ రాగస్థైర్యం ప్రారంభం కావటానికి వాళ్ళకి గంటన్నర పడితే మనలాంటి సామాన్యశ్రోతల సంగతి చెప్పకోనక్కరలేదు. అందువల్ల వాళ్ళు రకరకాలుగా ఆ రాగాన్ని మన మనస్సుల్లో స్థిరపడేందుకు వివిధరూపాలలో వాడుతూ ఉంటారు ఆ విషయం మనం అర్థం చేసుకుంటే అది మనకు కూడా స్థిరపడుతుంది. సంగీతం చిన్నవిషయంకాదు. అది ‘గాంధర్వశాస్త్రం’. అది ‘దేవవిద్య’. అటువంటి విద్యకు కూడ ఇదే నియమం.

*(ఇంకా ఉంది)*



# అన్నం పరబ్రహ్మ స్వరూపం

- శ్రీ భారత్‌జ్యోతి ఆచార్య డా॥ యోగశ్రీ,
98486 18095

ఈ భూమినుండియే లతలు, సమస్తసస్యములు పుడుతున్నాయి. ఇవియే స్వరూపంగా గల ఓషధములు పుట్టాయి. ఆ ఓషధులవలన అన్నము పుట్టింది. ఇది రేతోరూపంగా పరిణమించి ఆ అన్నం వల్ల అనేక అవయవాలతో కూడిన ఆకృతి గల పురుషుడు పుట్టాడు. ఆ పురుషుడే అన్నరసస్వరూపుడు. అనేక అవయవ ములవలన పురుషాకృతిస్వరూపుడై తేజస్సంభూతమగు రేతస్సువలన పుట్టాడు. రేతస్సువలన పుట్టిన అన్నరసరూపమైన ఆ పురుషునకు అనేక అవయవములతో ప్రసిద్ధముగా ఉన్నది శిరస్సు. ఈ దేహంయొక్క మధ్యభాగం ఆత్మ. నాభి క్రింది భాగమే పాదాధికము. ఈ దేహమును నిలుపుటకు ఆధారం. ఈ ప్రకారం మూసయందు కరిగి పోయబడిన రాగివిగ్రహం వలె ఈ శరీరం ఏర్పడింది. 'అన్నము' అను పేరు ఎందులకు వచ్చింది? ఆ పేరు రావడానికి గల కారణమేమిటి? అన్నంవల్లే సమస్తభూతములు రక్షింపబడుతున్నాయి. ప్రాణులన్నియు అన్నమునే భక్షిస్తున్నాయి. కావున ఇది అన్నము అని చెప్పబడింది.

పంచకోశములలో అన్నమయకోశం, ప్రాణమయకోశం కూడ ఉన్నాయి. అంతరాత్మ అన్నమయాత్మకంటే వేరుగా ఉంది. అంతరమైన ఆత్మస్వరూపమైన ప్రాణమయం ఈ అన్నమయంచే నింపబడి ఉన్నది. ఈ ప్రాణమయం అన్నరసవికారమైన కర చరణాద్యాకృతి గల పురుషరూపమే. ఈ పురుషాకారం, ప్రాణ మయమునకు ఆ అన్నమయముయొక్క పురుషాకృతి ననుస రించియే కలుగుతుంది. ఈ ప్రాణమయమునకు పురుషాకృతి ఉన్నది. ఎట్లనిన, 1)ప్రాణమయమునకు ముఖనాసికముల ద్వారా బయలువెడలెడి వాయు భేదమగు ప్రాణవృత్తియే శిరస్సు 2)వ్యానవాయువృత్తి దక్షిణపార్శ్వము 3)అపానవృత్తి ఉత్తర పక్షము 4)సమానమగుపేరుగల వాయువృత్తి అన్నింటికంటే మధ్యమున ఉండటంవల్ల ఆత్మస్వరూపమైంది. 5)ఈ సర్వమునకు స్థితిహేతువైనభూమి ప్రాణాత్మకు పుచ్ఛాకృతిగా ఉన్నది. ఈ ప్రకారం పురుషాకృతియగు అన్నమయంనందు నిండియుం డెడి ప్రాణమయమునకు, అన్నమయమునకువలనే శిరస్సు, ప్రాణద్యాకృతిమత్వం ఉంది. అన్నమువలననే సమస్తప్రజలు పుడుతున్నారు. ఈ భూమిని ఆశ్రయించి ఉండెడి జీవరాశులు అన్నముచేతనే జీవధారణం చేస్తున్నాయి. జీవితకాలాంతరమందు తిరిగి అన్నియు అన్నమునే పొందుతున్నాయి. ఈ ప్రకారం సమస్తజీవరాశులయొక్క జన్మస్థితిలయములకు కారణమవటం వలన సమస్తభూలోకములకు కారణమై ఉన్నది. సర్వమునకు ఈ పదార్థం ఔషధంగా ఉంది.

ఈ ప్రకారం సర్వకారణమైన అన్నమును పరబ్రహ్మ స్వరూపంగా ఉపాసించెడివాడు సమస్తస్వరూపమైన అన్నమును పొందుతాడు. ఈరీతిగా ఔషధరూపమైన అన్నము సర్వమునకు కారణమై అన్నింటికంటే ముందుగా పుట్టింది. శరీరమునకు అన్నమువలన ప్రధాన ప్రయోజనములు: 1)అన్నమువలననే సమస్తప్రాణులు పుడుతున్నాయి. 2)పుట్టిన ప్రాణులన్నియు ప్రాణమువల్లే వృద్ధి పొందుతున్నాయి 3)జీవితకాలం అంతమున తిరిగి ఈ జీవులన్ని తిరిగి అన్నమునే పొందుతున్నాయి.

అన్నమును నిందించకూడదు. ఇది బ్రహ్మవేత్తకు ముఖ్య వ్రతంగా ఉపదేశించబడింది.

ప్రాణం ప్రధానమైంది. ప్రాణంనుండియే సర్వప్రాణులు పుడుతున్నాయి. ఆ పుట్టిన సర్వభూతాలు ప్రాణంచేతనే జీవి స్తున్నాయి. మరణానంతరం ప్రాణమును తీసుకొనిపోయి సర్వత్ర ప్రాణస్వరూపమై ప్రవేశిస్తున్నాయి. కావున ప్రాణమును చిత్త స్వరూపంగా తెలుసుకోవాలి. ఇది బ్రహ్మలక్షణం.

అన్నము గొప్పదా? ప్రాణము గొప్పదా? ఇప్పుడు పరిశీలిద్దాం. అగ్ని, దేవతలు, ఇంద్రియములు, మనుషులు, పశువులు మొదలైనవి ప్రాణమునునసరించియే ప్రాణవ్యాపా రమును చేస్తున్నాయి. ప్రాణము వాయురూపము, చలనము

గలది కావున జీవులు కేవలం అన్నమయముచేతనే ఆత్మ స్వరూపం గలవారౌతారు. మానవశరీరములయందు ప్రాణము అంతటా వ్యాపించి ఉన్నది. కావున ప్రాణముచేతనే మనము ఆత్మస్వరూపులవుతున్నాముగాని కేవలం అన్నమువలన కాదు. అన్నముచేత మనుషులు ఆత్మస్వరూపులు గలవారుగా మారటం లేదు. సర్వాత్మచేతనే మనుషులు, ప్రాణులు, పశువులు, దేవతలు ఆత్మస్వరూపులౌతున్నారు.

అందరికి పరమార్థం ఆత్మ. ఎంతవరకు ఈ దేహం నందు ప్రాణము ఉంటుందో అంతవరకే జీవముంటుంది కావున ప్రాణమే జీవంగా చెప్పాలి. కావున ప్రాణమునే బ్రహ్మ స్వరూపంగా ఉపాసించాలి. అట్టివారు 100 సంవత్సరాల ఆయు ర్ధాయమును పొందగలరు. అంతేకాక అపమృత్యువుచేత మరణము పొందరు. అనగా ఆయుర్ధాయమునకు పూర్వమే మరణించరు. కావున అందరికి ప్రాణమే ఆయుష్షుగా చెప్ప బడింది. ప్రాణము ఆత్మస్వరూపం. మనోమయాత్మచే ఈ ప్రాణ మయము నిండి ఉన్నది.


'కావున ఈ ప్రాణమయంయొక్క పురుషాకృతినను సరించియే ఈ మనోమయం పురుషాకృతి పొందింది. మనో మయాత్మయే ప్రాణమయమునకు ఆత్మ స్వరూపంగా ఉన్నది. శరీరానికి ప్రాణం గొప్పదా? అన్నం గొప్పదా? దేనివలన జీవము నిలచి ఉన్నది? ఈ రెండును ఒకదానియందొకటి, ఒకదాని ఆధారంగా మరొకటి ఉన్నాయి.



అన్నము, ప్రాణము ఈ రెండును ఒకదానియందొకటి ఉండటం వల్ల 'అన్నస్వరూపము' గాను, ఒకదానికొకటి ఆధారంగా ఉండటంవలన 'అన్నాదమగు' ప్రాణస్వరూపంగా ఉన్నాయి. ఈ ప్రకారం శరీరప్రాణములను రెండింటిని 'అన్నా న్నాదములు'గా తెలుసుకోవాలి. అన్నాదమ్‌– అన్నము తినునది. ప్రాణము అన్నమైనపుడు శరీరము అన్నాదమౌతుంది. శరీరము అన్నమైనపుడు ప్రాణము అన్నాదమౌతుంది. ఈ విధంగా తెలుసుకొనినవాడికి పుత్రాది సంతానసమృద్ధి కలుగుతుంది. పశుసంపదచేతను, బ్రహ్మతేజస్సుచేతను, లోకమునందు ఖ్యాతి చేతను మిక్కిలి శ్రేష్ఠుడౌతాడు. పృథివి అన్నం. ఆకాశం ప్రాణం. ఈ రెండును అన్నాదములుగా తెలుసుకోవాలి. అన్నమును భుజించువారికి మరికొన్నివ్రతములు బ్రహ్మవేత్తలు పాటించాలి. 1)నివాసముకొరకు తనఇంటికి వచ్చినవారిని నిరాకరించక, చోటును కల్పించాలి 2)అన్నార్థియై తన ఇంటికి వచ్చినవానికి అన్నము సిద్ధంగా ఉన్నదని చెప్పాలి. 3)మనుషుడు ఏ ప్రకారంగానైనను అన్నమును సంపాదించుకోవాలి. 4)పూజ పూర్వకంగా తాను ఇచ్చే ఈ అన్నము ఆప్రకారమే తిరిగి ప్రథమవయస్సునందును. 5)మధ్యమవయస్సునందును మధ్య మోపచారంతో తాను ఇచ్చే ఈ అన్నము ఆప్రకారమే తిరిగి మధ్యమవయస్సునందును 6)అంత్యవయస్సునందును నీచో పచారంతో తాను ఇచ్చే ఈ అన్నము ఆప్రకారంగానే తిరిగి అంత్యవయస్సునందు తాను పొందుతున్నాడు. 7)ఇటువంటి అన్నమును ఎవడు అన్నార్తులకు ఇస్తున్నాడో, వానిని పరమాత్మ రక్షిస్తాడు. 8)ఇతరులకు ఇవ్వక తానే భక్షించినట్లైతే వానిని పరమాత్మ భక్షిస్తాడు.

సమస్తప్రాణులచే భక్షింపబడునది ఒక్కటిగా ఉన్నది ఈ అన్నము. దీనిని జీవులయొక్క సముదాయమునకు పర మాత్మ సృజించాడు. అట్టి అన్నము ధర్మాధర్మములలో మిశ్రమమై ఉన్నది. ఒకధర్మము దేహధారణ, రెండవ ధర్మము భగవదా రాధన. అన్నమును కేవలం తన దేహ ధారణకు మాత్రమే ఉపయోగించరాదు. భగవదారాధనకు కూడ ఉపయోగించాలి. కేవలం దేహధారణకు ఉపయోగించువారు పాపములను పొందుతారు.

కావున పరమాత్మయే దేవతలకు హుత, ప్రహుతము లను, హోమబలిహరణరూపములైన అన్నములను రెండింటిని సృష్టించాడు. అందువలన దేవతలను గురించి హుమములను, బలిహరణములను చేస్తున్నారు.




# నేటి యువతలో.. ఆధ్యాత్మికభావం

- శ్రీ ఎల్.ప్రఫుల్లచంద్ర, 88865 74370

మన భారతీయ ధార్మిక జగతిలో యువతకు ప్రాముఖ్యత ఉన్నది. యువత అంటే యువతీయువకులు. నేటి యువత పెడత్రోవ పడుతోందని కొందరు పెద్దలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆధునిక ఫ్యాషన్‌ప్రపంచంలో నాగరికత మరచిపోయి తమ ధర్మాన్ని మరచిపోతున్నారు. మంచి అలవాట్లు మనిషి మనుగడను కాపాడతాయి. అటువంటప్పుడు మనిషి యువతప్రాయంలోనే చెడు అలవాట్లకు బానిసై పతనావస్థకు దిగజారడం సబబు కాదు. కనుక పెద్దలమాట బంగారు బాటగా భావించాలి.

యువతకు ధ్యానం, ఆధ్యాత్మికతాభావం ఎంతో అవసరం. ధ్యానంవలన యువతలో మానసికప్రశాంతత, ఆధ్యాత్మికభావంతో భక్తిజ్ఞానం అలవడుతుంది. చిన్నతనంనుండే హరిభక్తుడు ప్రహ్లాదుడు హరినామస్మరణతో లోకానికి ఆదర్శ ప్రాయుడైనాడు. హరిభక్తి అంతటి మోక్షం కలిగించింది. చిరు ప్రాయంలోనే ధ్రువుడు అచంచలమైన తపస్సుతో సాక్షాత్తు శ్రీమహావిష్ణువునే సాక్షాత్క రింపజేసుకుని ప్రపంచానికే ధృవతారగా నిలిచాడు.

యువత తమ కర్తవ్యం విస్మరించరాదు. క్రమశిక్షణతో తమ లక్ష్యాన్ని సాధించాలి. సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, సమధర్మం, పెద్దలయెడ గౌరవభావం అలవర్చుకోవాలి. సాటివారి పట్ల సానుభూతిని చూపాలి. పరోపకారార్థ మిదం శరీరం అన్న నానుడిని అనుసరించి శాశ్వతం కాని ఈ దేహంపై మోహం పెంచుకోక నిస్వార్థ పరతతో జీవించగలగాలి. విశాల విశ్వంలో కంటికి కని పించని పరబ్రహ్మ, పరమాత్మ స్వరూపం సృష్టికి మూల కారణమని గ్రహించాలి.

యువత ఆధ్యాత్మికభావంపట్ల అవగాహన పెంపొం దించుకోవాలి. ఆధ్యాత్మికభావంవల్ల యువతలో మానసిక ఉల్లాసం, ఆధ్యాత్మికజ్ఞానం సంపూర్ణంగా లభిస్తుంది. భగవంతుని సృష్టి ఎంతో అద్భుతమైనదని గ్రహించాలి. యుగాలు మారినా యువత ధోరణి ఒక్కటే కావాలి. అదే మంచిమార్గంలో పయనించడం కర్తవ్యంగా భావించాలి.

యువతకు పలు ఆధ్యాత్మిక సూచనలు, ఆదర్శ సూత్రాలు అందించిన వివేకానందుడు, రామకృష్ణపరమహంస యువతకు మార్గదర్శకులు. యువతలో ఆధ్యాత్మికత ఉట్టిపడే భక్తిభావంవలన మనసు నిర్మలమవుతుంది. భక్తి, జ్ఞాన, ధ్యాన, యోగంవలన యువతలో ఉత్తేజం కలుగుతుంది. యువతరం నేడు తమ జీవితసత్యాన్ని గ్రహించాలి. భగవత్ ఆరాధనద్వారా తమ ఉనికిని గ్రహించవచ్చు. ఆధ్యాత్మికమార్గంద్వారా సృష్టిధర్మా లను తెలుసుకోవచ్చు.

యువతకు శీలం సద్గుణం ఉత్తమసుగుణాలు ఔతాయి. 'శీలేన శోభతే విద్యా' అని ఒక సూక్తి ఉంది. శీలంవల్ల విద్య శోభిల్లుతుంది. విద్యవలన సకలసుగుణాలు అలవడతాయి.

**విద్య ఒసగును వినయంబు దాని వలన బడయు పాత్రత**
**పాత్రత వలన ధనము, దాని వలన ధర్మంబు**
**దానివలన ఐహికాముష్మిక సుఖములందు నరుడు**

అన్నారు పెద్దలు. మనిషికి అందునా యువతకు విద్య అనేది ఇహపరమైన సాధన. అటువంటి విద్యకూడా శీలం వల్లనే శోభిస్తుంది. సచ్ఛీలం లేని విద్యావంతుడు విద్యావంతుడే కాదు. అతడు కేవలం అక్షరాస్యుడు మాత్రమేనని గ్రహించాలి. మానవునిలో ఉత్తమసంస్కారానికి శీలమే మూలం అని తెలుసుకోవాలి.

కష్టాలు ఉంటే కృంగిపోరాదు. సుఖాలు కలిగితే పొంగిపోరాదు. అన్నింటా సమధర్మం పాటించేవారే ఉత్తమ సుగుణాలు కలవారు. యువతలో ఆధ్యాత్మికతాభావం పెంపొందించిననాడు వారు జ్ఞానులు ఔతారు.

భక్తిమార్గంద్వారా భగవంతుణ్ణి ప్రసన్నం చేసుకోవచ్చు. భగవంతుని ఆశీస్సులు ఉంటే జీవితమంతా ప్రశాంతంగా, ఆనందంగా కొనసాగుతుంది. సత్యధర్మసాధన యోగాభ్యాసం ద్వారా ఇవన్నీ మనకు సిద్ధిస్తాయి. వేషధారణలో కూడా శాస్త్రీయత పాటించాలి. యువత ఆధునికీకరణ ధోరణి గాకుండా ప్రాచీన సంప్రదాయాల్ని పాటిస్తే బావుంటుంది. తిరుమలలో పాటించే వస్త్రధారణవిధానంలా స్త్రీలు, చీరలు, సల్వార్‌కమీజ్, పురుషులు ధోవతి, పైజామావంటి సంప్రదాయక దుస్తులు నేటి యువతకు శ్రేష్ఠమైనవి.

నేటి యువతలో ఆధ్యాత్మికభావంవలన సమాజ చైతన్యం వికసిస్తుంది. నైతికవిలువలు దిగజారిపోకుండా కాపాడవచ్చు. యువత మంచిని వినాలి. మంచిమాటలు మాట్లాడాలి. మంచిని తలపెట్టాలి. మంచివారితో స్నేహం చేయాలి. దైవంపట్ల భక్తిభావం పెంపొందించుకోవడంద్వారానే ఇవి సాధ్యమవుతాయి.

సత్యం శీలసంపద, ధర్మం న్యాయమార్గం, అహింసా పరమధర్మం విశ్వశాంతికి ప్రతీకలు. పరమాత్మచింతనలో ఆనందం అనుభూతిని గ్రహించాలి. అందుకు తగ్గ నియమాలు పాటించడంద్వారా యువతలో ఆధ్యాత్మికానుభూతి ప్రకాశిస్తుంది. భారతీయసంస్కృతికి పట్టుకొమ్మలు రామాయణం, భాగవతం, మహాభారతం, భగవద్గీత. ఇలాంటి ఇతిహాసాలు, పురాణాలు యువత పఠించాలి పరమపదసోపానం గ్రహించాలి. అప్పుడే జగతికి మహోదయం. యువతకు శుభోదయం ఔతుంది.

## పెరియాళ్వారు

'మిథునే స్వాతిజం విష్ణోః రథాంశం ధన్వినః పురే
ప్రపద్యే శ్వశురం విష్ణోః విష్ణుచిత్తమ్ పురశ్శిఖమ్'

**పెరియాళ్వారు క్రోధననామసంవత్సరం, మిథునమాసం, స్వాతినక్షత్రం, శుక్లపక్షఏకాదశీ ఆదివారం ధన్విపురంలో స్వామిరథం అంశలో జన్మించారు. వీరికి విష్ణుచిత్తయోగి, భట్టనాథ ముని, స్వాతియోగి, కనకశుల్కముని, పరతత్త్వ స్థాపకయోగి, ధన్విపురయోగి అనే బిరుదులున్నాయి. వీరు రచించిన పన్నెండుపాశురాలున్న 'తిరుప్పల్లాండు', 473 పాశురాలున్న 'పెరియాళ్వారుతిరుమొళి' గ్రంథాలు ప్రసిద్ధిపొందాయి.**



**12పాశురాలున్న తిరుప్పల్లాండును స్వామినే చూస్తూ స్వామికే మంగళంపాడిన పాటలుగా ప్రసిద్ధిపొందాయి.**

**ఆవిధంగా విష్ణుచిత్తుడు రచించిన పల్లాండులోని పన్నెండుపద్యాలు ద్రావిడవేదమనే 'నాలాయిరదివ్యప్రబంధం'లో మొదటి వెయ్యి పద్యాల్లో మొదటిపద్యాలుగా నిర్ణయింపబడ్డాయి. ఆయన 'పల్లాండు' పద్యాలు వేదానికి 'ఓం' అనే 'ప్రణవం' వంటివనియూ, 'మంగళ' కరమైనవనియూ కొనియాడబడుతున్నాయి. ఆ పన్నెండుపల్లాండుపద్యాల్లో మహావిష్ణువును విష్ణుచిత్తుడు ఎంతో భక్తితత్పరతతో మంగళాశాసనం గావించాడు.**

# గౌరవం

- ఆంధ్రరత్న ఆచార్య జి.వి.శేషారెడ్డి, 94404 24322

గౌరవాన్ని కలిగించే సాధనలు ఐదుగా విభజింపబడ్డాయని, అవి పంచరూపాల్లో దర్శనమిస్తాయని పెద్దలు సెలవిస్తుంటారు.

గౌరవాన్ని ఆపాదించే పంచభూషణాల్లో మొదటి ఆభరణం వస్త్రం. చూడగానే ఓ సద్భావన కలుగజేసేది వస్త్రధారణయే. ఆదరణనుగానీ, తృణీకారభావాన్నిగానీ, ఏహ్య నిరసన ప్రతిరూపాల ఆవిష్కరణకు వస్త్రధారణే కారణమౌతుంది. సముచితమైన బాహ్యఅలంకారాన్ని ఆహార్యమని పిలుస్తారు.

రెండవఆభరణం ఉషస్సు. అంటే శరీరకాంతి. దానికి మరోపేరు సౌందర్యం. ముఖవర్చస్సు సౌందర్యాన్ని తెలుపుతుంది కదా! అసూయాద్వేషాలను దరికి రానియ్యకుంటే ముఖం దివ్యమైనతేజస్సుతో వెలుగుతుంది కదా!

మూడవఆభరణం వాక్కు. "నాలుకే ఏలిక". "నోరు మంచిదైతే ఊరంతా మంచిదే" అంటారు పెద్దలు. మన పలకరింపు అవతలవ్యక్తికి పులకరింపు కావాలి. సమయస్ఫూర్తితో కూడిన మాటలతో ప్రతి సన్నివేశాన్ని రక్తి కట్టిస్తుంది.


అజ్ఞానపుచీకటులను పారద్రోలే వెలుగు విద్య. ఇది నాల్గవ ఆభరణం. విద్య అంటే తెలుసుకోవడం. "చదువు పేదవానికి పెన్నిధి, సంపన్నునికి గౌరవం, ముసలివానికి ఆసరా". బాహ్యవిద్యకన్నా అంతర్‌విద్య ప్రధానమైనది.

ఐదవఆభరణం వినయం. వినయంతో సాధించలేనిది ఏదీ లేదు, వినయంతో, విద్యతో గల వినయవిధేయతలు మనిషికి చాలా ముఖ్యం. వినయంలేని విద్య, వాసనలేని పువ్వు లాంటిది. పెనుగాలిగానీ, తుఫానుగానీ నిటారుగా నిలబడిన పెద్దమానును కూల్చగలుగుతుందేగానీ, గడ్డిపరకను ఏమి చేయలేదు. అందుకే వినయం మనుగడకే ముఖ్యమైన అలంకారంగా భాసిల్లుతుంది.

పాత్రకోసం నటులు దిద్దుకొనే మెరుగులు, అలంకారాలను ఆహార్యం అని పిలుస్తారు. చూడగానే కంటికి ఇంపు కలిగించే చక్కనివస్త్రాలు, ఆహ్లాదకరమైన వేషధారణ, "ఆహా" అని అనిపిస్తుంది. కనుక, అది ఆహార్యం అయింది. గృహస్థ




ఎటువంటి వస్త్రధారణ, అలంకరణ చేయవచ్చో మనుస్మృతి వివరిస్తుంది. ఆహార్యంగురించి, ఆహ్లాదకరమైన అలంకరణగురించి సుమతిశతకకర్త ఇలా వివరించాడు. వేషభాషల తర్వాత ముఖకవళికలు ముఖ్యమనుకుంటే అది ఒక మనిషి మనస్సును ప్రతిబింబిస్తుందని విజ్ఞులంటారు. ఆందోళన చెందని మనస్సు చక్కనిభావాన్ని ముఖంపై ప్రకటింపచేస్తుంది.



క్షమ, ఓర్పు, సహనం అన్నింటికి మించిన ప్రేమ అనే వాటివల్ల మానవులకు తేజస్సు కలుగుతుందని వేదవ్యాసమహర్షులవారన్నారు. క్షమాగుణం సాధువులకు, వీరులకు అమూల్యమైన ఆభరణం. క్షమాగుణం చేతనే మానవులు మహాత్ములవుతారు. వారి క్షమాగుణం సహజంగా ప్రభావితం చేసి, పరాజయాన్ని జయంగాను, శత్రువులను మిత్రులుగాను మార్చి తాను అజాతశత్రువుగా మారుతాడు అనడంలో సందేహం లేదు.

వాల్మీకి శ్రీరామచంద్రుణ్ణి వర్ణిస్తూ శ్రీరాముడు సకలగుణాభిరాముడు. ఎప్పుడూ నవ్వుముఖంతో అందరినీ ఆకట్టుకునేవాడనీ, మితభాషి అనీ ఆయన నగుమోమే పదివేలు అని పేర్కొంటారు. ఆదిశంకరాచార్యులవారు 'తం సర్వాధిగురుం మనుజ్ఞ వపుసం మందస్మితలంకృతం' అని భావిస్తారు.


నాలుకవలన, అది స్ఫురించే మాటవలన సంపదలు కలుగుతాయి. చుట్టాలు, స్నేహితులు చుట్టుముడతారు. మనిషికి



కీర్తిని, అపకీర్తిని, ధర్మాధర్మాలను, పాపపుణ్యాలను ప్రాప్తింప జేసేది మాట మాత్రమే. ముఖానికి చిరునవ్వు అందమిస్తున్నట్లు, వాక్కు మనిషికి మంచి ఆభరణంగా భాసిల్లుతుంది. మాటను చక్కగా ఉపయోగించుకోవడం ఒక కళ. అందుకే "వాగ్భూషణమే భూషణం" అని అన్నారు.

వాల్మీకిరామాయణంలో కిష్కింధకాండలో సీతకోసం వెదకుతున్న రామలక్ష్మణులవద్దకు సుగ్రీవుని సచివునిగా లేక దూతగా హనుమంతుడు వచ్చి మాట్లాడిన తీరుకు, ఔన్నత్యానికి రాముడు ముగ్ధుడయి, లక్ష్మణునితో, హనుమంతుడు వ్యాకరణ శాస్త్రాన్ని బాగా చదువుకొన్నవాడిలా కనిపిస్తున్నాడు. ఎంతసేపు మాట్లాడినా ఒక్క అపశుభం కూడా దొర్లడం లేదు. ఇతని పలుకు హృదయంలో పుట్టి, మంద్రమై, కంఠగతమై మధ్యమ స్వరంలో అలరారుతూ ఇతనిమాటల్లో, వ్యాకరణసంస్కారంలో స్పష్టత ఉంది. వింటుంటే చంపడానికి కత్తిఎత్తిన శత్రువైనా సంతోషించకుండా ఉండలేడు. కత్తిని దించి వెళ్ళిపోతాడు అని పేర్కొన్నారు.

నాశరహితము అమృతమయినది విద్య అని అదే జ్ఞానమని, కఠోపనిషత్ చెబుతుంది. విద్యలు రెండురూపాలు. 1)పరవిద్య, 2)అపరవిద్య. దేనిద్వారా నాశరహితమైన మూల పదార్థం సాక్షాత్కారమవుతుందో దానిని పరవిద్య అంటామని ముండకోపనిషత్ అంటున్నది. "విద్య లేనివాడు వింత పశువు" అని భర్తృహరి సుభాషితం చెబుతుంది. విద్య వినయం తోడు నీడలు. విద్యకు,



వినయానికి, సంస్కారానికి అవినాభావసంబంధముంది. విడదీయలేని అనుబంధముంది. వినయం అనే మాటకు అణకువ, విధేయత అనే అర్థాలే కాక, జ్ఞానం అనే అర్థముంది. అందుకే విజ్ఞానిని వినీతుడు అని అంటారు. విద్య వల్ల ఎవరితో ఎలా ప్రవర్తించాలో నేర్చుకోవచ్చు. విద్య విశ్వాసాన్ని పెంచుతుంది. విశ్వాసముంటే విశ్వాన్ని జయించవచ్చు. విద్య అంటే తెలియనివిషయాన్ని ధర్మబద్ధంగా తెలుసుకోవడమని కదా! విద్యవలన విధేయత, విజ్ఞానం, ప్రవర్తనాసరళి అబ్బుతాయి. వినయసంపద ఎలా ఉండాలో భర్తృహరి తన సుభాషితాల్లో సృజనపద్ధతిలో వివరించాడు. కష్టాల్లో ధైర్యాన్ని, సంపూర్ణమైన వాక్‌నైపుణ్యాన్ని, విద్యయందు అధికమైన కోరికలు గలవారినే వినయశీలురైన సృజనులే అంటారు. వీరు ఉన్నదానిలో దానం చేస్తారు. కల్మషం లేని మనస్సు కలిగి ఉంటారు. సత్యవాక్కు కలిగి ఉంటారు. జీవులపట్ల కరుణ కలిగి ఉంటారు.



వినయం కలవారు అణకువ కలవారై ఉండి, వినయవిధేయలతో మిక్కిలి ఔన్నత్యాన్ని పొందుతారు. పరగుణ కీర్తనంచే తమ గుణాధిక్యతను ప్రకటిస్తారు. తాము సత్కార్యాలు చేస్తూ, పరులకు హితమైన కార్యాలను సూచిస్తూ సమర్థిస్తారు. కఠినంగా మాట్లాడేవారిని ఓర్పు, ధైర్యంచేత నెమ్మదిపరుస్తారు. అందుకే వారంతా గౌరవనీయులు. వినయశీలురు ఎలా ఉంటారో వేమన తన పద్యంలో.. 'కొంచెముండుటెల్ల కొదువ కాదు, కొండ అద్దమందు కొంచెమై ఉండదా' అని వినయానికి అణకువను ప్రస్తావించిన ఉపమానం ఎంత గొప్పదో గమనిస్తే, విశ్లేషిస్తే, విచారిస్తే తెలుస్తుంది కదా! నేటి, మేటి, పోటీప్రపంచంలో కమ్యూనికేషన్‌స్కిల్స్, బాడీలాంగ్వేజ్‌లు ఎందుకు ఇంత ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నాయో పైన ఉదహరించిన ప్రతీశ్లోకం వివరిస్తుంది. ఈ కార్పొరేట్‌యుగంలో, ఈ ప్రపంచీకరణంలో పోటీతత్త్వం ఒక తత్త్వంలాగా మారింది. కాబట్టి మాటతీరు, శరీరభాష ప్రముఖస్థానాన్ని ఆక్రమించాయి.




# తలచిన పలికేవు స్వామి!!

***- శ్రీమతి భాస్కర భారతీదేవి, 94412 76050***

కలియుగ ప్రత్యక్షదైవం అయిన శ్రీవేంకటేశ్వరస్వామి మా ఇలువేల్పు. కొలిచినవారికి కొంగుబంగారం అయిన ఆ స్వామి ఎన్నో సందర్భాలలో, ఎన్నోరకాలుగా, ఎందరో వ్యక్తులరూపంలో నన్ను ఆదుకున్నాడు.

ఒక జాతీయబ్యాంకులో ఉద్యోగం రావాలని నేను యథాలాపంగా అనుకోగానే అదే బ్యాంకులో నాకు ఉద్యోగం వచ్చింది. ఆ ఉద్యోగం సమర్థవంతంగా నిర్వహించి ముప్పై నాలుగుసంవత్సరాలు, ప్రతినిత్యం వేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో, ఆశీస్సులతో గడిచి పదవీవిరమణ కూడా చేయడం జరిగింది.

కానీ, ఉద్యోగంలో పదోన్నతి తీసుకుని చాలా కష్టాలు అనుభవించాను. అవన్నీకూడా స్వామికృపతో ధైర్యంగా ఎదుర్కొన్నాను. కానీ, ఒకానొకసందర్భంలో బేలనైపోయాను. అది ఎప్పుడంటే...

నేను పనిచేసే బ్రాంచిలో చాలా పని ఒత్తిడి ఉన్న సీటు నాది. సహోద్యోగులసహకారంతో ఎలాగో నెట్టుకొచ్చాను. కానీ ఒకరోజు నాకు చాలా చాలా మనసుకు, శరీరానికి కూడా కష్టం కల్గింది. అలసటకు మించిన స్థితిలో దస్సిపోయి ఇంటికి వచ్చాను. ఇంట్లో నా బాధను పంచుకుందామంటే ఆ క్షణంలో మా వాళ్లెవరూ ఇంట్లో లేరు.

లోపలికి రాగానే స్వామి, అమ్మవార్ల ఫోటో కనబడ్డది. వెంటనే ఒక స్నేహితుడికి చెప్పుకున్నట్లుగా, స్వామితో మాట్లాడి నా బాధనంతా చెప్పుకుని, దుఃఖం ఆపుకోలేక వలవలా ఏడ్చాను. “ఎందుకు నన్నింత కష్టపెడ్తున్నావు? అడగడానికి కూడా నాకు శక్తిసామర్థ్యాలు లేవు. కార్యాలయంలో అధికారులను ఎదుర్కొనేశక్తి కూడా నాకు లేదు. మూగగా బాధను అనుభవిస్తూ ఉంటే నువ్వు ఎందుకు నాకు సహాయం రావు? నిస్సహాయులను ఆదుకోవలసింది నువ్వే కదా? అందునా ఇక కొద్దినెలల్లో నా పదవీవిరమణ కూడా జరుగబోతుంది. ఈ వయసులో నాకెందుకింత మానసిక క్షోభ? శారీరకకష్టం? దిక్కులేనివారికి దేవుడే దిక్కు అంటారే! మరి నువ్వెందుకు నాకు అండగా రావు?” అంటూ ఒక మనిషితో పంచుకున్నట్లుగా నా బాధనంతా పూర్తిగా పంచుకున్నాను. బాగా ఏడ్చిన తర్వాత బాధను వెల్లగక్కిన తర్వాత, కొంత ఉపశమనంగా అనిపించింది. కానీ, రాత్రంతా కలతతో నిద్రపోయాను. ఆ రోజు శనివారం.

తెల్లవారింది. ఆదివారం గడిచింది. మళ్లీ మామూలుగా తయారయి కార్యాలయానికి వెళ్లాను. ఆ రోజు సోమవారం. విపరీతంగా పని ఉన్నది. ఎలాగో సాయంత్రందాకా పని చేశాను.


ఆరుగంటలకు ఒక ఖాతాదారుడు గోవిందమాల వేసుకుని, ముఖంపై నామాలతో, పచ్చనివస్త్రం కట్టుకుని, పచ్చని కండువా వేసుకుని నా సీటుదగ్గరికి వచ్చాడు.

ప్రొద్దున అతను వచ్చి అడిగి వెళ్లిన పని నేను సాయంకాలం అయినా చేయలేకపోయాను. పనిఒత్తిడివలన. అందుకు అతను కాస్త కోపం చేసుకుని నేను ఎందుకు చేయలేకపోయానో అతనిపని అని విశ్లేషించడం మొదలుపెట్టి, నేను ముందురోజు స్వామి ముందు నిల్చుని అడిగిన మాటలన్నీ అనడం మొదలుపెట్టాడు. మా మేనేజరుగారితో, నా తరపున నిలబడి నా బాధనంతా, ఎంతో అర్థం చేసుకున్నవాడిలా పోట్లాటకు దిగాడు.

నాకు సంభ్రమం! మరియు ఆశ్చర్యం!! మరోవైపు ఆనందంతో కళ్లవెంబడి నీళ్లు కారిపోయాయి నాకు.

‘ఈ సీట్లో అవిడకు చాలా పనిఒత్తిడి ఉంది సార్! ఎప్పుడూ నిరంతరంగా పని చేస్తూనే ఉంటారు. ఎందుకు కొంత పనిని మీరు వేరేవారికి పంచవచ్చు కదా? ఈ వయసులో ఆవిడ ఆరోగ్యం పాడయితే, మీరు మందులు కొనడానికి డబ్బులు ఇస్తారేమో కానీ, ఆరోగ్యాన్ని ఇవ్వలేరు కదా? వారంలో ఏ రోజు వచ్చినా ఆవిడ ఏదో ఒక పనిఒత్తిడితో ఉంటారు.

పొద్దున వచ్చి అడిగాను నాకు స్టేట్‌మెంటు కావాలని. సాయంత్రం రమ్మన్నారు. మళ్లీ ఇప్పుడేమో ఇంకా ప్రింటే తీలేదంటున్నారు. ఏంది సార్ ఇది...' ఈరకంగా సాగింది అతని మాటతీరు.




మూగగా నేను అనుభవిస్తున్న బాధనంతా అతను అర్థం చేసుకుని, నా తరపున మా మేనేజరును అడగడం నిజంగా స్వామివారే అతనిరూపంలో వచ్చి నాకు అండగా నిలబడినట్లు అని పించింది.


నేను అడగలేనివి, నేను పంచుకోలేనివి అన్నీకూడా అతను పదహైదునిముషాలపాటు ఎటువంటి కామా కూడా పెట్టకుండా అడగడం నాకు, ముందురోజు నేను పంచుకున్న బాధ, ఏడుకొండలపైన ఉన్న ఆ స్వామికి అర్థం అయి, గర్భగుడినుంచి వచ్చి, గోవిందమాలను వేసుకున్న భక్తునిరూపంలో వచ్చి నా మనసుకు అయిన గాయానికి ఆ మాటలతో ఆయింట్‌మెంటు పూసినట్లుగా అనిపించింది.

ఆనందంతో ఆ రోజు పని పూర్తి చేసుకొని ఇంటికి వచ్చి, స్నానాదికాలు పూర్తి చేసుకుని, దీపం వెలిగించి, మన స్ఫూర్తిగా స్వామివారికి కృతజ్ఞతలు తెలియచేసుకున్నాను.

వెంటనే నాకు పదకవితాపితామహుడైన శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యులవారి కీర్తన “ఆది మూలమే మాకు అంగరక్ష, శ్రీదేవుడే మాకు జీవరక్ష” జ్ఞాపకం వచ్చి ఆనందంగా ఆ కీర్తనను ఆలపిస్తూ, తేలిక అయిన మనస్సుతో నిద్రకు ఉపక్రమించాను. ఈవిధంగా ప్రతి ఆపదలో, ప్రతికష్టంలో ఆదుకునే స్వామివారంటే నాకు ఎనలేని భక్తి.

*ఓం నమో వేంకటేశాయ!!*

## శ్రీవారి జ్యేష్ఠాభిషేక మహోత్సవం, తిరుమల



*(2022, జూన్ 12 నుండి 14 వరకు)*

| తేదీలు | వారము | ఉత్సవములు |
|---|---|---|
| 12-06-2022 | ఆది | వజ్రకవచసమర్పణ |
| 13-06-2022 | సోమ | ముత్తంగికవచసమర్పణ |
| 14-06-2022 | మంగళ | సువర్ణకవచసమర్పణ |

# వరం

-డా॥నందుల గోపాలకృష్ణమూర్తి,8985042679

కాశీరాజు పుత్రికలు అంబ, అంబిక, అంబాలిక. వారిలో పెద్దకుమార్తె అంబ. పుత్రికలు యుక్తవయస్సు వచ్చి నంతనే కాశీరాజు వారిని అలంకరింపజేసి, స్వయంవరోత్సవం ప్రకటించాడు. భీష్ముడు, తన తమ్ముడైన విచిత్రవీర్యునకు పెండ్లి చేయదలచి, స్వయంవరోత్సవమునకు వచ్చిన రాజులను



జయించి ఆ ముగ్గురిని రథారోహణం చేయించి ఇంటికి తీసు కొచ్చాడు. శాంతనవుడు ఆ ముగ్గురిని తన తమ్మునికిచ్చి పెండ్లి చేయదలచాడు. అప్పుడు అంబ తాను సాళ్వుని ప్రేమించానని, అతనివద్దకే తనను పంపమని కోరింది. భీష్ముని తల్లి సత్యవతి వృద్ధాంగనలతో సాళ్వునివద్దకు అంబను పంపింది.

సాళ్వుడు ఉడుకుమోత్తనంతో భీష్మునిపై కోపంతో, అంబను తిరస్కరించాడు. అంబ దీనంగ జరిగిన సంగతి వివరించి, బతిమాలింది. మా తండ్రికి నా అభిప్రాయం తెలి యకపోవటంతో ఇలా జరిగిందని విన్నవించింది.

సాళ్వుడు, ఆమె దీనాలాపాలను ఎంతమాత్రము వినక, భీష్ముడు తీసుకెళ్లిన పడుచును (ఎఱువుసొమ్మును), స్వీకరింపలేను అంటూ పోపొమ్మని అవమానించి మందిరంనుండి గెంటివేశాడు.

అంబవంటి కన్యకు ఇంతకంటె విషాదమేముంది? ఆమెలో మాత్సర్యం పెల్లుబికింది. దీనికంతటికీ ముఖ్యకారకుడు భీష్ముడేయని గ్రహించింది. ఈ సన్నివేశం పరిశీలించినచో మానవులు ప్రేమించు వ్యక్తిదోషము గుణముగ తోస్తుంది. మధ్యలో భీష్మునిపై కోపం పూనింది. మానవమనస్తత్వం మనసులో ఉంచుకొంది. ఒక సామెత ఆంధ్రదేశమున ప్రచారం పొందింది. అదే "అత్తమీది కోపము దుత్తమీద" అన్నట్లు.

అంబ ఒకడిని కాదన్నది. ఒకడు ఆమెను కాదన్నాడు. ఇదియే ప్రపంచంలో జరిగే పరమేశ్వరలీల.

ఆమె గాంగేయునిమీద కత్తిగట్టింది. తపస్సు చేయటమే మంచిమార్గమని విశ్వసించింది. మునీశ్వరులున్న పుణ్యస్థలికి వచ్చి తన వృత్తాంతం చెప్పింది.

వారు పెద్దమనసుతో ఈ విధంగా హితోపదేశం చేశారు. "రాజులు చేసిన పని సాధులచేత చక్కబడునే? నీవు రాజపుత్రివి. సుకుమారివి. తండ్రివద్దకు వెళ్లటమే భావ్యమని చెప్పారు.

ఆ మాటలు అంబకు రుచించలేదు. రెట్టించిన ఉత్సాహం పెరిగింది. ఈ పరిస్థితిలో తండ్రి ముఖం ఎలా చూడగలను? ఈ అవమానం తీర్చుకోవాలంటే తపస్సే మంచి సాధనమని తలచింది.

అంబ మునీశ్వలున్న ప్రదేశమున తపస్సు చేస్తూండగా అక్కడికి "హోత్రవాహనుడను రాజర్షి" వచ్చాడు. ఆ కన్యను తన మనుమరాలుగా గుర్తించి, అంబకు జరిగిన అవమానం తీరుస్తానంటూ బుజ్జగించాడు. హోత్రవాహనుడు- తన మిత్రుడు పరశురాముడనియు, అతనితో చెప్పి నీ శోకం పోగొడతానంటూ మాటిచ్చాడు.

ప్రియశిష్యుడైన అకృతవ్రణునిద్వారా పరశురాముడు ఎక్కడ ఉన్నాడో తెలిసికొన్నాడు. అక్కడికి హోత్రవాహనుడు ప్రియమైన మనుమరాలిని తీసుకొని వెళ్ళి, అంబను తన వృత్తాంతమంతా చెప్పుమన్నాడు.

అంబ స్త్రీ సహజమైన కన్నీరుతో తనకు జరిగిన అవమానం గురించి వివరించింది. "ఈ సందర్భం పరిశీలిం పగా ఆ స్త్రీ తనకు జరిగిన అవమానానికి భీష్ముడే కారణమని భావించటం, మాత్సర్యం పూనటం, పెద్దలు ఎంత చెప్పినను వినకపోవటం, ఆత్మోద్ధరణకు, పరబ్రహ్మము సాక్షాత్కారానికి కాక

భీష్ముని సాధించుటకు తపస్సును సాధనంగ చేసికొనటం గమనార్హం. లోకంలో స్త్రీ తనలోని బలహీనతలను ఆదర్శంగ తీసికొనరాదని మనకు ప్రబోధం.

పరశురాముడు అంబను వెంటపెట్టుకొని భీష్ముని సమీపించి ఇలా ఆజ్ఞాపించాడు.

"అంబను బలవంతంగ ఏల తెచ్చావు? ఈమెను నీ తమ్మునికిచ్చి పెండ్లి చేయుము."

భీష్ముడు-ఈ అధర్మం చేయలేనని ఖరాకండిగా చెప్పేశాడు.

గురువుగారు చెప్పారని అధర్మం చేయవచ్చునట. ఇట్టి సందర్భంలో ధర్మసూక్ష్మం వ్యాసమహర్షి భీష్మపాత్ర ముఖమున చెప్పించాడు.

గర్వియై కార్యమిట్టిది, అకార్యమిట్టిదని ఎఱుంగక వర్తించునట్టి గురువైనను సరే దండింపవలసిందే (భా. ఉ. చ. 309.) అని భారతవచనం.


ముక్కోపి ఐన పరశురాముడు భీష్మునితో యుద్ధానికి కాలుదువ్వాడు. భీకరయుద్ధంలో పరశురాముడు ఓడిపోయాడు. ఐనా భీష్ముడు యథోచితంగ గురువును గౌరవించాడు.

అంబ గత్యంతరంలేక అత్యుగ్రతపస్సు చేయనారంభించింది. గంగాదేవి, అంబ తపస్సుచేయటం చూచి మనసు కరిగి ఈ విధంగా హితవు పలికింది.

నీవంటి సుకుమారికి, రాజపుత్రికకి దుష్కరమైన ఇలాంటి తపస్సు తగదనియు, ఈ ప్రయత్నం మాని నీ పుట్టింటికి వెళ్లుమని శతవిధాల చెప్పింది. అంబ ఆ మాటలు విని పించుకోలేదు. తన మాట వినలేదని గంగ కోపించి అంబను వంకరటింకరగా ప్రవహించు నదియై ఉండుమని శపించింది.

అంబ ఆ మాటలకు - నీవు నాకు చెప్పవచ్చావా? అని అనాదరమందహాసముచేసింది. తన సగభాగం నదిగా మారినా మిగిలిన సగభాగంతో రుద్రునిగూర్చి ఘోరతపస్సు చేసింది. రుద్రుడు ప్రత్యక్షమై జన్మాంతరమున భీష్ముని సంహరించే వరం ప్రసాదించాడు.

అంబ అగ్నిప్రవేశం చేసి జన్మాంతరమున భీష్ముని చంపే ప్రయత్నం చేసింది. భగవద్గీతలో జీవులు తమ మరణకాలమున ఏ కోరికలతో మరణిస్తారో, ఆ కోరికలతోనే పుడతారట.



అంబ ద్రుపదపుత్రికగా పుట్టింది. తల్లిదండ్రులు ఆమెను పుత్రుడుగా ప్రకటించి, ద్రోణునివద్ద శస్త్రాస్త్రములు అధ్యయనం చేయించారు. రుద్రునిమాటప్రకారం దశార్ణ దేశపురాజైన, హేమవర్మపుత్రికకు ఇచ్చి పరిణయం చేశారు. ఆ తర్వాత పుత్రుడు కాదు పుత్రిక అని గుర్తించారు. మోసంచేసిన ద్రుపదునిపై దండెత్తారు.

తనమూలంగా తన తల్లిదండ్రుల పరువుపోయిందని విచారించి అరణ్యాలకు వెళ్లిపోయింది. తపస్సుచేయసాగింది. అప్పుడు స్థూలకర్ణుడు అను యక్షుడు, ఆమెను చూచి, ఆమె మొర ఆలకించి, దయతో ఆమెకు తన పురుషత్వమిచ్చాడు.

అలా శిఖండిగా పిలువబడింది. కొండను త్రవ్వి ఎలుకను పట్టినట్లు భీష్ముని మహాభారతయుద్ధంలో సంహరించింది. మాత్సర్యం మానవులకు ఎంతమాత్రము తగదని ఈ కథ సూచిస్తోంది.

జూన్, 2022

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం**–జన్మరాశియందు రాహుదోష నివారణకు సుబ్రహ్మణ్య ఆరాధన మంచిది. ప్రయత్నించిన కార్యజయం. ధనలాభం, మనస్సౌఖ్యం, వృథాకాలయాపన జరుగుతుంది. వృత్తి, ఉద్యోగవిషయాల్లో శ్రద్ధ అవసరం.



**వృషభం**– ఉద్యోగంలో ఉన్నతితోకూడిన స్థానచలనం వస్తుంది. భూగృహ స్థిరాస్తుల మార్పులు, ముందు అవసరాలకు కావల్సిన ధనము నిల్వ చేస్తారు. ఆకస్మిక ధనలాభం మిమ్మల్ని వరిస్తుంది.



**మిథునం**– ధనవ్యయం. స్థానభ్రంశం. పనులు ఆలస్యమవటం, త్రిప్పటగల ఉద్యోగాల్లో జేరటం. సంతానంవిషయంలో గృహమున శుభకార్యాచరణ చేస్తారు. సన్మార్గాన్ని ఎంచుకుని ఆధ్యాత్మికంగా పయనిస్తారు.



**కర్కాటకం**–సమస్తైశ్వర్యాలు వృద్ధి అవుతాయి. వ్యవసాయదారులకు పంటలు పుష్కలంగా పండి ధనం చేకూరుతుంది. గతంలో చేసిన బాకీలు తీరుతాయి. వివాహాది శుభకార్యక్రమాల్లో పాల్గొంటారు.



**సింహం**– గ్రహస్థితి సామాన్యం. మంచి ఆరోగ్యం, సుఖం, పోయిన ద్రవ్యాలు లభిస్తాయి. సంఘంలో గౌరవం పెరుగుతుంది. ధనలాభం.



**కన్య**–కాంట్రాక్టర్లు, వ్యాపారులకు ఆర్థికాభివృద్ధి. ఉద్యోగులకు, శాస్త్రవేత్తలకు ప్రశంసలు. వృత్తివ్యాపారాల్లో పోటీతత్వం. కళత్రసౌఖ్యం, శరీరఆరోగ్యం సామాన్యం. రవాణాసంబంధవ్యాపారాలు బాగా కలసివస్తాయి.



**తుల**– స్వల్పభోజనం, అలసత్వం, హృదయ పరితాపం, ఉద్యోగంలో జగడం, అధికారుల ఒత్తిడి, వస్తువులను పోగొట్టుకోవడం జరుగుతాయి. సుబ్రహ్మణ్యఆరాధన చేయటం మంచిది.



**వృశ్చికం**–మాసారంభంలో స్వజనులతో వైరం, తదుపరి ధైర్యయుక్తమైన పనులు సాధించి అందరి మన్ననలు పొందుతారు. భూలాభం కల్గుతుంది. పశుసంపదను వృద్ధి చేస్తారు. ధనలాభం కల్గుతుంది.



**ధనుస్సు**– వస్త్రలాభం, గ్రహస్థితి అనుకూలం, శత్రుజయం కల్గుతుంది. నూతనంగా పెట్టుబడులు అనుకూలిస్తాయి. శుభకార్యాచరణ ఉంటుంది. ధైర్యంతో సాధిస్తారు. విద్యావికాసం కల్గుతుంది.



**మకరం**–గృహంలో కల్యాణాది శుభయోగాలు, మంగళతోరణాలు, బంధుమిత్రసమాగమం, మృష్టాన్నభోజనం, వృత్తివ్యాపారాలు సామాన్యం. ఇతరత్రా ఆదాయమార్గాలను అన్వేషిస్తారు.



**కుంభం** – క్రియాశీలత్వం లేకపోవటం, గృహంలో ఇబ్బందులున్ననూ అన్నింటిని అధిగమించి ధైర్యంతో ముందుకు సాగుతారు. ఆదాయం నిల్వచేస్తారు. వృత్తివ్యాపారాలు కలసివస్తాయి.



**మీనం**–మంచి ముఖవర్చస్సుతో ఇతరులకు ఆకర్షణగా ఉండి కార్యభారాన్ని అలసట లేకుండా తేజస్తత్వంతో అన్ని పనులను జయించుకుని వస్తారు. నిరుద్యోగులకు అనుకూల సమయం. విదార్థులకు విదేశీఅవకాశాలు కలసి వస్తాయి.



దైవబలం లేకపోతే అన్నింటా ఓటమే

# సంస్కృతం నేర్చుకుందాం..!!

పాఠం-16

రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కాశీ కృష్ణాచార్య నిర్వహణ- మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య

| | | | | | |
|---|---|---|---|---|---|
| कलशः | = చెంబు | सम्यक् | = బాగుగా | कुर्यात् | = చేయును, వలెను - చాలును |
| अलम् | = చాలును | जलम् | = నీరు - నీటిని | कुर्याः | = చేయుదువు, వలెను - చాలుదువు |
| मञ्चः | = మంచము | झटिति | = శీఘ్రం=త్వరగా | कुर्याम् | = చేయుదును, వలెను - చాలుదును. |

విధ్యాద్యర్థకము

అ) ఈ క్రింది వాటికి తెలుగులోకి అనువాదం చేయండి?

01) बालकाः मञ्चे आसन्।
02) कलशे जलम् अस्ति वा?
03) जलं सम्यक् नास्ति।
04) एषः अस्मद् मञ्चः।
05) युष्मत्कलशाः कुत्र सन्ति?
06) यूयं पाकं झटिति कुरुत।
07) अद्य पाकं कः कुर्यात्?
08) त्वं शाकं कुर्याः, अहं पाकं कुर्याम्।
09) त्वम् एकः एव शाकं कुर्याः किम्?
10) अहम् एकोऽपि पाकं शाकमपि सम्यगेव कुर्याम्।

అ) జవాబులు

01) బాలురు మంచమునందు ఉండిరి.
02) చెంబునందు నీరు ఉన్నదా?
03) నీరు బాగుగా లేదు.
04) ఇది మాయొక్క మంచము.
05) మీ చెంబులు ఎక్కడ నున్నవి?
06) మీరు త్వరగా వంట చేయుడు.
07) ఇవ్వేళ వంట ఎవరు చేయవలెను?
08) నీవు కూరను చేయుము, నేను వంట చేయుదును.
09) నీవు ఒక్కడివే కూర చేయుదువా ఏమి?
10) నేను ఒక్కడినే వంటను, కూరను కూడా బాగుగానే చేయుదును.

ఆ) ఈ క్రింది వాటికి సంస్కృతంలోకి అనువాదం చేయండి?

01) చాలుగాని మీరు త్వరగా స్నానము చేయుడు.
02) మీరు చెఱువులో స్నానము చేయవద్దు.
03) వారు వంట చేయుదురుగాక.
04) మీ యిల్లెక్కడ నున్నది?
05) మా యిం డ్లక్కడ నున్నవి.
06) నీవు త్వరగా భోజనము చేయవలెను.
07) నే నిపుడు చేయను.
08) తరువాత చేయుదును.
09) అక్కడ నెందఱు పిల్లలు భోజనము చేసిరి?
10) అక్కడ నొక్కడును భోజనము చేయలేదు.


ఆ) జవాబులు


01) अलम्, यूयं झटिति स्नानं कुरुत।
02) यूयं तटाके स्नानं न कुरुत।
03) अस्मद्गृहे जलमस्ति; तत्र स्नानं कुरुत।
04) युष्मद्गृहं कुत्रास्ति?
05) अस्मद्गृहाणि तत्र सन्ति।
06) त्वं झटिति भोजनं कुर्याः।
07) अहं इदानीं न कुर्याम्।
08) अनन्तरं कुर्याम्।
09) तत्र कति बालकाः भोजनम् अकुर्वन्?
10) तत्र एकोपि भोजनं न अकरोत्।

చిత్ర కథ

# నమ్మాళ్వార్



కథ- శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు
చిత్రాలు- శ్రీ కె.తులసీప్రసాద్



తనమీద రాసిన కీర్తనల్ని విని శ్రీరంగనాథుడు మైమరచిపోయేవాడు. స్వామి స్వయంగా వచ్చి విని...
ఆళ్వారూ! నువ్వు నన్ను కీర్తించకపోతే నాకు నిద్రపట్టదు. నువ్వు నా ఆళ్వార్‌వి. నమ్మాళ్వార్‌వి!
ఇది నా అదృష్టం శ్రీరంగనాథా!
నమ్మాళ్వార్‌కి అంతిమఘడియలు సమీపించాయి. అప్పుడు శ్రీరంగనాథుడు ప్రత్యక్షమై...
ఆళ్వార్! ఏం కావాలో కోరుకో!
నాకేమీ వద్దు. అందరికీ నీ అనుగ్రహం అందాలి.
ఎలాగో చెప్పవూ
స్వామీ! నీ పాదుకల్ని నా తలపై ఉంచి ఆ శఠగోపంతో భక్తులకి నా పుణ్యాన్ని పంచాలి... ఇదే నాకోరిక
తథాస్తు... శఠగోపమునిగా నిన్ను కీర్తిస్తారు ఆళ్వార్!
స్వార్థం లేని లోకకల్యాణ కాంక్ష నీది. స్వస్తి....
శఠగోపముని, పరాంకుశులు, వకుళాభరణులు, తిరుక్కోరూర్‌నంబి అని పిలువబడే నమ్మాళ్వార్ పన్నిద్దరాళ్వార్‌లలో చేరిపోయారు.
లోకాః సమస్తాః సుఖినో భవన్తు

## విశ్వదాభిరామం వేమన పద్యసూక్తి



# ఇంటికి దీపం ఇల్లాలు

**గుణవతి యగుభార్యగృహము చక్కగ నుండు,**
**చీకటింట దివ్వె చెలగురీతి;**
**దేవి యున్నయిల్లు దేవార్చనగృహంబు;**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**


**అర్థాలు:** గుణవతి= ఉత్తమురాలు; గృహము= ఇల్లు; చెలగు= ప్రకాశించు; దేవి= దేవత; దేవార్చన గృహము= దేవతలను పూజించే ఇల్లు (పూజ గది).

**భావం:** చీకటింట్లో దీపం ప్రకాశించేవిధంగా, గుణవతి ఐనభార్య ఉన్నఇల్లు చక్కగా ఉంటుంది. (భార్య గుణవతి కాకుంటే ఆ ఇల్లు చీకటిల్లు. గుణవతి యైనభార్య ఆ చీకటింటికి దీపం.) గుణవంతు రాలైనభార్య ఉన్న ఇల్లే పూజింపబడేదేవతలు కలిగిన ఇల్లు. (ఆ భార్యే దేవత)

**వివరణ:** దంపతులిద్దరు కుటుంబానికి మూలస్తంభాలు. ఆ ఇంట్లో పెద్దతరం ముదుసలివారు, చిన్నతరం పిల్లలు ఉంటారు. భర్త పొలం, వ్యాపారం వంటి బయటిపనులు చూస్తే, భార్య కుటుంబ సభ్యులను, ఇంటికి వచ్చిపోయే అతిథులను, చుట్టాలను చూచుకొంటూ ఇంటికి శోభ తెస్తుంది. గుణవంతురాలైన భార్య మగనికి అండదండగా ఉంటే, ఆ ఇల్లు దేవత కొలువు దీరిన గుడి అవుతుంది. ఇల్లు చూసి ఇల్లాలిని చూడు అన్నారు. ఇల్లాలు మంచిలక్షణాలు కలిగి ఇంటికి వెలుగు తేవాలని భావం.

**- కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు**

# 77 వైకుంఠపాళి



**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

### అడ్డం

1)జరాసంధుని తాత(8); 6)కంసునిదాసి(2); 7)శివుడు(3); 8)నకులుని తల్లి(2); 11) రంధ్రము(3); 12)ఆగ్నీధ్రుని కుమారుడు(3); 16)వృషితాశ్వుడనురాజు భార్య(2); 17)ప్రాంశువు కుమారుడు(3); 18)గుల్మము(2); 21)ఏ నగరంలో 'శ్రీనివాససేతు' నిర్మింపబడింది(4); 22)విఘ్నేశ్వరుడు(4)

### నిలువు

1)గౌతమమహర్షి శిష్యుడు(4); 2)యదువు నాల్గవకుమారుడు(2); 3)దిలీపుని కొడుకు(3); 4)అమృతం(2); 5)పార్వతి(3); 9)నిషధ దేశపురాజు(3); 10)తపతియగు సూర్యకన్యయందు కల్గిన పుత్రుడు(3); 13)విజితాశ్వుని రెండవభార్య(4); 14)సుకన్య కుమారుడు(3); 15)బ్రహ్మ(4); 19)ఈ అవతారంతో విష్ణువు సోమకాసురుని సంహరించాడు(2); 20)పూలను కలిపి దండ చేయునది(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.
- ప్రధాన సంపాదకుడు


స్త్రీలు పూజింపబడేచోట దేవతలు కొలువై ఉంటారు

బాలనీతి

# అవును!!

– శ్రీమతి ఆసూరి ఉషారాణి,
*94416 46016*

ఒకరోజు శ్రీకృష్ణుడు, అర్జునుడు ఇద్దరూ ఉద్యానవనంలో కూర్చొని ప్రకృతిని ఆస్వాదిస్తున్నారు. అప్పుడు కృష్ణుడు అర్జునుడితో ఆకాశంవైపు చూపి "ఆ ఎగురుతున్న పక్షి పావురమే కదా" అని అడిగాడు.

అర్జునుడు "అవును కృష్ణా! అది పావురమే" అన్నాడు. మరికాసేపటికి కృష్ణుడు మళ్ళీ ఇలా అన్నాడు. "అబ్బే! అది పావురం కాదు గ్రద్దలా ఉంది చూడు చూడు"

"అవును నిజమే! అది పావురం కాదు అది గ్రద్దనే కృష్ణా" అన్నాడు అర్జునుడు.

కృష్ణుడు కొంటెగా నవ్వుతూ మళ్ళీ కాసేపటికి ఇలా అన్నాడు. "అర్జునా! అది గ్రద్ద కానేకాదు. అది చిలుక. సరిగ్గ చూడు ఒక్కసారి"

"నిజమే కృష్ణా! అది చిలుకనే" అన్నాడు అర్జునుడు.

చివరిసారిగా మరోసారి పరీక్షిద్దామని ఇలా అన్నాడు కృష్ణుడు.

"అయ్యో! అది చిలుక కూడా కానేకాదు. అది కాకి అర్జునా! ఒక్కసారి పరికించి చూడు"


"అరే! నిజమే అది చిలుక కాదు కాకే కృష్ణా!" అన్నాడు అర్జునుడు. కాస్త కోపంగా కృష్ణుడు అర్జునుడితో ఇలా అన్నాడు. "అసలు నీకు బుద్ధి ఉందా? నీకంటూ ఒక అభిప్రాయం ఉండదా?"

సొంతంగా ఆలోచించలేవా? "నేను ఏదంటే అదే అని వంత పాడుతున్నావు" అన్నాడు.

ఆ మాటలకు అర్జునుడు ఇలా సమాధానం ఇచ్చాడు.

"ఓ సర్వాంతర్యామీ! నేను నిన్నే నమ్ముకుని బ్రతుకు తున్నవాడను. నువ్వు ఏదంటే నేనూ అదే అంటాను! మీరు పావురం అనే కదా అన్నారు."

నేను కాదు అంటే దాన్ని పావురంగా మార్చే శక్తి మీకు ఉంది. నాకు అన్నీ మీరే. మీ మాటే నాకు వేదం కృష్ణా!



ఆ నమ్మకమే భగవంతుడే అర్జునుడిప్రక్కన ఉండేలా చేసింది. అనుమానం ఉండకుండా దేవునిపై నిజమైన నమ్మకాన్ని ఉంచుకుందాం. మనం ఎలాంటి పరిస్థితిలో ఉన్నా ఆ పరిస్థితిని మార్చగలిగే శక్తి ఆ పరమాత్మునికే ఉంది. మనకు కావలసింది ఏదో ఆ దేవునికి తెలుసు. ఎప్పుడు మనకు ఇవ్వాలో మననుండి ఎప్పుడు తీసుకోవాలో అవన్నీ కూడా ఆ దేవుడికే తెలుసు. కాబట్టి మనమంతా భగవం తునిపై నమ్మకంతోనే జీవిద్దాం.

# బాలవినోదం

పిల్లలూ... మీ మేధకు పదును పెట్టండి....

నిర్వహణ: శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి

## కదంబం

### దశ దిక్పాలకులు

01) తూర్పు- ఇంద్రుడు
02) ఆగ్నేయం- అగ్ని
03) దక్షిణం- యముడు
04) నైఋతి- నిర్బతి
05) పడమర- వరుణుడు
06) వాయువ్యం- వాయుదేవుడు
07) ఉత్తరం- కుబేరుడు
08) ఈశాన్యం- ఈశానుడు
09) ఊర్ధ్వదిక్కు- బ్రహ్మ
10) అధోదిక్కు- విష్ణువు

### పిల్లలూ..జతచేయండి!!

| | | | |
|---|---|---|---|
| 1) | రాజసూయయాగం | అ) | దశరథుడు |
| 2) | సర్పయాగం | ఆ) | శ్రీరాముడు |
| 3) | పుత్రకామేష్టియాగం | ఇ) | బలిచక్రవర్తి |
| 4) | అశ్వమేధయాగం | ఈ) | జనమేజయుడు |
| 5) | విశ్వజిత్‌యాగం | ఉ) | ధర్మరాజు |

జవాబులు: 1-(ఉ); 2-(ఈ); 3-(అ); 4-(ఆ); 5-(ఇ)

### మీకు తెలుసా?



1) శ్రీగోవిందరాజస్వామివారి జన్మనక్షత్రం?
2) దుర్యోధనుని ప్రాణస్నేహితుడు?
3) తిరుమలస్వామికి మొదటినైవేద్యం?
4) ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రం?
5) హిందువులకు పవిత్రమైన జంతువు?
6) తిరుమలస్వామిని బంగారుపుష్పాలతో పూజించిన భక్తుడు?
7) ఇదిలేని దేవాలయం ఎక్కడా కనిపించదు?

1) ఉత్తరఫల్గుణి
2) కర్ణుడు
3) మాతృదధ్యోదనం
4) తిరుమల
5) గోవు
6) తొండమానుడు
7) ధ్వజస్తంభం

### కనుక్కోండి


ఈ అక్షరాలతో ఒక సూక్తి వస్తుంది...

చె క చె వ వి అ చె వ వ
న డు ద్దు డు ద్దు ద్దు న డు న

జవాబు:
చెడు కనవద్దు
చెడు వినవద్దు
చెడు అనవద్దు

### చిత్రలేఖనం

ఈ క్రింది బొమ్మకు రంగులు వేద్దామా...



ఈ పక్కన ఉన్న బొమ్మను క్రింది గడులలో గీయండి...

Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.




05-05-2022న తిరుపతిలో శ్రీ వేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రముఖ్యమంత్రి గౌ॥ శ్రీ వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డిగారు, ఇతర ప్రముఖులు మరియు ఉన్నతాధికారులు





05-05-2022న శ్రీ పద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, తిరుపతి ప్రారంభోత్సవ శిలాఫలకం ఆవిష్కరణ మరియు భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రముఖ్యమంత్రి గౌ॥ శ్రీ వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డిగారు, ఇతర ప్రముఖులు మరియు ఉన్నతాధికారులు




05-05-2022న తిరుపతి, ఎస్.వి.బి.సి. ఆన్‌లైన్ రేడియో లోగో ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రముఖ్యమంత్రి గౌ॥ శ్రీ వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డిగారు, మంత్రులు, ఉన్నతాధికారులు మరియు ఇతర ప్రముఖులు.




05-05-2022న తిరుపతిలో శ్రీనివాససేతును ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రముఖ్యమంత్రి గౌ॥ శ్రీ వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డిగారు



05-05-2022న శ్రీనివాసమంగాపురం, శ్రీవారిమెట్టు మార్గ పునఃప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డిగారు, ఇతర ప్రముఖులు మరియు ఉన్నతాధికారులు



ఆ.ప్ర. రాష్ట్రదేవదాయశాఖ ప్రధాన కార్యదర్శి అయిన శ్రీ అనిల్‌కుమార్‌సింఘాల్, ఐ.ఏ.ఎస్., గారు తి.తి.దే. పాలకమండలి ఎక్స్‌అఫిషియోసభ్యులుగా 29-04-2022న బాధ్యతలు స్వీకరించారు



తి.తి.దే. కార్యనిర్వహణాధికారి(ఎఫ్.ఏ.సి.)గా 08-05-2022న పదవీబాధ్యతలు స్వీకరించిన శ్రీ ఏ.వి.ధర్మారెడ్డిగారు, ఐ.డి.ఈ.ఎస్.

SAPTHAGIRI (TELUGU) ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams printing on 25-05-2022 and posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd.No.TRP/155/2021-2023 "Licenced to post without prepayment No.PMGK/RNP/WPP-04(1)/2021-2023" posting on 5th of Every Month.



**శ్రీగోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాలు**

**(05-06-2022 నుండి 13-06-2022 వరకు)**